
# మహామలుపులూ మహానీయులు

వకుళాభరణం రామకృష్ణ




ప్రజాశక్తి బుక్‌హౌస్

91738

FOR FAVOUR OF REVIEW

# మహో మలుపులూ మహనీయులూ

ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

ప్రజాశక్తి బుక్‌హౌస్
ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

C.14909

91738

హైదరాబాద్-500 044

ప్రచురణ సంఖ్య : 1087

ప్రథమ ముద్రణ : జూలై, 2009

వెల : రూ. 30/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక

ముందుమాట 5

## అంతర్జాతీయం

మేగ్నకార్టా ప్రపంచ హక్కులకు పునాది 7
చికాగోలో రేగిన నిప్పురవ్వ 9
చేతిలో లాంతరు 19
సామ్యవాద విప్లవం 29
సూర్య కేంద్ర సిద్ధాంతం శాస్త్ర విజ్ఞానంలో ముందంజ 31
మానవాళి చరిత్రను మార్చిన మానిఫెస్టో 44
డార్విన్ పరిణామ సిద్ధాంతం 46
సోవియట్ రష్యా విప్లవ సారథి లెనిన్ 53
విస్ఫోటనం నుండే శాంతి సత్కారాలు 56
నాజీ నియంత చివరిరోజు 59
ఆంగ్లేయులకు తొలి దెబ్బ ఎన్‌ఫీల్డ్ రైఫిల్ 67
వారేవ్వా... టెన్నిస్ కోర్టు 73
హిట్లర్‌ను సాగనంపిన యుద్ధం 77
హత్య సాకుతో మొదటి ప్రపంచ యుద్ధం 85
చిన్న యుద్ధం - పెద్ద పర్యవసానం 87
తేనేటి విందుతో ఏర్పడ్డ అమెరికా 89
అచ్చు యంత్రం తెచ్చిన మత విప్లవం 91
ఆ జగజ్జేత వెనుదిరగడం 93
ఆవిరిశక్తి.. మహత్తర పారిశ్రామిక విప్లవానికి నాంది 95
అబ్రహాం లింకన్ అధ్యక్షుడు కావడమే... 103
ప్రపంచాన్ని కుదించిన దిక్సూచి 106

## భారతదేశం


| | |
|---|---|
| శోకం నుండి సంక్షేమ దిశగా | 25 |
| పోరాటంతో పొందిన బిరుదు | 27 |
| అస్పృశ్యతపై పోరాటం వైకోం సత్యాగ్రహం | 33 |
| ఆంగ్ల ఆధిపత్యాన్ని అరికట్టిన రాణీ చెన్నమ్మ | 35 |
| గుమస్తా గిరి నుండి ప్రపంచ గణిత శాస్త్రవేత్తగా | 40 |
| మైసూర్ టైగర్ టిప్పు సుల్తాన్ | 48 |
| నీలిమందు తిరుగుబాటు | 51 |
| భారత సినీ చరిత్రను మలుపు తిప్పిన 'పథేర్ పాంచాలి' | 62 |
| వాస్కోడిగామాకు దారిచూపిన భారతీయుడు | 65 |
| గాంధీని మహాత్ముడిగా మార్చిన రైలు | 69 |
| కత్తిదూసినవాడు కరుణా సముద్రుడైన వేళ | 71 |
| స్వేచ్ఛాజ్వాలగా మారిన యువకుడు | 75 |
| మరణం చూసిన మనస్సు... | 80 |


## ఆంధ్రప్రదేశ్


| | |
|---|---|
| అగ్గిరవ్వ ఆంధ్రకేసరి | 11 |
| కాటనాయనమః | 14 |
| కన్యాశుల్కం నాటకానికి ప్రేరణ! | 17 |
| ధీర వనిత - వీరగున్నమ్మ | 22 |
| ఆంధ్రపత్రికతోడ అమృతాంజనమిచ్చి... | 38 |
| పరాభవం నుండి పుట్టుకొచ్చిన మహానుభావుడు | 42 |
| దళితాకాశపు ధ్రువతార | 82 |
| ఓ మహనీయుడి ఆత్మార్పణం | 97 |
| గాంధీ కాకినాడకు రావటమే.. | 100 |

# ముందుమాట


**చ**రిత్ర ఒక్కరోజులో గాని ఒక్కరి ద్వారానే గాని నిర్మితం కాదు. అదో నిరంతర ప్రవాహం. మెరుపులూ మరకలూ అన్ని అందులో వుంటాయి. తారీఖులూ దస్తావేజులూ చరిత్ర సారం కానట్టే ఏ కొద్ది మంది వీరత్వమో పాండిత్యమో చరిత్ర కాదు. అసామాన్యుల ఆశయబలంతో పాటు సామాన్యుల సాహసాలూ చరిత్రగతిని ప్రభావితం చేస్తాయి. అందులో కొన్ని ఘట్టాలు చరిత్రలో మలుపులు తీసుకొస్తాయి. వాటికి కారకులైన వారు మహనీయులుగా స్మరణీయులుగా మిగిలిపోతారు.

చరిత్రలో అద్భుతాలెప్పుడూ ప్రణాళిక ప్రకారమే జరిగినవి కావు. సంబంధిత వ్యక్తుల మనస్సులలో అవి వున్నా మొత్తం చరిత్రలో స్థానం సంపాదించడం వారి చేతుల్లోనూ వుండదు. వాటి ప్రయోజనం లేదా ప్రభావం అంతిమంగా ప్రాధాన్యతను నిర్ణయిస్తుంది. సరైన దిశలో సమిష్టి శ్రేయస్సుకు చైతన్యానికి దోహదం చేసిన అంశాలకు చరిత్రలో చోటు కల్పిస్తుంది.

చరిత్ర బోధకులుగా, రచయితగా, ప్రగతిశీల మేధావిగా సుపరిచితులైన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ టర్నింగ్ పాయింట్ పేరుతో ప్రజాశక్తిలో 2005-06 మధ్య ధారావాహికంగా ఈ రచనలు అందించారు. సామాజిక రాజకీయ రంగాలలో పోరాటాలు ఉద్యమాలలో శాస్త్ర సాంకేతిక కళా సాహిత్య రంగాలలో గొప్ప మలుపులకు కారణమైన ఎన్నో ఉజ్వల ఘట్టాలను, ఎందరో మహనీయుల ఉన్నత వ్యక్తిత్వాలనూ ఈ శీర్షికలో కళ్లకు కట్టారు.తెలుగు ప్రజల పోరాటాలు మొదలు అంతర్జాతీయ పరిణామాల వరకూ అనేక అంశాలను పరిచయం చేశారు. అప్పట్లో పాఠకులను బాగా ఆకర్షించిన ఈ ఖండికలనే పుస్తక రూపంలో అందిస్తున్నాం. రకరకాలైన ఈ ఘట్టాలన్నిటినీ ఒక్కచోట

అందించే పుస్తకం తెలుగులో రాలేదు. ఆ విధంగా ఇది చదువరులను ఉత్తేజపర్చగలదు. ఇలాటి మంచి పుస్తకం అందించిన వకుళాభరణం గారికి కృతజ్ఞతాభినందనలు తెల్పుతూ ఈ ప్రయత్నం పాఠకాదరణకు పాత్రమవుతుందని ఆశిస్తున్నాం.

– ప్రజాశక్తి బుక్‌హౌస్



ఇంగ్లండ్ చరిత్రలోనే ఈ పత్రం అపురూపమైంది. ఆ తర్వాత శతాబ్దాల్లో సంక్రమించిన అనేకానేక ప్రజల హక్కులకు, స్వాతంత్ర్యాలకు ఇది పునాది. దీనిపై ఆధారపడే బ్రిటీష్ ప్రజాస్వామ్యం వృద్ధిచెందింది.

# మేగ్నకార్టా
# ప్రపంచ హక్కులకు పునాది

ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలన్నింటిలోనూ ఉన్న పార్లమెంటులకు తల్లిగా బ్రిటీష్ పార్లమెంటును పరిగణిస్తారు. ప్రజల హక్కులను కాపాడడంలోనూ, ప్రభుత్వాల కార్యకలాపాలను నిర్దేశించడంలోనూ పార్లమెంట్లు అనబడే ప్రజాప్రతినిధుల సభలు నిర్ణాయకపాత్రను పోషిస్తాయి. బ్రిటీష్ పార్లమెంటు ఈవిధంగా అత్యంత ప్రాచీనమైనది. ప్రపంచ దేశాల్లోని అన్ని పార్లమెంట్లకన్నా వయసులో పెద్దది. అది ఏర్పడ్డానికి, బ్రిటీష్ రాచరికవ్యవస్థపై పార్లమెంటు అధికారం ప్రతిష్ఠింపబడ్డానికి మూలమైన ఒక ఘటన ఏమిటో తెలుసా?

ఇంగ్లండ్‌ను పరిపాలించిన రాజు రెండవ హెన్రీ చనిపోగా అతడి పెద్ద కుమారుడు రిచ్చర్డ్ అధికారంలోకొస్తాడు. అనుకోకుండా అతడు మరణించడంతో ఆ రిచ్చర్డ్ తమ్ముడు జాన్ క్రీ.శ.1215లో సింహాసనం అధిష్టిస్తాడు. హెన్రీ తన హయాంలో చట్టబద్ధపాలన (రూల్ ఆఫ్ లా) ప్రవేశపెట్టాడు. ధనికులు, బీదలనే తేడా లేకుండా ప్రజలందరూ చట్టంముందు సమానులేనన్న గొప్ప న్యాయసూత్రాన్ని ఇది ప్రజల ముందుంచుతుంది. పాలనలో ప్రజలకు న్యాయం అందే రీతిలో ఇదొక గొప్ప చర్య. అయితే జాన్ అధికారంలోకి వచ్చాక ఈ చట్టానికి ఎసరు పెట్టాడు. జాన్ నిరంకుశుడు. దుష్టుడు. దుర్నీతితో కూడిన అతడి పాలనలో సామాన్య ప్రజలు ఇబ్బంది పడ్డారు. అప్పటికే ఇంగ్లండ్ ప్రజలు జాన్ తండ్రి హెన్రీ ప్రవేశపెట్టిన న్యాయసంస్కరణలవల్ల చైతన్యవంతులై వారి హక్కులు, బాధ్యతల గురించి గుర్తెరిగి ఉన్నారు. అందుకే వీరంతా ఏకమయ్యారు. జాన్‌రాజు క్షుద్రపాలనకుతోడు ప్రజలపై పన్నులు, జరిమానాలు విచ్చలవిడిగా విధించాడు. విసుగుచెందిన ప్రజానీకం మొత్తం ఏకమై జాన్‌పై తిరుగుబాటు చేసింది. ఈ తిరుగుబాటు ఇంగ్లండ్ చరిత్రలో గణనీయ మార్పులకు దారితీసింది.

దాంతో జూన్ 15, 1285న రాజు జాన్ ప్రజలకు కొన్ని హక్కులను ధారాదత్తం చేస్తూ ఒక ప్రకటన చేశాడు. ఈ హక్కుల పత్రాన్నే 'మేగ్నకార్టా' అంటారు. దీన్ని స్వేచ్ఛాహక్కుల మహాపత్రంగా అభివర్ణించారు. దీంట్లో 63 క్లాజులున్నాయి. ఇంగ్లండ్ చరిత్రలోనే ఈ పత్రం అపురూపమైంది. ఆ తర్వాత శతాబ్దాల్లో సంక్రమించిన అనేకానేక ప్రజల హక్కులకు స్వాతంత్ర్యాలకు ఇది పునాది. దీనిపై ఆధారపడే బ్రిటీష్ ప్రజాస్వామ్యం వృద్ధిచెందింది రాజు జాన్ మెడలు వంచి తద్వారా ఇంగ్లండ్ ప్రజలు ఈ హక్కుల పత్రాన్ని సాధించుకోవడం ప్రజాహక్కుల పోరాటాలకు నాంది పలికింది. హక్కులకోసం యావత్ ప్రజానీకం ఏకమై రాజ్యహింసకు, పీడనకు వ్యతిరేకంగా పోరాడితేనే హక్కులు లభిస్తాయన్న పరమసత్యాన్ని ఇది చాటిచెప్పింది.

మేగ్నకార్టా సూత్రాలు న్యాయపాలనలో జ్యూరీ పద్ధతిని ప్రవేశపెట్టాయి న్యాయనిర్ణేతల సలహాలపై వారి అభిప్రాయాల ఆధారంగా న్యాయస్థానాలు దోషులన శిక్షిస్తాయి. కానీ ఏకపక్షంగా, విచారణ లేకుండా కాదు. రెండవది 'మేగ్నకార్టా' వల్ల హెబియస్ కార్పస్ చట్టం అమల్లోకొచ్చింది. దీని ప్రకారం ఏ వ్యక్తినీ ఒక నిర్ణీతకాలాని మించి విచారణ లేకుండా జైల్లో నిర్బంధించడానికి వీల్లేదు. అలా ఉంచాలనుకుంటే న్యాయస్థానం అనుమతి తప్పనిసరిగా ఉండితీరాలి. పౌర హక్కులకు ఇదొక పెద్దవరం రాజకీయ నిరంకుశ అధికారాన్ని ఇది మరింతగా తగ్గించింది. రాజ్యాంగ సర్వాధికారాన్ని నొక్కిచెప్పి తుదకు దేశాన్ని పాలించే రాజు కూడా ప్రజాప్రతినిధుల అంగీకారం, అనుమతి లేనిదే ప్రజలపై పన్నులు విధించరాదు. ఈవిధంగా రాజకీయ, ఆర్థిక, న్యాయపరహక్కులను ప్రసాదించిన స్వేచ్ఛాహక్కుల మహాపత్రం రాజ్యాంగ సంస్కరణల క్రమంలో గొప్ప మలుపు



*ప్రపంచ కార్మిక చరిత్రలో ఇదొక గొప్ప మజిలీ. కార్మికోద్యమాన్నే ఒక ఊపువూపి చరిత్రలో 'మేడే'గా చిరస్థాయిగా నిల్చిపోయిన ఘటన. కార్మికుల నెత్తురుతో తడిసిన చికాగోనగర వీధుల్లో కార్మికోద్యమానికి గట్టి పునాది వేసింది.*

# చికాగోలో రేగిన నిప్పురవ్వ

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని (యుఎస్ఎ) చికాగో నగరం హే మార్కెట్ స్క్వేర్‌లో 1886 మే నెల 1వ తేదీన కార్మికులు సభ జరుపుకుంటున్నారు. సభ శాంతియుతంగా జరుగుతోంది.

కార్మికనాయకులు తమ ఉపన్యాసాల్లో పరిశ్రమల్లో పనిచేస్తున్నటువంటి కూలీల జీవన సమస్యల్ని గూర్చి మాట్లాడుతున్నారు. రోజుకు 8 గంటలు మాత్రమే కార్మికులచేత పని చేయించుకోవాలన్నది వారి ముఖ్య డిమాండ్. సభ జరుగుతున్న తీరుతెన్నులను గమనించే సాకుతో శాంతిభద్రతలు కాపాడ్డం తమ ధ్యేయంగా చెప్పుకుని సభచుట్టూ పోలీసు బలగాలు మోహరించాయి. ఇంతలో అకస్మాత్తుగా బాంబు పేలిన శబ్దం, ఆ వెంటనే పోలీసుల కాల్పులు. సభలో కలకలం. చెల్లాచెదురై ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పరిగెత్తి

పోతున్న కార్మికుల్లో నలుగురి మరణం. అంతకుముందు బాంబు పేలుడు ఘటనలో ఏడుగురు పోలీసుల దుర్మరణం. బాంబు విసరడంలో ప్రమేయం ఉందన్న మిషతో ఎనిమిదిమంది కార్మికనాయకుల అరెస్టు. ప్రపంచ న్యాయవ్యవస్థలోనే అత్యంత లజ్జాకరమైన, హేయమైన న్యాయవిచారణ జరిపి ఏమాత్రం సాక్ష్యాధారాలు లేకుండా ఆ ఎనిమిదిమంది కార్మికనాయకుల్లో ఏడుగురికి మరణశిక్ష, ఒకరికి యావజ్జీవ ఖైదీ. ఇది 1886 మే ఒకటిన జరిగిన మారణహోమం.

ప్రపంచ కార్మిక చరిత్రలో ఇదొక గొప్ప మజిలీ. కార్మికోద్యమాన్నే ఒక ఊపువూపి చరిత్రలో 'మేడే'గా చిరస్థాయిగా నిల్చిపోయిన ఘటన. కార్మికుల నెత్తురుతో తడిసిన చికాగోనగర వీధుల్లో కార్మికోద్యమానికి గట్టి పునాది వేసింది. నాటి నుండి నేటి వరకూ మే నెల ఒకటో తారీఖు ప్రపంచమంతటా అంతర్జాతీయ కార్మికదినంగా పరిగణింపబడుతూఉంది. సామ్యవాద భావజాల పితామహుడు కారల్‌మార్క్స్ నినదించిన 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి' అనే నినాదం ప్రపంచమంతటా మార్మోగింది. కార్మికుల పనిగంటలను క్రమబద్ధంచేసి రోజుకు 8 గంటలుగా నిర్ణయించడం, వారు చేస్తున్న పనికి సరైన, న్యాయమైన వేతనాలు ఇవ్వడం, కార్మికుల జీవనస్థితిగతులను మెరుగుపర్చడం, పనిభద్రత, ఆరోగ్య బీమాసౌకర్యాలు, వారి కుటుంబాల బాగోగులు ఒకటేమిటి... కార్మికులకు సంబంధించిన సకల సమస్యలూ కార్మికోద్యమ ఎజెండాలో భాగమయ్యాయి.

'కార్మికుడు' అన్నపదానికి కేవలం శారీరక శ్రమ మాత్రమే కొలబద్దకాదు. మానసిక శ్రమ మేధోపరమైన కార్యకలాపాలు సాగిస్తున్న 'తెల్ల చొక్కాల' బుద్ధిజీవులూ కార్మికులే. ఎవరైతే తమ శ్రమను, అది శారీరకమైనా, మానసికమైనా సరే.. వెచ్చించి జీవనభృతి సంపాదించుకొంటారో వారంతా బహుళార్థంలో కార్మికవర్గానికి చెందినవారే. అందుకని ఈ నిర్వచనం ప్రకారం ఫ్యాక్టరీల్లో, గనుల్లో, పనుల్లో ఆఫీసుల్లో, బ్యాంకుల్లో ఇంకా అనే కేంద్రాల్లో ఎక్కడైతే మానవశ్రమ సామాజిక ఉత్పత్తికి తోడ్పడుతున్నదో అక్కడంతా 'మేడే' తన ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

చికాగోసభల్లో ఉపన్యసించి ఆ తర్వాత ముద్దాయిగా చిత్రించబడి, ఉరితీయబడిన కార్మికనాయకుల్లో ఒకరైన స్పీస్, కోర్టులో ఇచ్చిన వాంగ్మూలంలో "కార్మికోద్యమాన్ని తీరని కోరికలతో దీనంగా అట్టడుగునవున్న లక్షలాది కార్మికులు తమ విముక్తి సాధించుకు సాగించే ఉద్యమాన్ని మమ్మల్ని ఉరితీయడంద్వారా ఆపగలమనుకొంటే అలాగే ఉరితీయండి. ఇక్కడే మీరు నిప్పురవ్వను రేపేడుతున్నారు. అక్కడా ఇక్కడా మీ ముందూ వెనుకా ఎక్కడబడితే అక్కడ జ్వాలలు లేస్తాయి. అది భూమి అడుగున రగిలే జ్వాల... దాన్ని ఆపలేరు" అంటూ ఉద్ఘాటించాడు.



నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు.
ప్రజలు అధిక సంఖ్యలో వీటిని ఉల్లంఘించి వీధుల్లోకి
వచ్చి ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. ఉడుకు నెత్తురు
ఉప్పొంగుతున్న ఉక్కుపిండం, ప్రకాశం వీధికి దగ్గరలో,
హైకోర్టుకు సమీపంలో, నిషేధాజ్ఞలు ధిక్కరించి,
ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్నారు.
అంతకు కొద్దిగా ముందు అక్కడ జరిగిన కాల్పుల్లో
ఒక యువప్రదర్శకుడు మరణించాడు.

# అగ్గిరవ్వ ఆంధ్రకేసరి

భారత జాతీయోద్యమంలో ఆంధ్రులు నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమైంది. అశేష ప్రజానీకం ఉద్యమ వివిధదశల్లో చురుగ్గా పాల్గొని త్యాగాలు చేశారు. స్త్రీ పురుష బేధం లేకుండా ఉద్యమవ్యాప్తికి తోడ్పడ్డారు. కొందరు అసువులుబాసి అమరులయ్యారు. ఉద్యమానికి ఎందరో నాయకత్వం వహించారు. అందులో టంగుటూరి ప్రకాశం ప్రజా నాయకుడిగా పేరొందారు. సామాన్యకుటుంబంలో పుట్టి రాజమండ్రి, మద్రాసుల్లో చదివి, ఇంగ్లండ్‌లో బారిష్టరు పట్టాపొందారు. చదువుకునే రోజులనుండే ప్రజాసమస్యలపట్ల, సాంఘిక విషయాలపట్ల శ్రద్ధ చూపేవాడు. కొన్నాళ్ళు రాజమండ్రి మున్సిపాలిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. మదరాసులో న్యాయవాదవృత్తి చేపట్టాడు. వృత్తిలో ప్రఖ్యాతులతోపాటు

విశేషంగా డబ్బు గడించారు. ఆ రోజుల్లో అంటే.. గత శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాల్లో ప్రకాశం సంపాదన లక్షల్లో ఉండేది.

గాంధీ ప్రవేశంతో 1920 దశకంలో జాతీయోద్యమం బలం పుంజుకుంది. మితవాద, అతివాద దశల్లో పరిమితమైన ఉద్యమం, గాంధీ నాయకత్వంలో సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు విస్తరించింది. ప్రజాపునాదిని విస్తృతపరచుకున్న ఉద్యమం 1921-22లో గాంధీ నాయకత్వంలో మొదటి సహాయ నిరాకరణ ఆరంభించింది. అదే సంవత్సరంలో డిసెంబర్‌లో జరిగిన అహమ్మదాబాద్ కాంగ్రెస్ సభల్లో ప్రకాశం అఖిలభారత కాంగ్రెస్ కార్యదర్శిగా ఎన్నిక కావడంతో జాతీయస్థాయి నాయకుల్లో ఒకడుగా గుర్తింపు పొందాడు.

1921లో శాసనోల్లంఘన విచారణకమిటీ గుంటూరు సందర్శించినపుడు 30 వేలమంది కాంగ్రెస్ వాలంటీర్లతో భారీ ప్రదర్శన నిర్వహించి తన కార్యదీక్షతను, ప్రజాభిమానాన్ని చాటుకున్నాడు ప్రకాశం.

అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్న టంగుటూరి ప్రకాశం 1926లో కేంద్ర శాసనసభకు ఎన్నుకోబడ్డారు.

కేంద్ర శాసనసభలో అప్పట్లో కాంగ్రెస్‌లోని దిగ్గజాలైన మదన్ మోహన్‌మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ, జిన్నా, జి.డి. బిర్లా, భాయ్ పరమానంద్, శ్రీనివాసఅయ్యంగార్ ప్రభృతులు సభ్యులుగా ఉన్నారు.

టంగుటూరి ప్రకాశం 1921లో సత్యాగ్రహ శపథంపై సంతకంచేసిన మరుక్షణమే లాభదాయక న్యాయవాదవృత్తిని త్యజించాడు. మంచి ఉపన్యాసకుడిగా, సాహసిగా, ప్రజల్లోకి చొచ్చుకుపోయే చొరవగల నాయకుడిగా పేరొందిన తరుణంలో ఆయన జీవితం గొప్ప మలుపు తిరిగింది. 1919లో ఆంగ్ల ప్రభుత్వం జారీచేసి అమలుపర్చిన మాంటెగు ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను జాతీయనాయకులు నిరాకరించారు. ప్రభుత్వంలో న్యాయమైన సముచిత స్థానం కల్పించడంలో చట్టం విఫలమైంది. అప్పుడు దేశం మొత్తం నిరసనలు ప్రతిధ్వనించాయి. దాంతో ఊపిరాడక 1919 చట్టాన్ని పునస్సమీక్ష చేస్తామని ప్రభుత్వం ప్రకటించి సైమన్ కమిషన్‌ను ఈ పనికి నియమించింది. సైమన్‌తో సహా ఇందులోని సభ్యులందరూ ఆంగ్లేయులే. జాతీయకాంగ్రెస్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించడమేగాక, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలని ప్రజలకు పిలుపిచ్చింది. దేశమంతా నిరసన ప్రదర్శనలు, సభలు, ఊరేగింపులు, తీర్మానాలు, పంజాబ్‌లో సైమన్ కమిషన్ బహిష్కరణ ప్రదర్శనలో పోలీసులు లాఠీ దెబ్బలకు గురై పంజాబ్ కేసరి లాలాలజపతి రాయ్ అసువులు బాశాడు.

సైమన్ కమిషన్ మదరాసుకొచ్చే తేదీ 3 ఫిబ్రవరి 1928 రానేవచ్చింది. నగరంలో

హర్తాళ్, సమ్మెలు... ప్రకాశం ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. ప్రజలు అధిక సంఖ్యలో వీటిని ఉల్లంఘించి వీధుల్లోకి వచ్చి ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. ఉడుకు నెత్తురు ఉప్పొంగుతున్న ఉక్కుపిండం, ప్రకాశం బీచికి దగ్గరలో, హైకోర్టుకు సమీపంలో, నిషేధాజ్ఞలు ధిక్కరించి, ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్నారు. అంతకు కొద్దిగా ముందు అక్కడ జరిగిన కాల్పుల్లో ఒక యువప్రదర్శకుడు మరణించాడు. మృతదేహాన్ని తీసుకుపోదానికి కాదుగదా కనీసం దగ్గరికెళ్ళి చూడ్డానికి కూడా అనుమతి నిరాకరించారు పోలీసులు, అప్పుడే అక్కడికి చేరుకున్న మిలటరీ బలగాలు, ప్రకాశం వారిదగ్గరకెళ్ళి అమరవీరుడి మృతదేహం దగ్గరకు వెళ్ళడానికి అనుమతి కోరాడు. వారు నిరాకరిస్తే ధిక్కరించి 'సైమన్ గో బ్యాక్' అని నినాదమిస్తూ ముందుకు తోసుకెళ్ళాడు. అక్కడున్న పోలీసు ఆఫీసరు కళ్ళెర్రచేసి "ముందుకడుగేస్తే, కాలుస్తా"నని తుపాకీ ఎక్కుపెట్టాడు. దాంతో ప్రకాశం చొక్కా గుండీలు విప్పి గుండెను చూపిస్తూ "సరే నన్ను కాల్చి చంపి ధైర్యముంటే నదువ"మని గద్దించాడు. దాంతో పోలీసు ఆఫీసర్ తుపాకిని దించి తలవంచుకొన్నాడు. ఇదంతా ఉద్వేగంతో చూస్తూ నిలబడివున్న వేలాదిప్రజలు "ఆంధ్రకేసరి... జిందాబాద్" అంటూ దిక్కులు పిక్కటిల్లేట్టు నినాదాలు చేశారు. దాంతో టంగుటూరి ప్రకాశం ఆంధ్రకేసరిగా చిరస్మరణీయుడైనాడు.



*గోదావరి ఆనకట్ట మద్రాసు రాష్ట్రంలో ప్రథమంగా*
*నిర్మించిన భారీ నిర్మాణం. ఇంజనీరింగ్ శాస్త్రసాంకేతిక*
*నిపుణత్వానికి ప్రతీక. మద్రాసు రాజధానిలో ఉన్న*
*22 జిల్లాల్లో ఆర్థికప్రగతిలో 13వ స్థానంనుండి*
*2వ స్థానానికి ఎదిగింది. అతి పేదజిల్లా కాస్తా*
*సంపన్నంగా తయారయింది.*
*ఆనకట్ట ప్రారంభించినప్పుడున్న జనాభా (561.041),*
*3 రెట్లు పెరిగి 1891 నాటికి*
*1,517,741కి చేరింది.*

# కాటనాయనమః

ఆంధ్రదేశానికి అన్నపూర్ణ అనే బిరుదు ఉందంటే అది ప్రధానంగా కృష్ణా, గోదావరి జిల్లాలు ధాన్యాగారాలుగా ప్రసిద్ధి పొందినందువల్లనే. గోదావరిపై ఆనకట్ట 31 మార్చి 1852న పూర్తికాగా, కృష్ణా ఆనకట్ట 1853లో పూర్తయింది.

ఇదెలా జరిగింది? దీని వెనకాల ఉన్న కథాకమామీషు ఏమిటి? మనుషుల్లో మహానుభావులుంటారు. కొందరు కొన్ని పనులు చేయడానికే పుట్టారన్నట్టుగా కన్పిస్తారు. అలాంటివారిలో ఆర్థర్‌కాటన్ ఒకరు. ఆ తర్వాత ఆయనకు సర్ బిరుదునిచ్చి సత్కరించారు.

150 సంవత్సరాలకు పూర్వం 1844 ప్రాంతంలో గోదావరి (నేటి ఉభయ గోదావరులు) చాలా వెనుకబడిన ప్రాంతం. కరువు, దుర్భిక్షాలతో ఎక్కడ చూసినా ఎండిపోయి

నెర్రెలు విచ్చుకున్న భూములతో తాగునీరు లేక ప్రజానీకం పదరాని పాట్లు పడుతున్న సందర్భం. ముఖ్యంగా 1844 నాటికి గోదావరి మండల పరిస్థితి మరీ అధ్వాన్నంగా సాటి ఉత్తర సర్కారుజిల్లాల కంటె దయనీయంగా తయారయింది. మద్రాసు రాజధానిని అప్పుడు ఆంగ్లేయుల తూర్పు ఇండియా కంపెనీ పరిపాలిస్తున్నది. ప్రభుత్వ రాబడి తగ్గిపోవడంతో గోదావరి మండల స్థితిగతులను పరిశీలించి పరిష్కారమార్గాలు సూచించమని, సర్ హెన్రీమాంట్‌గోమరీని స్పెషల్ కమీషనర్‌గా పంపింది. ఆయనొచ్చి చూశాడు. ఆలోచించాడు. ఒకవైపు నీటి ఎద్దడి, మరోవైపు వరదలు. దక్షిణగంగగా ప్రసిద్ధిగాంచిన గోదావరితల్లి కడుపునిండా నీరు నింపుకొని చూడముచ్చటగా, కనులవిందుగా రాజమండ్రి పట్టణ సరిహద్దులను దాటుతూ ప్రవహిస్తోంది. మాంట్‌గోమరీ ఒక నిర్ణయానికొచ్చాడు. అనుభవజ్ఞుడైన ఇంజనీరును రప్పించి సర్వే చేయించి ఒక సమగ్ర నివేదికను తయారు చేయించడం సముచితమని తోచింది. తోచిందే తడవుగా 1845లో తంజావూరు దగ్గర కావేరిపై ఆనకట్ట నిర్మాణంలో అనుభవం గడించిన ఇంజనీర్ ఆర్థర్‌కాటన్ గుర్తొచ్చాడు. మద్రాసు ప్రభుత్వంతో సంప్రదించి, ఆర్థర్ కాటన్‌ను గోదావరి మండలానికి ఇంజనీరుగా నియమించేట్టు చూశాడు. సరిగ్గా ఇప్పుడే, ఇక్కడే గోదావరి మండల చరిత్రలో గొప్ప మార్పొచ్చింది.

ఆర్థర్‌కాటన్ సర్వే నిర్వహించి నివేదిక తయారుచేసి, మద్రాసు ప్రభుత్వానికి సమర్పించాడు. రాజమండ్రికి సమీపంలో ధవళేశ్వరంవద్ద ఆనకట్ట నిర్మించి తర్వాత దాన్ని పెంపొందించుకుంటూ ముందుకుపోవాలని సూచించాడు. పదిలక్షల ఎకరాలకుపైగా భూములకు సాగునీరు సరఫరా చేయవచ్చుననీ, మొత్తంమీద కాలువలతో కలిపి 30లక్షల పైచిలుకు ఖర్చవుతుందనీ అంచనావేశాడు. ఇందుకు నిత్యం వేలాదిమంది కార్మికులు అవసరమౌతారు. రాజమండ్రి ఆనకట్టకు సంబంధించిన పనులు చేసుకోవడానికి ప్రత్యేక సబ్ కలెక్టర్ హెన్రీ ఫోర్బ్స్‌ను కూడా నియమించారు. అప్పటి మద్రాసు ప్రభుత్వ గవర్నర్ మార్క్విస్‌ట్వీడాల్, ఇంగ్లండులోని ఈస్టిండియా కంపెనీ డైరెక్టర్లకు ఆనకట్ట నిర్మాణ అవశ్యకత గూర్చి గట్టిగా సిఫారసు చేశాడు. దాంతో నిర్మాణానికి అనుమతి మంజూరు కావడం, ఆనకట్ట నిర్మాణానికి ఆర్థర్‌కాటన్ నడుంకట్టి రాత్రింబగళ్ళు శ్రమించి కావాల్సిన సరంజామాను, మందీమార్బలాన్ని సమకూర్చి ఆనకట్ట నిర్మాణాన్ని పూర్తిచేశాడు.

గోదావరి ఆనకట్ట మద్రాసు రాష్ట్రంలో ప్రథమంగా నిర్మించిన భారీ నిర్మాణం. ఇంజనీరింగ్ శాస్త్రసాంకేతిక నిపుణత్వానికి ప్రతీక. మద్రాసు రాజధానిలో ఉన్న 22 జిల్లాల్లో ఆర్థికప్రగతిలో 13వ స్థానంనుండి 2వ స్థానానికి ఎదిగింది. అతి పేదజిల్లా కాస్తా సంపన్నంగా తయారయింది. ఆనకట్ట ప్రారంభించినప్పుడున్న జనాభా (561,041), 3 రెట్లు పెరిగి

1891 నాటికి 1,517,741కి చేరింది. రాజమండ్రి ప్రాంతంనుండి అనకట్ట పూర్వ సాలుకు 6 లక్షలరూపాయల విలువైన సరుకులు ఎగుమతి అవుతుండగా, ఆ తర్వాత ఎగుమతులు 40 లక్షలకు పెరిగాయి. గోదావరి మండలంలో రోడ్లు, పాఠశాలలు అనూహ్యంగా వృద్ధి చెందాయి. ప్రతి తాలూకాలో పాఠశాలల తనిఖీచేసే ఉద్యోగులను నియమించారు. వరి పైరుకు తోడు పొగాకు, పత్తి, చెరకు, మల్బరీతోటలు వృద్ధిచెందాయి సమీపభవిష్యత్‌లో ఈ ప్రాంతం రైల్వే నిర్మాణంద్వారా మద్రాసునగరంతో సంధించడం జరిగింది. మధ్యతరగతి వర్గం, సంపన్న రైతాంగం ఏర్పడింది. క్రమేపీ పట్టణీకరణ వృద్ధిచెందింది. ఒకటేమిటి అన్నివిధాలా అభివృద్ధిచెంది 19వ శతాబ్దపు రెండోభాగంలో ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచింది. ఇది అపరభగీరథుడు సర్ ఆర్థర్‌కాటన్ పుణ్యమే. అందుకే ఇప్పటికీ వేదమంత్రాల్లో భాగంగా 'కాటనాయనమ అంటారని చెప్తారు.



*మరే ఇతర తెలుగు నాటకమూ పొందనంత*
*ప్రాచుర్యమూ, కీర్తి, జనాకర్షణ ఈ నాటకం ఎలా*
*పొందింది? ఈ నాటక రచనకు ప్రేరణ ఎలా కలిగింది?*
*గురజాడ ఈ నాటకాన్ని రాయడంలో, ఎలాంటి*
*ప్రభావాలకు లోనయ్యాడు? ఆ ప్రభావం,*
*దానికనుగుణంగా తిరిగిన మలుపు ఏమిటి?*

# కన్యాశుల్కం నాటకానికి ప్రేరణ!

మంచిచెడ్డలు మనుజులందున
యెంచిచూడగ రెండెకులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదున్'

అని కులబేధాలను, సామాజిక అంతరాలను అస్పృశ్యతతో జోడించి, కొందరిని ఆర్థిక పీడనకు, హింసకు గురిచేసిన అసమ సామాజిక వ్యవస్థను నూరేళ్ళనాడే ఖండించాడు గురజాడ. ఆయన కవి మాత్రమేకాదు. గొప్ప నాటకకర్త, కథకుడు కూడా. కన్యాశుల్కం నాటకం అప్పుడే కాదు ఇప్పటికీ, ఎప్పటికీ గొప్పదే. నూరేళ్ళు దాటినా వన్నె తగ్గక, ఇవాళ్టికీ సజీవంగా నిల్చివుంది. సాంఘిక ఇతివృత్తం ప్రధానంగా రాసిన ఈ నాటకం తెలుగుప్రజల సాంఘిక జీవనానికి అద్దం పట్టింది. 20వ శతాబ్ది మలుపులో తెలుగునాట.. ముఖ్యంగా కోస్తా ప్రాంతంలో నెలకొన్న సాంఘిక దురాచారాలను చిత్రించి, వాటిని ఖండించింది. అప్పుడే ఆంధ్రదేశంలో ఆధునికతాప్రక్రియ (మోడ్రనిటీ) చోటుచేసుకుంటున్నది. జాతీయోద్యమం మొగ్గలు తొడుగుతున్నది. 'అన్నీ వేదాల్లోనే వున్నాయష' అనే సనాతన భావాల చాదస్తాన్ని కాదని, హేతువాద దిశలో శాస్త్రీయంగా సమాజాన్ని సంస్కరింపబూనుకుంది, గురజాడవారి కన్యాశుల్కం. మరే ఇతర తెలుగు నాటకమూ పొందనంత ప్రాచుర్యమూ, కీర్తీ, జనాకర్షణ ఈ నాటకం ఎలా పొందింది? ఈ నాటక

రచనకు ప్రేరణ ఎలా కలిగింది? గురజాడ ఈ నాటకాన్ని రాయడంలో, ఎలాంటి ప్రభావాల లోనయ్యాడు? ఆ ప్రభావం, దానికనుగుణంగా తిరిగిన మలుపు ఏమిటి?

ఉత్తరాంధ్ర ప్రాంతంలో, విశాఖపట్నం జిల్లాలో విజయనగర సంస్థానం ఉండే ఆనందగజపతి ఆ సంస్థానాధిపతి. పెద్ద జమీందారు. ఆయనకు కళాభినివేశ సారస్వతాభిమానం, అన్నింటినీ మించి, సంస్కారప్రియత్వం ఉండేవి. ఆనందగజ సమాజంలో ఆనాటికి ప్రబలంగా నెలకొన్న కన్యాశుల్క దురాచారం గూర్చి కలతచెందా తన సంస్థానంలో పరిస్థితి ఎలాగుందో తెలుసుకోగోరాడు. ఒక సర్వే జరిపించాడు. నిజా అన్ని వివరాలూ రికార్డు కాలేదు. ఎందుకంటే ఆడపిల్లలను డబ్బుకు అమ్ముకుంటున్నార విషయం ఎవరు బహిరంగంగా వెల్లడిస్తారు? అయినా సర్వే తర్వాత దాని ఫలితా నివేదిక రూపంలో వెలువడ్డాయి. అందులో మూడు సంవత్సరాల కాలాన్ని ఒక యూనిట్ తీసుకుంటే, 1034 కన్యాశుల్క వివాహాలు జరిగినట్టు రికార్డయ్యాయి. ఒక సంవత్సరం జరిగిన వివాహాలు ఇలా ఉన్నాయి.

***5 సంవత్సరాల లోపు 99 మందికి***
***4 సంవత్సరాల లోపు 44 మందికి***
***3 సంవత్సరాల లోపు 36 మందికి***
***2 సంవత్సరాల లోపు 6 మందికి***
***1. సంవత్సరం లోపు ఆడ పిల్లలకు 3*** కన్యాశుల్క వివాహాలు జరిగా

మరీ దారుణం ఏమిటంటే కొన్ని సందర్భాల్లో గర్భంలో ఉంటారనుకున్న పుట్టబో ఆడపిల్లలను కూడా ముందుగానే ఒక రేటుకు, పెళ్ళికి నిర్ణయించుకోవడం. ఈ స ఫలితాలు విజయనగర సంస్థానంలో దివానుగా పనిచేస్తున్న గురజాడను దిగ్భ్రాం గురిచేశాయి. ఆయన తీవ్ర మనోవేదనకు గురై ఈ అమానవీయ దురాచారా రూపుమాపడానిగ్గానూ మార్గం ఆలోచించాడు. సాహిత్యమే దానికి ఆయుధమనుకున్నా సాహిత్యాన్ని సంఘ సంస్కరణకోసం ఉపయోగించిన కందుకూరి వీరేశలింగం మనసు మెదిలాడు. కలాన్ని ఆయుధం చేయాలని నిర్ణయించుకున్నాక సామాన్యమైన ఒక వ్యాస కథానికో, నవలో రాస్తే లాభం లేదనుకుని, నాటకం రాయాలనుకున్నాడు.

నాటకం ప్రదర్శనయోగ్యమైంది. ప్రదర్శనను ప్రజలందరూ ఇష్టంగా చూస్తా అందులోని సందేశాన్ని గ్రహిస్తారనుకుని అందరికీ సులభంగా అర్థమయ్యే వాడుకభాష రాశారు. మొదటి ముద్రణ 1897లో ప్రకటించగా, దానికి మెరుగులు దిద్ది మరి ఆసక్తికరంగా ఉండేలా 1909లో రెండవ ముద్రణ ప్రచురించాడు. అదే ఇవాళ మ చదువుతున్న, చూస్తున్న కన్యాశుల్కం. అలా ఆనాటి సంఘదురాచార నిర్మూలనకోసం రా నాటకమిది. అందుకే

*"అడుగుజాడ గురజాడది*
*అది భావికి బాట*
*మనలో వెధవాయత్వం*
*మరపించే పాట"* అన్నాడు శ్రీశ్రీ.



నర్సు వృత్తి చేపట్టడంతో అసలా నర్సు వృత్తిలోనే గొప్ప మార్పు వచ్చింది. గొప్ప దీక్షతో, సేవాభావంతో పనిచేసింది. పరిస్థితుల్ని చక్కదిద్దింది. ప్రభుత్వ సహాయంతో, ఆస్పత్రులను బాగుచేయపూనుకుంది. నర్సు వృత్తికే గౌరవం, హోదాలు కల్పించింది.

# చేతిలో లాంతరు

**మా**నవసేవే మాధవసేవ అని నమ్మి తమ జీవితాలను మానవ కల్యాణానికి వినియోగించిన మహానుభావులెందరో చరిత్రపుటల్లో కన్పిస్తారు. అతి నిరాడంబరంగా తమ సుఖసౌఖ్యాలను త్యజించి, నిస్వార్థంతో సేవచేసిన వారెందరో! నిన్నమొన్నటిదాకా మనందరిమధ్య మెలిగిన మదర్‌థెరిస్సా, సేవకే జీవితాన్నర్పించడం మనకు తెలిసిన సంగతే. కానీ, అంతకంటే ఎంతోముందు 19వ శతాబ్దపు మొదటి భాగంలోనే దిక్కులేక దీనావస్థలోపడివున్న రోగులకు సేవచేసి తరించిన మహా వనిత ఫ్లారెన్స్ నైటింగేల్. రోగులకు, బీదలకు, కష్టాల కడగండ్లలో మునిగి తేలుతున్న దిక్కూమొక్కూ లేని దీనజనావళికి ఎనలేని సేవలు అందించిన నైటింగేల్ ఒక సంపన్న కుటుంబంలో పుట్టింది. సన్నగా, నాజూగ్గా, అందంగా, చలాకీగా ఉండేది. రాజప్రాసాదం లాంటి ఇల్లు, సైనికులు, గుర్రపుబగ్గీలు, పూలతోటలు, జీవితం సుఖంగా ఉంది. 1820 మే నెల 12న జన్మించిన నైటింగేల్‌కు ఇవన్నీ నచ్చలేదు. పదిహేడేళ్ళ వయసులోనే సకుటుంబంగా స్విట్జర్లాండ్ పర్యటనకు వెళ్ళారు. ఇటలీలోని ఫ్లారెన్స్‌లో జన్మించిన నైటింగేల్, స్విట్జర్లాండ్ ప్రకృతి రమణీయతకు ముగ్ధురాలయ్యారు. జెనీవానగరంలోని మురికివాడల్లో నివసిస్తున్నవారి కటిక దారిద్ర్యాన్ని,

వాళ్ళ నికృష్ట జీవితాల్ని చూసి కన్నీరు కార్చింది. ఒక జీవిత సత్యాన్ని గుర్తెరిగింది. దినచర్యలో (డైరీ) ఇలా రాసుకుంది. 'దేవుడు నాతో మాట్లాడాడు. ఆయన సేవకో నన్ను పిలిచాడు' అని. ఆమె తన జీవితానికొక ప్రత్యేక ప్రయోజనం ఉందని గట్టిగా నమ్మి


స్విట్జర్లాండు పర్యటన నైటింగేల్ జీవితంలో మార్పుకు నాంది కాగా తి ఫ్లోరెన్స్ వెళ్ళాక జీవితం విసుగ్గా అన్పించింది. డిన్నర్లు, పార్టీలు, డాన్సులు ఆమె రుచించలేదు. నిరాశ, దిగులు... అందులోంచి ఎలా బయటపడాలో తెలీని మూగబా కుమిలిపోయింది. దీంతో జబ్బుపడటమేగాక మానసిక వ్యాధికి లోనైంది. కోలుకోడా ఇంగ్లండ్ వెళ్ళింది. అక్కడ స్త్రీలు అనుభవిస్తున్న బాధలను, పేదరికాన్ని చూసి చలించి దారిద్ర్యం, బాధలకు అసలు మూలాలు ఏమిటో ఆమెకు అవగాహనకాని స్థితి. 18 ప్రాంతాల్లో పారిశ్రామికవాడలు పెరిగి కార్మికులు దోపిడీకి గురవుతున్నారని శాస్త్రీ స్పృహ, దానికితగ్గ భావజాలం అప్పుడే మార్క్సిజం రూపంలో రూపుదిద్దుకుంటున్న కానీ ఇవేమీ నైటింగేల్‌కు తెలీవు. ఆమెలోని మానవ దృక్పథాన్ని, ఆవేదనను, తీరని వ్య ఇలా వ్యక్తీకరించింది – 'మానవుల బాధలతో నా మనసంతా నిండిపోయింది. చూస్తున్న ప్రజలంతా అనారోగ్యం, పేదరికం మొదలైన ఎన్నో బాధలలో మగ్గిపోతున్నా ఇక లాభం లేదనుకుని కార్యరంగంలోకి దిగాలనుకుంది.

ఆ తరుణంలో ఆమె అనుభవిస్తున్న మానసిక అశాంతికి పరిష్కారమా కన్పిస్తుంది. అప్పుడామెకు 24 ఏళ్ళవయసు. ఆసుపత్రుల్లో జబ్బుపడినవా సేవలందించాలని భావించింది. ఆ రోజుల్లో ఆసుపత్రుల్లో పరిస్థితులు చాలా దయనీయ ఉండేవి. వార్డుల్లో వివిధ రకాల జబ్బులతో బాధపడ్తున్నవారిని ఒకే మంచంపై ఉంచేవా గదులు పాచిపట్టి, బూజు,దుమ్ములతో నిండి ఉండేవి. పరుపులు చినిగి దూదిపైకి మాసిపోయి ఉండేవి. దుప్పట్లు మార్చేవారు కాదు. వైద్యులు శస్త్ర చికిత్సకు ముం తర్వాత శుభ్రంగా చేతులు కడుక్కునేవారు కాదు. ప్రత్యేకమైన దుస్తులేమీ లేకుండా వేసుకు బట్టలతోనే రోజంతా వైద్యం చేసేవారు. ఇక నర్సుల సంగతికి వస్తే వారి జీతభత్యా చాలా తక్కువగా ఉండేవి. డ్యూటీలో ఉన్నప్పుడు కూడా మద్యం సేవించి మత్తు పడివుండేవారు. కరుణ, దయ, మానవతాదృక్పథంతో ఉండాల్సిన నర్సులు రోగు మొరటుగా, విసుగ్గా, అమర్యాదగా ప్రవర్తించేవారు. అసలు మర్యాద, మన్ననగల కుటుం నుండి నర్సు వృత్తికి ఎవరూ వచ్చేవారు కాదు. మంచి చదువు ఉండేది కాదు. ఊడ్చ దుమ్ము దులపడం, బూడిద ఎత్తడం వగైరా అన్ని పనుల్లో రోజుకు 12 గంటలు చేసేవారు.

ఈ పరిస్థితుల్లో నైటింగేల్ అమెరికా నుండి వచ్చిన డాక్టర్ సామ్యూల్ సలహా తీసుకుని ఆయన ప్రోత్సాహంతో నర్సుగా చేరడాన్ని నిర్ణయించుకుని పె నిరాకరించింది. సంసారానికి, ప్రజాసేవలకు లంగరు అందదనుకుంది. ఫ్లోరెన్స్ నైటిం నర్సు వృత్తి చేపట్టడంతో అసలా నర్సు వృత్తిలోనే గొప్ప మార్పు వచ్చింది. గొప్ప దీక్ష సేవాభావంతో పనిచేసింది. పరిస్థితుల్ని చక్కదిద్దింది. ప్రభుత్వ సహాయంతో, ఆస్పత్రు

బాగుచేయపూనుకుంది. నర్సు వృత్తికే గౌరవం, హోదాలు కల్పించింది. ఇంతలో క్రిమియా యుద్ధం, అందులో క్షతగాత్రులైన సైనికులకు సేవలందించడం జరిగింది. ఆమె ఆధ్వర్యంలో నర్సుల బృందాన్ని పంపారు. ఇక్కడ ఆమె చేసిన సేవలు మరువరానివి. నైటింగేల్ సేవా తత్పరత పరాకాష్టకు చేరుకుంది. నడిరాతిరి నిశీథిలో, చేతిలో లాంతరుతో, గాయాలతో బాధపడుతున్న ప్రతి సైనికుడి వద్దకు వెళ్ళి పరామర్శించేది. వారికి ఏం కావాలో కనుక్కుని వెంటనే వాటిని సమకూర్చేది. అన్నింటికంటే వారి దగ్గర కొంచెంసేపు కూర్చుని వారికి మానసిక స్వస్థత చేకూర్చేది. డాక్టర్లు చేయలేని పని - రోగులను వైద్యానికి ముందూ, తర్వాత సిద్ధం చేయడం. వారికి సంపూర్ణ ఆరోగ్యాన్ని సమకూర్చే పని నర్సులే చేయగలరన్న సత్యాన్ని ఆమె ఆచరించి నిరూపించింది. 1856లో క్రిమియా యుద్ధంలో ముగిసేనాటికి ఆమె అలసిపోయింది. విషజ్వరం ఆమెను ఆవరించి జవసత్వాలను పీల్చి వేసింది. తుదకు 1910లో ఇంగ్లండ్‌లో ఆఖరి శ్వాస విడిచింది. సకల బ్రిటీష్ రాచమర్యాదలతో అంత్యక్రియలు జరిపారు.

91738
హైదరాబాద్-500 044.



పోలీసులు తుపాకులు పేల్చారు. రైతుల దగ్గర ఆయుధాల్లేవు. బండ్లపై ఉన్న కొయ్యలను, గొడ్డళ్లను, తీసుకుని ఎదురు తిరిగి పోరాడుతున్నారు. రాజమణీపురం గ్రామానికి చెందిన సాచుపల్లి గున్నమ్మ ఇది చూసింది. వడినిండా ఎండుకారాన్ని నింపుకుంది. శక్తిరూపం దాల్చింది. జుట్టుముడి వీడింది. జూలుతో ఉన్న కొదమసింగంలా ఉంది గున్నమ్మ. శత్రువుల కళ్లల్లో కారం చల్లుతూ ముందుకురికింది.

# ధీర వనిత - వీరగున్నమ్మ

**భా**రతీయ రైతాంగం పోరాట పటిమలో ఎన్నడూ వెనుకంజవేయలే మంచితనానికి, అమాయకతకూ ప్రతిరూపంగా చరిత్రలో పేర్గాంచినా, తమపై జు సాగించడాన్ని, పెత్తనం చేయడాన్ని సహించలేదు. కరడుగట్టిన నిరంకుశత్వాన్ని ఎదిరి పోరాడిన ఘటనలు మనచరిత్రలో కోకొల్లలు. మధ్యయుగ కాలంలో ఔరంగజేబు విధిం అధిక పన్నులకు వ్యతిరేకంగా సిక్కు జాట్ రైతులు, సత్నామీలు పోరాటం చేశారు. వా అణచడానికి ఔరంగజేబు సైన్యాలనే దింపవలసి వచ్చింది. అదే క్రమంలో ఆంగ్ల పాల వ్యతిరేకంగా దేశం నలుమూలల్లో అసంఖ్యాక రైతాంగ పోరాటాలు, ఆదివాసీ తిరుగుబా జరిగాయి. స్వాతంత్రోద్యమకాలం నాటికి వలస పాలకులు సృష్టించి, పెంచిపోషించి, తమ తాబేదార్లుగా మలచుకున్న జమీందార్లపై రైతాంగం తిరగబడింది. జమీందార్ల దోపి

ఆగడాలకు, రైతులపై సాగించిన దమనకాండకు హద్దులేకుండా పోయింది. రైతు క్రమేపీ వ్యవసాయకూలీగా మారి, తన భూమిపైనే హక్కును కోల్పోయే పరిస్థితి. జాతీయోద్యమం, మహాత్ముడి నాయకత్వంలో కింది వర్గాలకు వ్యాప్తిచెందింది. బార్డోలీ, చాంపరాన్‌లలో గాంధీజీ, పటేల్, బీహార్‌లో సహజానంద సరస్వతి, దక్షిణభారతంలో ముత్తు రామలింగదేవర, పల్నాడులో వీరహనుమంతు, మన్యంలో సీతారామరాజు రైతాంగానికి నాయకత్వం వహించగా శ్రీకాకుళంజిల్లా మందసాగడ్డపై ఆ కర్తవ్యాన్ని వీరగున్నమ్మ నిర్వర్తించింది.

మందసా జమీందారుకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్నసమయమది.

***"అన్యాయకాలంబు దాపురించిందిపుడు***
***అందరము మేలుకోవాలండి***
***మాన్యాలు, భోగాలు మనుజులందరి హక్కు***
***మార్గాలు వెతకాలి రారండి"***

అని పాడుతూ రైతులు, కమ్యూనిస్టు పార్టీ ప్రభావంతో ప్రారంభించిన అఖిలభారత కిసాన్ సభ నాయకత్వంలో ముందుకునడుస్తున్నారు. అప్పుడు మందసా రైతాంగ పోరాటం గొప్ప మలుపు తిరిగింది. అంతవరకూ శాంతియుతంగా సాగుతూ వస్తున్న పోరాటం హింసారూపం ధరించింది. నెత్తురు చిందింది. గున్నమ్మతోపాటు మరికొందరు రైతాంగ యోధులు నేలకొరిగారు.

అసలేంజరిగిందంటే...

1940 మార్చి 26,27 తేదీల్లో పలాసా దగ్గర కాశీబుగ్గలో రైతు మహాసభలు జరిగాయి. సభలు మొదలవకముందే అఖిలభారతనాయకులైన రాహుల్ సాంకృత్యాయన్, బాబా సోహన్‌సింగ్ భాక్నాలను అరెస్టు చేశారు. అయినా సభలు జయప్రదంగా జరిగాయి. ఆ రోజుల్లో 30 వేలమంది అటు జమీందారు కట్టడి చేసినా, ఇటు ప్రభుత్వం నిర్బంధకాండ జరుపుతున్నా లెక్కచేయకుండా హాజరయ్యారు. మహాసభ వాతావరణం, నాయకుల ఉపన్యాసాలు జానపదకళా ప్రదర్శనలు ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశాయి. సభల ఆఖరిరోజున ప్రజలు నిర్వహించిన భారీప్రదర్శనలో జమీందారు బొమ్మలు గాడిదలపై పెట్టి ఊరేగింపు జరిపారు. మందసా రైతులిపుడు మునుపటిలా లేరు. రైతు మహాసభలిచ్చిన ఆత్మవిశ్వాసం, ధైర్యం వారిని కార్యోన్ముఖుల్ని చేసింది.

మరుసటిరోజే రైతులంతా గుమిగూడారు. కత్తులు, గొడ్డళ్ళు పట్టుకుని, బండ్లు కట్టి, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ అడవికెళ్ళారు. అది జమీందారు రిజర్వు ఫారెస్టు. చెట్లు నరకడానికి హక్కులేదని జమీందారు ఆంక్షలు విధించాడు. రైతులు వాటిని ఖాతరు చేయకుండా నరికిన కలపను బండ్లపైన వేసుకుని

***'ఎవడబ్బ గాడి సొమ్మో, ఈ భూమి ఎవడబ్బగాడి సొత్తో,***
***నాగలి పైకెత్తి, కొడవలటునిటు దిప్పి***
***ప్రళయరుద్రునిలాగ పరుగెడుతు వస్తుంటే***
***మమ్మెవ్వరాపగలరా, ఈ భూమి మమ్మెవ్వరడ్డగలరా?'***

అంటూ పాటలు పాడుతూ జమీందారుకోట ముందునుండి వచ్చి, రాజమణిపురం గ్రామం చేరుకున్నారు. ఇది తెలుసుకున్న జమీందారు, తాబేదార్లుగా వ్యవహరిస్తున్న అధికార్లను, రిజర్వు పోలీసులను, గూండాలను రంగంలోకి దించాడు. రైతు నాయకుడు మార్పు పద్మనాభం పిలుపునందుకుని వెంటనే చుట్టుపక్కల దగ్గరి ఊళ్ళనుండి వందలాది రైతులు రాజమణిపురం చేరుకున్నారు. పోలీసులు తుపాకులు పేల్చారు. రైతుదగ్గర అయుధాల్లేవు. బండ్లపై ఉన్న కొయ్యలను, గొడ్డళ్లను, తీసుకుని ఎదురు తిరిగి పోరాడుతున్నారు. రాజమణిపురం గ్రామానికి చెందిన సాచుపల్లి గున్నమ్మ ఇది చూసింది. వడినిండా ఎండుకారాన్ని నింపుకుంది. శక్తిరూపం దాల్చింది. జుట్టుముడి వీడింది. జూలుతో ఉన్న కొదమసింగంలా ఉంది గున్నమ్మ. శత్రువుల కళ్ళల్లో కారం చల్లుతూ ముందుకురికింది. ఇద్దరు పోలీసులు నేలకొరిగారు. సబ్ కలెక్టర్ తల బద్దలయింది. ఎటు చూసినా హాహాకారాలు. నెత్తురు నేలపై ప్రవహిస్తోంది. అనేకమంది రైతులతోపాటు గున్నమ్మ తుపాకీ గుళ్ళకు బలైపోయింది. అమరజీవిగా మిగిలిపోయింది. గున్నమ్మ వీరగున్నమ్మగా స్థానిక చరిత్రలో జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటంలో నిలిచిపోయింది. గున్నమ్మ ముఖ్య అనుచరుడు, వీరుడు, రైతు ఉద్యమానికి గుండెకాయ అయిన చక్రపాణి కూడా నేలకొరిగాడు. 'వీరగున్నమ్మ జిందాబాద్' నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది.

'మా కొద్దూ జమీందార్ల పొందు
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే
మా కొద్దూ జమీందార్ల పొందు' - అనే పాట జమీందారి ప్రాంతాల్లో మారుమోగింది.



భారతదేశ చరిత్ర పొరల్లో మరుగునపడిన
విదుషీమణులు, వీరనారీమణులు, త్యాగధనులైన స్త్రీల
గూర్చి మూడు సంపుటాల్లో 'అబలా సచ్చరిత్ర రత్నమాల
పేరుతో రచించి ప్రకటించబూనుకొంది. మొదటి
సంపుటం *1901*లో వెలువడింది. ఇది తెలుగులో
మొదటి స్త్రీల చరిత్ర.

# శోకం నుండి సంక్షేమం దిశగా

మానవ జీవితం ఒక్కోసారి అనూహ్యమైన మార్పులకు లోనవుతుంది. సాఫీగా సాగిపోతున్న జీవితం ఒడిదుడుకులకు లోనై దు:ఖమయమవుతుంది. 'పంకం నుండి పద్మాలు పుట్టినట్లు' శోకం, బాధలనుండి జీవితం మళ్ళీ కొత్త చివుళ్ళు తొడుగుతుంది. దు:ఖాన్ని దిగమింగుకుని అది మర్చిపోవడానికి పదుగురికి ఉపకరించే పని చేపట్టి సమాజాన్ని చైతన్యవంతం చేసే దిశలో తమ జీవితాల్ని మలచుకునే సార్థకజన్ములు కొందరుంటారు. భండారు అచ్చమాంబ ఈ కోవకే చెందుతారు కృష్ణా జిల్లాలో జన్మించిన అచ్చమాంబ (1874), కేవలం 30ఏళ్ళు బతికి ఏమీ తీరకమునుపే తనువు చాలించింది. మహారాష్ట్రకు చెందిన మాధవరావును పెళ్లాడి మహారాష్ట్రలోనే శేషజీవితాన్ని గడిపింది.

అచ్చమాంబకు ఇద్దరు బిడ్డలు.. ఓ కొడుకు, ఓ కూతురు పుట్టారు. వారిని అల్లారుముద్దుగా పెంచారావిడ. కానీ దురదృష్టం అచ్చమాంబను తీవ్ర దుఃఖానికి గురి చేసింది. ముక్కుపచ్చలారకమునుపే ఇద్దరు బిడ్డలూ అసువులు బాశారు. కడుపుశోకం, ముఖ్యంగా తల్లి హృదయం తల్లడిల్లింది. జీవితంపై విరక్తి. ఒకవైపు భర్త ఓదారుస్తున్నా

అచ్చమాంబ తట్టుకోలేక జీవితాన్ని చాలిద్దామనే నిర్ణయానికి వస్తున్న తరుణంలో ఆమె భవిష్యత్తు మరొకవిధంగా రూపుదిద్దుకుంది.

ప్రఖ్యాత చరిత్రకారులు, తెలుగు భాషాసారస్వతవేత్త, పోషకుడైన కొమర్రాజు లక్ష్మణరావుకు అచ్చమాంబ స్వయానా చెల్లెలు. లక్ష్మణరావు చెల్లెలిని దగ్గరకు తీసుకుని ఊరడించాడు. జీవిత విలువలు, జీవన సార్థక్యాల గురించి వివరించాడు. ఆమె మనసు గర్భశోకంనుండి మరలడానికి కృషి చేశాడు. అందులో భాగంగా ఆమెను ప్రోత్సహించి సంస్కృతకావ్యాలు, శాస్త్ర గ్రంథాలు, వేదాభ్యాసం చేసేట్టు చూశాడు. వీటిని చదివి అందులోని సారాన్ని గ్రహించడమేగాక అచ్చమాంబ మరాఠీ, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం సంపాదించింది. ఇక తాను స్త్రీ జనాభివృద్ధికి కృషి చేయాలని సంకల్పించుకుంది. ఈ క్రమంలో స్త్రీ విద్య తొలి మెట్టుగా భావించి స్త్రీల విద్యకొరకు ఉద్యమించింది. ఆంధ్రదేశానికొచ్చి అనేక పట్టణాల్లో, పల్లె ప్రాంతాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహించింది. ఉపన్యాసాల ద్వారా స్త్రీలను చైతన్యపరచి వారికోసం స్త్రీ సమాజాలను ఏర్పాటు చేసింది. బందరులో 1902లో ఆంధ్రదేశంలోనే మొదటి బృందావన స్త్రీ సమాజాన్ని ప్రారంభించింది. స్త్రీలకోసం పత్రికలుపెట్టి గ్రంథాలు రచించాలన్న సంకల్పంతో వ్యాసాలు రాసింది. స్త్రీ విద్యకు ఉద్యమరూపమిచ్చింది.

ఇదంతా ఒక ఎత్తుకాగా అచ్చమాంబ, భారతదేశ చరిత్ర పొరల్లో మరుగునపడిన విదుషీ మణులు, వీరనారీమణులు, త్యాగధనులైన స్త్రీల గూర్చి మూడు సంపుటాల్లో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' పేరుతో రచించి ప్రకటించబూనుకొంది. మొదటి సంపుటం 1901లో వెలువడింది. ఇది తెలుగులో మొదటి స్త్రీల చరిత్ర. అందులో అహల్యాబాయి, హోల్కర్, సికందర్ బేగం, రాణీ రమాబాయి, వీరమతి, రాణి దుర్గావతి, తోరుదత్, తారాబాయి, భగవతీదేవీ మొదలైనవారి జీవిత చరిత్రలను పొందుపర్చారు. రెండవ సంపుటంలోని వైదిక, వైజ్ఞానిక, బౌద్ధపరమైన స్త్రీల గురించి రాయ సంకల్పించి కొన్ని పూర్తిచేశారు. అప్పుడు ఆంధ్రదేశంలో ప్రచురితమవుతున్న 'సావిత్రి' అనే స్త్రీల పత్రికలో అవి ప్రచురితమయ్యాయి. 'సావిత్రి' సంపాదకురాలు పులుగుర్త లక్ష్మీనరసమాంబ. అచ్చమాంబ తెలుగులో మొట్టమొదటి కథారచయిత కూడా. స్త్రీ విద్యకు సంబంధించిన ఇతివృత్తం దీనిలో ప్రధానం. అబలా సచ్చరిత్ర మాల రెండో భాగం పూర్తికాకముందే మరణించడం స్త్రీ జనాభ్యుదయానికి, తెలుగు సాహిత్యానికి తీరనిలోటు.

1905కు పూర్వమే మహిళా విమోచనోద్యమాలు ఊపందుకోకమునుపే, జాతీయయోద్యమం, తీవ్రవాద భావాలు రూపొందక ముందే అచ్చమాంబ స్త్రీలకు సంబంధించి తీవ్రంగా ఆలోచించి, రచనలు చేశారు. వారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకోసం పాటుపడ్డారు. ఆమె భావ తీవ్రతకు ఒక ఉదాహరణ చూడండి.

'ఆప్తులైన పురుషులచే గృహమున నిర్బంధింపబడు స్త్రీలు రక్షితురాండ్రుకారు. ఏ స్త్రీలు తమ ఆత్మను తామే కాపాడుకొందురో వారే సురక్షితురాండ్రు'



*1937లో జవహర్‌లాల్ నెహ్రూ ఈశాన్య భారతాన్ని సందర్శించినప్పుడు గైడిన్లును షిల్లాంగ్ జైల్లో కలిసి పరామర్శించాడు. మణిపూర్‌ప్రాంత ఆదివాసీల అభ్యున్నతికి, వారి వికాసానికి, విముక్తికి కృషిచేసిన వీరవనితగా ప్రస్తుతించాడు.*

# పోరాటంతో పొందిన బిరుదు

ఆంగ్లేయుల వలస పాలనకు వ్యతిరేకంగా కొంచెం ముందూవెనుకగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో పోరాటాలు తలెత్తాయి. భారతీయ సమాజంలో అన్ని మతాలు, వర్గాలు తరతమ భేదం లేకుండా వీటిలో పాల్గొన్నాయి. ఈశాన్యప్రాంతంలో అప్పటి అస్సాం రాష్ట్రానికి ఎగువన చుట్టూవున్న ఆదివాసీ ప్రాంతాల్లో కూడా ఉద్యమాలొచ్చాయి. అలస్యంగానైనా జాతీయోద్యమ సందేశం ఈ ప్రాంతాలకు అంది ఉద్యమాలకు ఊతమిచ్చింది. ఇప్పుడు మనం మణిపూర్ అని పిలిచే ప్రాంతంలో నాగాలు, సూకీలు, కాబూలీలు ఉండే వారు. ఇది బాగా వెనుకబడిన ప్రాంతం. చదువూసంధ్యా తక్కువ. బానిసత్వం కాకున్నా దాదాపు అదే స్థితిలో వున్న వీరు ఆంగ్లేయులకు ఎంతో ఊడిగం చేసేవారు. వారి సామాన్లు మోయడం, ఇంటి చాకిరీ చేయడం, నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండేవారు. చాకిరీకి తగ్గ ప్రతిఫలం ఉండకపోవడమేగాక, అడిగితే కొరడా దెబ్బలతో హింసించేవారు. పైగా ఆదివాసీలు కాయకష్టంచేసి కట్టుకున్న చిన్నపాటి ఇళ్ళపై మూడు రూపాయలు పన్ను వేసేవారు. అప్పట్లో ఈ మొత్తం ఎంతో ఎక్కువ. వారు పడుతున్న కష్టాలను, బాధలను పాటలు, కథల రూపంలో చిన్నచిన్న సాంస్కృతిక కళారూపాల్లో వ్యక్తీకరించేవారు. సాహిత్యం, కళలు, మానవ జీవితాన్ని ప్రతిఫలిస్తాయనడం వీరి విషయంలో అక్షరాలా నిజమైంది.

ఇదిలా వుండగా 1921లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆరంభమైన సహాయ నిరాకరణోద్యమ ప్రభావం ఈశాన్యప్రాంతాల ప్రజలపై పడింది. మొదటి ప్రపంచయుద్ధంలో పాల్గొన్న అక్కడి తెగలకు చెందిన జాదోనాంగ్ గైడిన్లు తిరిగి వచ్చాడు. కాబూయీ తెగకు చెందిన సైనికుడు, తన ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చాడు. అనుచరులను చేర్చుకున్నాడు. 1927లో రహస్య సంఘాలను స్థాపించి ఆంగ్లేయుల వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. అతడి పినతండ్రి కూతురు వరసకు చెల్లెలు, 13 ఏండ్ల వయసులోఉన్న గైడిన్లు, ఉద్యమంలో చేరి ఎంతో అండగా నిల్చింది. ఉద్యమ రాజకీయ స్వభావాన్ని సంతరించుకొంది. గైడిన్లు నాయకత్వంలో బాలికా వాలంటీర్ల బృందం ఏర్పాటయింది. గాంధీజీ బోధనలచే జాదోనాంగ్ ప్రేరేపితమయినా, స్థానిక పరిస్థితుల దృష్ట్యా సైన్యమనదగిన సుశిక్షితులైన వాలంటీర్లను, ఆయుధాలను సమకూర్చుకున్నాడు. అంతలోనే అతడిపై నరబలి నేరం మోపి అరెస్టు చేయడమేకాక, ఉరిశిక్ష వేసి చంపారు.

ఇక్కడే, ఇప్పుడే ఈశాన్య ప్రాంతంలోని ఆంగ్ల వ్యతిరేక ఉద్యమం తీవ్ర మార్పుకు గురయింది. జాదోనాంగ్ చెల్లెలు, గైడిన్లు నాయకత్వం స్వీకరించింది. ఒకవైపు గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూనే రహస్యజీవితం కొనసాగించక తప్పలేదు. అజ్ఞాత జీవితంలో ఉండి తన తెగ ప్రజల సహకారంతో పోరాటాన్ని తీవ్రతరం చేసింది. ఆంగ్ల సైన్యాలు వెంటబడ్డాయి. గాలించాయి. ఉహూ లాభంలేదు. దొరకలేదు. ఒకే సమయంలో పదిచోట్ల ఆమె కన్పడిందని చెప్పుకున్నారు. దాంతో ఆమెకి మానవాతీత శక్తులున్నాయని ప్రజలు విశ్వసించారు. ఆంగ్ల సైనికులు దిగ్భ్రమకు గురయ్యారు. అడవి లోతట్టు ప్రాంతంలో కొయ్య దుంగలతో దుర్భేద్యమైన కోటకట్టి 4000 మంది సైనికుల్ని అందులో చేర్చి, భారతీయ తిరుగుబాటుకు సన్నద్ధమయ్యారు. ఆ సమయంలో 1932 అక్టోబర్‌లో ఆంగ్లేయులు మెరుపుదాడి చేసి గైడిన్లును నిర్బంధించారు. దీంతో ఆమె అనుచరులు పుట్టకొకరు, గుట్టకొకరుగా చెల్లా చెదురయ్యారు. గైడిన్లును తీవ్ర నిర్బంధానికి గురిచేసి చిత్రహింసలు పెట్టారు. కానీ ఆమె తన స్వాతంత్ర్య దీక్షను వదులుకోలేదు. లొంగిపోయి ఉద్యమాన్ని విరమించుకుంటున్నట్టు ప్రకటించమని అడిగితే ఆమె అంగీకరించలేదు. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ ఈశాన్య భారతాన్ని సందర్శించినప్పుడు గైడిన్లును షిల్లాంగ్ జైల్లో కలిసి పరామర్శించాడు. మణిపూర్‌ప్రాంత ఆదివాసీల అభ్యున్నతికి, వారి వికాసానికి, విముక్తికి కృషిచేసిన వీరవనితగా ప్రస్తుతించాడు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దీంతో ఆమె విడుదలైంది. ఆమె సేవలను ప్రభుత్వం గుర్తించి సన్మానించింది. స్వాతంత్ర్య సమరయోధురాలుగా ప్రశంసించింది. తన తెగ ప్రజలకోసం శేషజీవితాన్ని అర్పించింది. జవహర్‌లాల్ ఆమె గురించి రాస్తూ, 'రాణీగైడిన్లు'గా పేర్కొన్నాడు. ఈశాన్యభారతంలో ప్రజల విమోచనకు పాటుపడిన ధ్రువతార రాణీ గైడిన్లు చిరస్మరణీయురాలు.



భారతీయ సాహిత్యం ఒక మలుపు తిరిగేందుకు 1880 నాంది పలికింది. ఒక వేగుచుక్క పొడిచింది. ఆ వేగుచుక్కే ప్రేమ్‌చంద్‌గా మారుపేరుతో సాహిత్య ప్రపంచానికి చిరపరిచితుడైన అసలు పేరు ధన్‌పత్‌రాయ్. ఉర్దూభాషలో రాయడం ప్రారంభించిన ప్రేమ్‌చంద్, హిందీలో రచనలుచేస్తే ఎక్కువమంది చదువుతారన్న సదాశయంతో హిందీలో రాసి, హిందీ సాహిత్యంలో ఆధునిక శకకర్తగా పేరొందాడు.


# సామ్యవాద విప్లవం

**19**వ శతాబ్దంలో సాంఘిక, సాహిత్య, కళారంగాల్లో ప్రధానమైన మార్పులు పొడచూపాయి. ఈ మార్పులు ఆంగ్ల విద్యద్వారా ప్రవేశపెట్టిన పాశ్చాత్య విజ్ఞాన సంపర్కంవల్ల వచ్చాయా లేక వలనపాలనలో చోటుచేసుకున్న పాలన, భాష, ఆర్థిక అంశాలవల్ల మధ్యయుగాల భారతీయ సమాజం మార్పులకు లోనయిందా? లేక అప్పటి మేధావులు, సంస్కర్తలు సమాజాన్ని సంస్కరించాలన్న స్పృహతో వలస సంస్కృతి వ్యాప్తికి అడ్డుకట్ట వేయదల్చుకున్నారా? ఇవి లోతుగా చర్చించాల్సిన అధ్యయనాంశాలు. ఈ మార్పులు సామాజిక మార్పుకు ఉపకరించిన పత్రికారంగంలో ప్రస్ఫుటంగా ప్రతిబింబించాయి. మనిషి కేంద్రంగా అతడి మనుగడ, భవిష్యత్తు గూర్చిన ఆలోచనలు ప్రధాన సాహిత్య వస్తువులుగా రూపొందాయి. హెచ్చు తగ్గులతో, అసమాన ఆర్థిక సామాజిక పరాధీన రాజకీయవ్యవస్థలో సాహిత్యం ఎవరికోసమన్న ప్రశ్న మొదలైంది. రచయితలు ఈ సమస్యలపై ఎలా స్పందించాలి? సాహిత్య ప్రయోజనం ఏమిటి? కేవలం ఆత్మానందం కోసమేనా? లేక అది సామాజిక మార్పుకు సాధనంగా ఉపకరిస్తుందా?

ఈ సామాజిక నేపథ్యంలో భారతీయ సాహిత్యం ఒక మలుపు తిరిగేందుకు 1880 నాంది పలికింది. ఒక వేగుచుక్క పొడిచింది. ఆ వేగుచుక్కే ప్రేమ్‌చంద్‌గా మారుపేరుతో సాహిత్య ప్రపంచానికి చిరపరిచితుడైన అసలుపేరు ధన్‌పత్‌రాయ్. ఉర్దూభాషలో రాయడం ప్రారంభించిన ప్రేమ్‌చంద్, హిందీలో రచనలుచేస్తే ఎక్కువమంది చదువుతారన్న సదాశయంతో హిందీలో రాసి, హిందీ సాహిత్యంలో ఆధునిక శకకర్తగా పేరొందాడు. రెండుపందలయాభై కథలూ, పన్నెండు నవలలూ, అసంఖ్యాక వ్యాసాలూ, అనువాదాలూ, బాలసాహిత్యం సృష్టించిన విరాట్టు.

ఇంతటి ఘనకీర్తిని మూట గట్టుకున్న ప్రేమ్‌చంద్ భావజాలాన్నీ, జీవితదృక్పథాన్నీ, రచనల్లో వస్తుసంపదనూ సమూలంగా మార్చి, ఆయన జీవితానికే కొత్త వెలుగును ప్రసాదించిన ఘటన 1917లో జరిగింది. అది రష్యాలో జరిగిన సోషలిస్టు బోల్షివిక్ విప్లవం. సామాన్య మానవుణ్ణి పట్టాభిషిక్తుని చేసి, కష్టజీవులకు పట్టంకట్టిన మహావిప్లవం అది. పేదరిక నేపథ్యంనుండి వచ్చిన ప్రేమ్‌చంద్ చిన్నతనంనుంచే అభ్యుదయ భావాలవైపు ఆకర్షితుడయ్యాడు. జాతీయ విప్లవకారుడు, చిరునవ్వుతో ఉరికంబమెక్కిన బాలయోధుడు ఖుదీరాంబోసు, ఐక్య ఇటలీ నిర్మాతలు మాజినీ, గారిబాల్డీ - వీళ్ళను అభిమానించిన ప్రేమ్‌చంద్ మనోఫలకంపై రష్యా విప్లవం చెరగని ముద్రవేసింది. అప్పటికే టాల్‌స్టాయ్, గోర్కీ లాంటి ప్రముఖ సాహిత్యకారుల రచనల ప్రభావం ఆయనపై ఉంది. దీంతో ప్రేమ్‌చంద్ సారథ్యంలో హిందీ సాహిత్యం మలుపుతిరిగింది. ఇక ప్రేమ్‌చంద్ పేదరికపు మూటల గురించి విశ్లేషించాడు. 1933లో 'జాగరణ' పత్రికకు రాసిన సంపాదకీయంలో ప్రైవేటు ఆస్తిపై హక్కు పోయినప్పుడే మానవసమాజం సుఖశాంతులతో తులతూగుతుందని భావించాడు. మత దురహంకారాన్ని ఖండించి మతం పేరుతో జరిగే మారణహోమాన్ని 'కర్మభూమి', 'రంగభూమి' నవలల్లో చిత్రించాడు. 'గోదాన్' నవల్లో గ్రామీణపేదల జీవితాన్ని పట్టిపీడించే రుణభారాన్ని, కటిక దారిద్ర్యాన్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. 'సేవాసదన్' నవల్లో వేశ్యల దయనీయ జీవితాన్ని హృదయం ద్రవించేరీతిలో వర్ణించాడు.

దేశానికి కావల్సింది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే కాదని ఆర్థిక సమానత్వం, స్వావలంబన కావాలని అభిలషించాడు. ధనస్వామ్యాన్ని కూకటివేళ్ళతో పెకలించే సమాజాన్ని 'మహాజన సభ్యత' రచనలో వివరించాడు. తాను కోరుకుంటున్న నూతన సమాజంలో కాయకష్టంచేసే శ్రమజీవులకు, బుద్ధిజీవులకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. వారికే గౌరవ ప్రతిపత్తులు దక్కుతాయి. పరుల కష్టంపై ఆధారపడే పరాన్నభుక్కులకూ, దోపిడిదార్లకూ ఆ సమాజంలో స్థానం ఉండదు. అదే సోషలిస్టు సంస్కృతి. ప్రగతిశీల, సామ్యవాద భావజాలంతో ప్రేరేపితమై లక్నోలో సమావేశమైన అభ్యుదయ రచయితల ప్రారంభ సభలకు అధ్యక్షత వహించడం ఆయన రచనాజీవితానికి కలికితురాయి. 1936లో మరణించిన ప్రేమ్‌చంద్ రచనలు బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తెలుగు మొదలైన భారతీయ భాషల్లోనే గాక, ఆంగ్లం, రష్యన్, ఫ్రెంచి, జర్మన్ తదితర విదేశీ భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి.



పోలెండ్ దేశస్థుడు కోపర్నికస్ ప్రశ్నించాడు. ధైర్యంగా సవాలు చేశాడు. చర్చి సిద్ధాంతం అశాస్త్రీయమని, అసత్యమని తన పరిశోధన ద్వారా నిరూపించాడు. ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించాడు. భూమి కేంద్ర (ఎర్త్ సెంటర్) సిద్ధాంతానికి బదులుగా సూర్యకేంద్ర (సన్ సెంటర్) సిద్ధాంతాన్ని ప్రవచించాడు. భూమి తనచుట్టూ తిరుగుతూ, సూర్యునిచుట్టూ తిరుగుతున్నదనీ, అందువల్ల రాత్రింబగళ్ళు ఏర్పడుతున్నాయని నుడివాడు.


# సూర్య కేంద్ర సిద్ధాంతం? శాస్త్ర విజ్ఞానంలో ముందంజ

యూరోపాఖండం మధ్యయుగాల భూస్వామ్య భావజాలానికి 15వ శతాబ్దంలోనే స్వస్తిపలికింది. 15 నుండి 17వ శతాబ్దం వరకూ నూతన సాంస్కృతిక భావజాల ప్రభావంలో శాస్త్రవిజ్ఞానం క్రమేపీ రెక్కలు తొడిగి విస్తరించింది. మధ్యయుగాల్లో ఐరోపాలో సమాజంపై మతప్రభావం తీవ్రంగా ఉండేది. స్వతంత్ర ఆలోచనకు, హేతుబద్ధతకు ఆస్కారం లేదు. మతం చెప్పిందే వేదం. అదే తిరుగులేని సత్యం. నిజంలేదని తెలిసినా విబేధించడానికి వీల్లేదు. ఎవరైనా ఒకవేళ సాహసించి వాస్తవం చెప్పేందుకు సాహసించినా వారు అత్యంత కఠినశిక్షలకు, పలుహింసలకు గురయ్యేవారు. ఈ పరిస్థితినుండి మానవుని మేథకు పదునుపెట్టడమేగాక మతం చెరనుండి విమోచన లభించే వెసులుబాటును పునరుజ్జీవన ప్రక్రియ కల్పించింది. మానవుడే సకల చరాచర జగత్తుకు కేంద్రబిందువుగా వర్ణించి మానవుడిని ప్రకృతికి మకుటధారిగా నిలిపిందీ అప్పుడే.

ఈ కాలంలో ఆవిష్కరించిన భౌగోళిక శాస్త్ర విజ్ఞాన ఆవిష్కరణలు మనం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం. ఇవి ప్రపంచ స్వరూపాన్నే మార్చివేశాయి. సాహిత్య, కళారంగాల్లో గణనీయమైన కృషి జరిగింది. అప్పుడే షేక్స్‌ఫియర్, మిల్టన్, వర్డ్స్‌వర్త్ లాంటి సాహిత్యకారులు. లియోనార్డుడావిన్సీ, మైకేలాంజిలో, రాఫేల్ లాంటి మహాశిల్పులు, చిత్రకారులు, తమ కళాఖండాలను సృష్టించింది కూడా ఆకాలంలోనే.

మతానికి ప్రాతినిధ్యం వహిస్తూ నాయకత్వ స్థానంలో ఉన్న చర్చ్ మనచుట్టూ ఉన్న భౌతిక జగత్తును ఎలా దర్శించింది? భూమి కేంద్రంగా ఇది నిర్మితమైందని, భూమి చుట్టూ సూర్యుడు పరిభ్రమిస్తున్నాడనీ, నక్షత్రాలు, 'స్వర్గంలో' (అంతరిక్షంలో) నిలకడగా నిలిచి ఉన్నాయని సిద్ధాంతీకరించింది. ఈ సత్యాన్ని ఎవరు ప్రశ్నించినా వారిని మత విరోధులుగా (నాస్తికులుగా) పరిగణించి వారిని శిక్షించడానికి ప్రత్యేకంగా చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటైన 'ఇన్‌క్విసిషన్' అనే అమానుష 'న్యాయ' స్థానం విధించే క్రూరమైన శిక్షలకు గురి చేసేవారు.

పై సిద్ధాంతాన్ని పోలెండ్ దేశస్థుడు కోపర్నికస్ ప్రశ్నించాడు. ధైర్యంగా సవాలు చేశాడు. చర్చి సిద్ధాంతం అశాస్త్రీయమని, అసత్యమని తన పరిశోధన ద్వారా నిరూపించాడు. ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించాడు. భూమి కేంద్ర (ఎర్త్ సెంటర్డ్) సిద్ధాంతానికి బదులుగా సూర్యకేంద్ర (సన్ సెంటర్డ్) సిద్ధాంతాన్ని ప్రవచించాడు. భూమి తనచుట్టూ తిరుగుతూ, సూర్యునిచుట్టూ తిరుగుతున్నదనీ, అందువల్ల రాత్రింబగళ్ళు ఏర్పడుతున్నాయని నుడివాడు. ఇది ఆధునిక శాస్త్రీయ పరిశోధన. విశ్వాన్ని విశ్లేషించిన ఈ పరిశోధన, విశ్వాంతరాళ పరిశోధనకు పునాది అయింది. ఆధునిక శాస్త్రవిజ్ఞానం ఒక కుదుపుకులోనై ముఖ్యమైన మలుపు తిరిగింది. కోపర్నికస్ ఎలాగో చర్చి దమనకాండ నుండి తప్పించుకొన్నాడు. ఆధునిక ఖగోళ శాస్త్రానికి దీనిద్వారా అంకురార్పణ జరిగింది. నేటికీ ఇదే ప్రాతి పదికగా కొనసాగుతూ ఉండడం విశేషం. కోపర్నికస్ పరిశోధనా గ్రంథం 'డివల్యూషనిబస్ ఆర్బియస్ సోలెస్టియమ్' 1543లో ప్రచురితమైంది. ఇందులోని పరిశోధనాంశాలు క్రైస్తవ మతావిర్భావం తర్వాత జరిగిన అనేకానేక అప్రామాణిక, అశాస్త్రీయ విషయాలను పూర్వపక్షం చేశాయి. కోపర్నికస్ పరిశోధనలు ఆ తర్వాత జరిగిన ఎన్నో ప్రయోగాలకు అనుకూలించాయి. కానీ వారు చర్చి దమననీతి నుండి తప్పించుకోలేకపోయారు. ఇటలీశాస్త్రవేత్త సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని బలపరుస్తూ దాని ఆధారంగా పరిశోధనలు జరిపి చర్చి ఆగ్రహానికి గురయ్యాడు. 1600 సంవత్సరంలో రోమ్ నగరంలో పోప్ సమక్షంలో బ్రూనోను సజీవంగా కాల్చిచంపారు. అదే క్రమంలో మొదటిసారిగా టెలిస్కోప్ పరికరాన్ని కనిపెట్టి ఖగోళ రహస్యాలను ఛేదించిన గెలీలియో (కోపర్నికస్ సమాకాలికుడు) కూడా ఇలాంటి శిక్షకు గురయ్యేవాడే! కానీ గెలీలియో శిక్షకు జంకి, తన విజ్ఞాన శాస్త్ర ఫలితాలను ధైర్యంగా సమర్పించు కోలేకపోయాడు. తన సిద్ధాంతాలు సరైనవి కావని, నిజానికి సూర్యుడే భూమిచుట్టూ తిరుగుతున్నాడని ప్రకటించి చావునుండి తప్పించుకున్నాడు.



*1925 మార్చిలో మహాత్మాగాంధీ కేరళ పర్యటనకు వెళ్ళినపుడు, దేవాలయంచుట్టూ నడవడానికి మాత్రం అనుమతినిచ్చేట్లు రాజీ కుదిరింది. గర్భగుడిలో ప్రవేశానికి అనుమతివ్వలేదు. దీనితో కోపోద్రిక్తుడైన గాంధీజీ కేరళ పర్యటనలో ఒక్క దేవాలయాన్నీ దర్శించకుండా తన నిరసన తెల్పాడు.*

# అస్పృశ్యతపై పోరాటం వైకోం సత్యాగ్రహం

**దే**శానికి స్వాతంత్ర్యం సిద్ధించి అర్ధశతాబ్దం దాటినా సమాజంలో అంటరానివారుగా పరిగణింపబడుతున్న దళితుల ఆర్థిక, సామాజిక, స్థితిగతుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాకపోవడం తీరని విషాదం. గ్రామసీమల్లో రెండు గ్లాసుల పద్ధతి, అణచివేత, దళితుల్ని వెంటాడుతూనే ఉన్నాయి. హిందూమతంలో భాగమైన కులరక్కసి నిర్మూలింపబడనిదే వీనికి విరుగుడు లేదు. కుల వివక్షకు వ్యతిరేకంగా పంతొమ్మిదో శతాబ్దం నుండే ఉద్యమాలొచ్చాయి. ఈనాటికీ కె.వి.పి.ఎస్. లాంటి సంస్థలు దీనిపై పోరాడుతూనే ఉన్నాయి.

జాతీయోద్యమకాలంలో అస్పృశ్యతానివారణకు గాంధీమహాత్ముడు రాజీలేని పోరాటాన్ని సాగించాడు. హిందూమతానికి అది తీరని మచ్చగా అభివర్ణించాడు. అస్పృశ్యతను నిర్మూలించకుంటే, అదొక శాపమై హిందూమతాన్నే నిర్మూలిస్తుందని హెచ్చరించాడు. అస్పృశ్యతను సమర్థించే మతాన్ని తాను గౌరవించననీ చెప్పాడు. ఇదే క్రమంలో వారిని 'హరిజనులుగా' పిలిచాడు. తద్వారా, సర్వసముడైన పర్వేశ్వరునికి వీరు అత్యంత ప్రీతిపాత్రులని చెప్పడం గాంధీజీ ఉద్దేశం. వీరిని దేవుడికి దగ్గరగా తీసుకువెడితే, సమాజం దృష్టిలో వీరూ సమానులేనన్న భావంతో, హరిజనుల దేవాలయ ప్రవేశమనే మహత్తర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించాడు. సవర్ణులకు మాత్రమే పరిమితమైన దేవాలయ ప్రవేశం, ఇవాళ దళితులుగా పిలవబడుతున్న హరిజనులకు కల్పిస్తే, అంటరానితనం అంతమవుతుందని

గాంధీజీ భావించాడు. ఈ జటిల సమస్యకు సామాజిక దృక్కోణం మాత్రమే కాక, అతి ముఖ్యమైన ఆర్థిక కోణం కూడా ఒకటుందని ఆయనకు తెలిసినా, ఆయన ఎజెండాలో అది ప్రధానంగా లేకపోవడం విచారకరం.

హరిజన దేవాలయ ప్రవేశ కార్యక్రమానికి దేశమంతటా మంచి ప్రోత్సాహం కలిగిందంటే అందుక్కారణం కేరళలో జరిగిన ఒక సంఘటన. అది వైకోం సత్యాగ్రహం. కేరళ తిరువాన్కూర్ ప్రాంతంలోని వైకో ఒక గ్రామం. అక్కడొక పెద్ద దేవాలయం ఉంది. ఆ దేవాలయానికి చుట్టూ పెద్ద ప్రహరీ. ప్రహరీకి నలువైపులా విశాలమైన రోడ్లు... ఆ రోడ్లపై 'అవర్ణులైన' ఎజవాలు, పులయార్‌లు నడవడానికి వీల్లేదు. అస్పృశ్యతానివారణకు నడుంకట్టిన కార్యకర్తలు ఒకవైపు అవర్ణులుగా పరిగణించేవారి విద్య, సామాజిక, వైజ్ఞానిక అభ్యున్నతికోసం కృషిచేస్తూ, మరో వైపు దేవాలయాలను, రహదారులను వీరికి అందుబాటులో ఉంచాలన్నది వీరి సంకల్పం. దేవాలయ ప్రవేశం ద్వారా మతంతో ముడివడిన అస్పృశ్యతను దెబ్బతీయవచ్చునన్నది వీరి ఆశయం. దానికోసం సత్యాగ్రహం అనే ఆయుధాన్ని చేపట్టారు. అప్పటికే కేరళ సమాజంలో అస్పృశ్యతానివారణకు శ్రీనారాయణ గురు, కుమారన్ ఆశాన్, టి.కె. మాధవన్ మొదలైన సంఘసంస్కర్తలు అవిరళకృషి సల్పి ఉన్నారు.

1924 మార్చి 30 నాడు వైకోం సత్యాగ్రహం ఆరంభమైంది. దేవాలయ ప్రవేశాన్ని అనుమతించాలనీ, రహదారులపై నడవడానికి ఆంక్షలుండరాదనీ, పెద్ద ఊరేగింపు నిర్వహించారు. కేరళ రాష్ట్రమంతటా ఈ చర్య తీవ్ర చైతన్యాన్ని కల్గించింది. 'సవర్ణులకు' చెందిన అనేక సంస్థలు, నాయర్ సర్వీసు సొసైటీ, కేరళ హిందూసభ, నాయర్ సమాజం, బ్రాహ్మణకులంలో అత్యున్నతకులంగా ఎంచబడే నంబూద్రీల సంస్థ 'యోగక్షేమ సభ' కూడా సత్యాగ్రహానికి మద్దతు పలకడం విశేషం. కానీ తిరువాన్కూర్ ప్రభుత్వం, దేవాలయంచుట్టూ బారికేడ్లు నిర్మించి సత్యాగ్రహులను రాకుండా చేసి, వందల వేలమందిని అరెస్టుచేసి జైలుకు పంపింది. అయినా సత్యాగ్రహం ఆగలేదు.

వైకోం సత్యాగ్రహం యావద్భారత ప్రజానీకదృష్టిని ఆకట్టుకుంది. దేశం నలుమూలల నుండి స్వచ్ఛందంగా వేలసంఖ్యలో వైకోం సత్యాగ్రహంలో పాల్గొనడానికి జట్లుజట్లుగా వెళ్లారు. పెరియార్ (ఇ.వి. రామస్వామి నాయకర్) నాయకత్వంలో ఒక జట్టు పాల్గొని అరెస్టయింది. సత్యాగ్రహంలో పాల్గొన్న 'సవర్ణులు' సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. తిరునాన్కూర్ పాల్గొన్న 'సవర్ణేలు' సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. తిరునాన్కూర్ ప్రభుత్వం వారికి ఉద్యోగార్హతలను తొలగించింది కూడా. 1925 మార్చిలో మహాత్మాగాంధీ కేరళ పర్యటనకు వెళ్ళినపుడు దేవాలయంచుట్టూ నడవడానికి మాత్రం అనుమతినిచ్చేట్లు రాజీ కుదిరింది. గర్భగుడిలో ప్రవేశానికి అనుమతివ్వలేదు. దీనితో కోపోద్రిక్తుడైన గాంధీజీ కేరళ పర్యటనలో ఒక్క దేవాలయాన్నీ దర్శించకుండా తన నిరసన తెల్పాడు.

వైకోం సత్యాగ్రహ విజయాపజయాల మాట అటుంచి, అస్పృశ్యతానివారణ ఉద్యమాన్ని ఈ ఘటన ఒక మలుపు తిప్పి సమస్యను జాతీయస్థాయికి కొనిపోవడమే దీని ప్రత్యేకత.



కత్తి దూసింది. సైన్యాధ్యక్షుల్ని సమావేశపర్చి
ఉత్తేజకరంగా ఉపన్యాసమిచ్చింది.
పరాయి మూకలను చెండాడి, కిట్టూరు సంస్థాన
స్వాతంత్ర్యాన్ని, తద్వారా దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడమని
కోరింది. యుద్ధం ఆరంభమైంది. యుద్ధగమనంలో,
ఆంగ్లేయ సైన్యాధిపతి థాకరే కిట్టూర్ సైనికుల చేతిలో
హతమయ్యాడు. దాంతో వారి సైన్యం చెల్లాచెదురైంది.

# ఆంగ్ల ఆధిపత్యాన్ని అరికట్టిన రాణి చెన్నమ్మ

**భా**రతదేశంతో వ్యాపారంచేసి లాభాలార్జించడం కోసం వచ్చిన ఐరోపాదేశస్తులు క్రమేపీ రాజకీయ ప్రాబల్యం పెంచుకుని దేశాన్ని ఆక్రమించుకున్నారు. ఆంగ్లేయుల ఆధిపత్యంలో భారతదేశం ఆర్థిక వలసగా మారింది. ఆంగ్లేయులకు లోబడి, వార్షిక కప్పం చెల్లిస్తూ, తమ, తమ సంస్థానాల్లో, రాజ్యాల్లో స్వతంత్రంగా ఉండే ప్రాంతాలు కూడా వందల సంఖ్యలో ఉండేవి. ఆంగ్లాధికారాన్ని, ఈ సంస్థానాలు అంగీకరించినా, వెలస్లీ, డల్హౌసీ లాంటి గవర్నర్ జనరల్స్, వీటిని కూడా ఆక్రమించుకోవాలని పన్నాగాలు పన్ని, ఏదోఒక కారణంతో వాటిని తమ పాలిత ప్రాంతంలో కలుపుకునేవారు.

ఈ విధానంలో భాగంగానే మైసూర్ స్వదేశీరాజ్యంలోని ఒక చిన్నపాటి సంస్థానాన్ని ఆక్రమించుకున్న విధానం ఆసక్తికరమేగాక, వలస పాలనలోని అమానుషత్వాన్ని తెలుపుతుంది.

ధార్వాడ్ జిల్లా కేంద్రం. దానికి సమీపంలో కిట్టూర్ అనే ఒక చిన్న సంస్థానం ఉండేది. మొత్తం దక్షిణ భారత దేశంలోనే విస్తీర్ణంలో చిన్నదయినా, సంపన్నమైనది. బలమైన కోట, కోటపై బురుజులు, కోట చుట్టూ లోతైన కందకం, కోటలోపల రాజాగారి అంతః

పుర ప్రాసాదాలు. కిట్టూరుకు రాజు మల్లసరాజా. 1782లో రాజ్యానికి వచ్చి, 181
దాకా పాలించాడు. మైసూరు రాజ్యాధిపతి టిప్పుసుల్తాన్. అతడిని 1799లో ఆంగ్లేయుల
జయించి, దక్షిణభారతంలో ఎదురులేని శక్తిగా రూపొందారు. దీంతో 1800 తర్వాత
బ్రిటీషువారి కన్ను కిట్టూర్‌పై పడింది. ఏమైనా దాన్ని ఆక్రమించాలి. దానికున్న ఆర్థి
వనరులను, బొక్కసంలోని డబ్బును, అంతఃపురంలోని రాణుల జవహరీని కాజేయాలన
దుర్బుద్ధి పుట్టింది.

ఇది ఎలా జరగాలి? ఏ సాకుతో కిట్టూర్‌ని ఆక్రమించుకోవాలి? ఈ మధనల
జిల్లాలోని ఆంగ్లాధికార్లు, పైనున్న ప్రభువులు, ఆలోచిస్తుండగా, 1816లో కిట్టూ
సంస్థానాధిపతి మల్లసరాజా చనిపోయాడు. ఆయన మరణంతో కిట్టూర్ కథ ఆంగ్లేయుల
అనుకూలంగా మారింది. కానీ, వారి రొట్టె మాత్రమే విరిగింది. అది నేతిలో పడడాని
మరికొంత వ్యవధి కావాల్సి వచ్చింది. మల్లసరాజా చనిపోయే ముందు శివలింగ రు
సర్జాను దత్తత తీసుకున్నాడు. శివలింగరుద్రుడు బలహీనుడు, అసమర్థుడు, శక్తిహీనుడ
అయితే, ఈ పరిస్థితిని ముందే గ్రహించిన రాణీ చెన్నమ్మ, అధికారాన్ని తన చేతుల్లో
తీసుకుంది. రాణీ చెన్నమ్మ, చనిపోయిన మల్లసరాజాకు రెండో భార్య, ధీరవని
తెలివితేటలతో పాటు చాకచక్యం కూడా ఆమె సొంతం. వివాహానికి మునుపే చి
వయసులోనే శౌర్యప్రతాపాలను ప్రదర్శించింది. వేటలో సిద్ధహస్తురాలైన చెన్నమ్మ, ఒ
బాణంతో పెద్దపులిని హతమార్చేదన్న ఖ్యాతి సంపాదించింది. బలహీనుడైన శివలిం
రుద్రుడిని పక్కన పెట్టింది. సైన్యాన్ని పునర్నిర్మించింది. ఆంగ్లేయుల దురాలోచనను ముం
పసిగట్టింది. ఆర్థిక పటిష్టతను సమకూర్చుకుంది. చుట్టుపక్కల ఉన్న రాజులతో మంతనా
సాగించింది. ఇదంతా ఆంగ్లేయాధికార్లు గమనిస్తూ సరైన అదనుకోసం వేచి ఉన్నార
ఇంతలో రాజు శివలింగరుద్రసరాజా జబ్బుతో మంచంపట్టి 1824లో మరణించాడ
దీంతో ఆంగ్లేయుల రొట్టె నేతిలో పడింది.

అయితే, శివలింగరుద్రసరాజా చనిపోవడానికి కొద్దిగా ముందు, శివలింగప్ప
దత్తత తీసుకున్నారు. అటు మొదటి భార్యకు, ఇటు రెండో భార్య చెన్నమ్మకు బిడ్డలు లే
ఇక రాణీ చెన్నమ్మ సర్వం తానై సంస్థానాన్ని ఏలుబడి చేయనారంభించగా, కిట్టూ
ఆస్థానంలో అంతర్గత కుట్రలు ఆరంభమయ్యాయి. వీటికి బ్రిటీషువారు ఆజ్యంపోసి పెం
పోషించారు. రాణీ చెన్నమ్మకు వ్యతిరేకంగా వీరిని ఉసిగొలిపారు. దత్తత చెల్లద
ముందుగా అనుమతి తీసుకోలేదని కుంటిసాకులు చెప్పి కోటను ఆక్రమించుకు
కోశాగారానికి కాపలా ఉంచారు. రాణీ చెన్నమ్మకున్నది చిన్నపాటి సైన్యం. ఆంగ్లేయుల
బలమైన, సుశిక్షితులైన పెద్ద సైన్యం వుంది. అయినా రాణీ చెన్నమ్మ జంకలేదు. క
దూసింది. సైన్యాధ్యక్షుల్ని సమావేశపర్చి ఉత్తేజకరంగా ఉపన్యాసాలిచ్చింది. పరా
మూకలను చెండాడి, కిట్టూరు సంస్థాన స్వాతంత్ర్యాన్ని, తద్వారా దేశ స్వాతంత్ర్యా
కాపాడమని కోరింది. యుద్ధం ఆరంభమైంది. యుద్ధగమనంలో, ఆంగ్లేయసైన్యాధి
థాకరే కిట్టూర్ సైనికుల చేతిలో హతుడయ్యాడు. దాంతో వారిసైన్యం చెల్లాచెదురైం

యుద్ధరంగంలో గుర్రాన్నెక్కి వీరోచితంగా పోరాడి గెల్చిన రాణీ చెన్నమ్మకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అదొక ఉజ్వల ఘట్టం.

ఇంతటితో కిట్టూర్ కథ ముగిసిందనుకుంటే పొరబాటే అవుతుంది. అలాగైతే ఆంగ్లేయులు ఈ దేశంలో 1947దాకా ఉండేవారు కాదు. 'విభజించి పాలించు' విధానంలో సిద్ధహస్తులైన ఆంగ్లేయాధికారులు, కిట్టూరు సంస్థానంలో కీలక వ్యక్తులైన కన్నూర్ మల్లప్ప, వెంకటరావులను తమవైపుకు తిప్పుకున్నారు. రాణీ చెన్నమ్మ ఆదమర్చివుండగా, దొంగ దెబ్బ తీసి, ఈసారి మరింత ఎక్కువ సైన్యంతో (25,000 మంది) యుద్ధం ప్రకటించారు. 1824 డిసెంబర్ 4వ తేదీన కిట్టూర్ పరాజయం పాలైంది. 1824లోనే బ్రిటీష్‌వారిని ఎదిరించిన ధీర వనితగా, (ఆ తర్వాత 1857లో ఝాన్సీరాణి ఈ క్రమంలోనే వీరమరణం చెందింది) భారతదేశ చరిత్రలో వీరనారిగా చరిత్రలో శాశ్వతంగా నిల్చిపోయింది.



ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచి, ఆ సమయంలో
ముమ్మరంగా సాగుతున్న స్వదేశీ ఉద్యమం
ఊపందుకోడానికి ఆంధ్రపత్రిక దోహదం చేసింది. ఆంధ్ర
పత్రిక స్థాపన తెలుగు జర్నలిజంలో ఒక పెద్ద ఘటన.
కేవలం రాజకీయాలకే గాక, తెలుగు భాషకు,
సారస్వతానికి ఈ పత్రిక ఎనలేని సేవలందించింది.

# ఆంధ్రపత్రికతోడ అమృతాంజనమిచ్చి...

శిరోభారాన్ని తగ్గించే ఔషధాలు మార్కెట్లో ఎన్నున్నా కూడా నాటికీ, నేటికీ అమృతాంజనాన్ని మించిన లేపనం మరొకటి లేదన్నది అందరి అనుభవం. ఎన్ని దినపత్రికలు, మరెన్ని వార, పక్ష, మాస పత్రికలొచ్చి మార్కెట్‌ను నింపినా, అప్పటి ఆంధ్రపత్రిక, లేదా భారతి లాంటి సాహిత్య పత్రికలు రాలేదనీ, ఒక వేళ వచ్చినా, అప్పటి ఆ రెండు పత్రికలు ఆయా రంగాల్లో కావించిన కృషి మార్గదర్శకమని పరిగణించడంలో రెండు అభిప్రాయాలుండవు.

అమృతాంజనం, ఆంధ్రపత్రిక - ఈ రెంటికీ అవినాభావ సంబంధం ఉండడం విశ్వదాతగా పేర్గాంచిన కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, వీటికి ఆదుద్యుడని చెప్పడం అతిశయోక్తి కాదు. వాస్తవం. మనందరికీ సాధారణంగా అనారోగ్యం కల్గించే స్వల్ప రుగ్మతలు జలుబు, దగ్గు తలనొప్పి వీటిని ఎంత త్వరగా నయం చేసుకుంటే అంతమంచిదని భావించటం మానవ నైజం. అలాంటి పరిస్థితుల్లో, ముందుగా అమృతాంజనాన్ని వైద్యరంగంలో ప్రవేశపెట్టిన ఘనత కాశీనాథులవారిది. ఇక జాతీయోద్యమకాలంలో ప్రాంతీయ భాషల్లో పత్రికారంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరిస్తున్నప్పుడు, ఆ ప్రభావంలోంచి పుట్టుకొచ్చిందే ఆంధ్ర పత్రిక. ఆంధ్రుల జాతీయ భావదీప్తికి, వ్యాప్తికి చేదోడువాదోడుగా నిల్చిన అప్పటి ఏకైక వార్తాపత్రిక కూడా ఆంధ్ర పత్రికే!

ఇంతకీ వీటి కథాకమామిషు ఏమిటంటా? వీటిని ప్రసాదించిన ఆ మహాపురుషుని పూర్వాపరాలేమిటి? ఆంధ్ర దేశంలో సంస్కరణోద్యమం మంచి ఊపులో ఉన్నప్పుడు జాతీయోద్యమం మొగ్గ తొడుగుతున్నదశలో 1867 ఏప్రిల్ 11న కృష్ణా జిల్లా ఎలమర్రు

శ్యామలాంబ, బుచ్చయ్యలకు నాగేశ్వరరావు జన్మించాడు. మచిలీపట్నంలో చదువు ముగించుకుని, ఉన్నత విద్యకు మద్రాసు చేరాడు. ఉద్యోగానికి ప్రయత్నించక సొంతంగా వ్యాపారం పెట్టి, స్వేచ్ఛగా దేశసేవ చేయాలని సంకల్పించుకున్నాడు. తుదకు బొంబాయి చేరి, 'విలియం అండ్ కో' అనే బ్రిటీష్ కంపెనీలో చిన్న ఉద్యోగంలో చేరాడు. దాని యజమాని ఇంగ్లండుకు వెళ్తూ కంపెనీ బాధ్యతలను నాగేశ్వరరావు చేతిలో పెట్టాడు. ఇది ఆయన జీవితంలో తొలి మలుపు. కంపెనీ వ్యాపారం వృద్ధి చెందింది. ధనార్జన మొదలైంది. ఆయుర్వేదంలో ఆసక్తి ఉన్న పంతులు గారు, తానే కొన్ని మందులు తయారుచేసేవాడు. ఈ క్రమంలో అమృతాంజనాన్ని కనుగొన్నాడు. ఇది ఆయన జీవితంలో రెండో మలుపు. త్రుటికాలంలో అమృతాంజనానికి దేశమంతటా మంచి పేరొచ్చింది. కాశీనాథుని నాగేశ్వరరావుకు సరుకును ఎలా అమ్మాలో కొనుగోలుదార్లను ఎలా ఆకర్షించాలో బాగా తెలుసు. అమృతాంజనం గూర్చి పత్రికల్లో ప్రకటనలు గుప్పించాడు. ఆ రోజుల్లోనే రంగురంగుల ఆకర్షణీయమైన అడ్వర్టైజ్‌మెంట్స్ ఇచ్చాడు. దీంతో విపరీతంగా లాభాలు గడించాడు.

ఈ నేపథ్యంలో 1908లో ఆంధ్ర పత్రికను ప్రారంభించాడు. గిట్టనివారు కొందరు తన అమృతాంజనాన్ని అమ్మడానికి పత్రికను ప్రారంభించాడని విమర్శించారు. అయినా అది వాస్తవం కాదు. ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచి, ఆ సమయంలో ముమ్మరంగా సాగుతున్న స్వదేశీ ఉద్యమం ఊపందుకోడానికి ఆంధ్రపత్రిక దోహదం చేసింది. ఆంధ్ర పత్రిక స్థాపన తెలుగు జర్నలిజంలో ఒక పెద్ద ఘటన. కేవలం రాజకీయాలకే గాక, తెలుగు భాషకు, సారస్వతానికి ఈ పత్రిక ఎనలేని సేవలందించింది. పంతులుగారు బొంబాయి నుంచి వ్యాపార లావాదేవీలను మద్రాసుకు మార్చాడు. 1914లో ఆంధ్రపత్రికను దిన పత్రిక చేశాడు. ఇది తెలుగువారి మొదటి దినపత్రిక. అంతేకాక, 1924లో 'భారతి' అనే సాహిత్య మాసపత్రికను స్థాపించాడు. భారతీయభాషల్లో ఇంత గొప్ప సాహిత్య పత్రిక వెలువడలేదని అభిజ్ఞుల అభిప్రాయం. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలు (ఉగాది సంచికలు) సాహిత్య, సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలకు పేరెన్నికగన్నాయి. ఇప్పటికీ, అవి పరిశోధకులకు విశేషంగా ఉపయోగపడ్తూనే ఉన్నాయి.

'అమృతాంజనమిచ్చి', 'ఆంధ్రపత్రిక', 'భారతి' లందించిన కాశీనాథులవారు గొప్ప సాహిత్యవేత్త కూడా. 'ఆంధ్రగ్రంధమాల' అనే సంస్థను స్థాపించి ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని వెలువరించారు. స్వయంగా 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము', 'భగవద్గీతపై వ్యాఖ్యానం' మొదలైన ఎన్నో ప్రామాణిక గ్రంధాలను రచించారు. 1919లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుకు అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. తన ఏకైక కూతురికి బాల్యవివాహం చేయలేదు. పరిణత వయసులో (అప్పట్లో) పెళ్ళిచేయడం ఆయన ఉన్నతభావాలను చెప్పకనే చెప్తాయి. ఆంధ్రదేశంలో గ్రంథాలయాలకు ఉచితంగా ఆంధ్రపత్రికతోపాటు ఎన్నో ఇతర గ్రంథాలను విరాళంగా పంపేవాడు. సత్యాగ్రహకాలంలో కారాగారవాస శిక్షను అనుభవించిన విశ్వదాత నాగేశ్వరరావు పంతులు 1938లో మరణించాడు.



*1913లో కేంబ్రిడ్జిలోని గణిత శాస్త్రాచార్యుడు హార్డ్‌కు ఒక జాబు రాసి, దాంతోబాటు తాను పరిష్కరించిన గణిత సమస్యల నోట్సులను జతపర్చి పంపాడు. వాటిని చూసిన హార్డ్ నిశ్చేష్టుడయ్యాడు. రామానుజంలో నిద్రాణమైయున్న గణితశాస్త్ర పాండిత్యానికి అచ్చెరువొందాడు. వెంటనే ఉపకార వేతనంతోపాటు కేంబ్రిడ్జ్ ట్రినిటీ కళాశాలలో ఉండేందుకు అన్ని వసతులూ కల్పించాడు.*

# గుమస్తా గిరి నుండి ప్రపంచ గణిత శాస్త్రవేత్తగా

**మ**నుషుల్లో ప్రతిభ నివురుగప్పిన నిప్పులా దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికి తీసినప్పుడే రాణింపు లభిస్తుంది. గుర్తింపులేని ప్రతిభ నిరర్థకమౌతుంది. మట్టిలో దాగివున్న ఇలాంటి ఒక మాణిక్యాన్ని గూర్చిన వివరాల్లోకెళితే...

తమిళనాడులోని కుంభకోణం ప్రాంతంలో ఒక నిరుపేదకుటుంబంలో 1887, డిసెంబరు 22న శ్రీనివాసరామానుజం జన్మించాడు. తండ్రి శ్రీనివాస అయ్యంగార్. బట్టల దుకాణంలో గుమస్తా. తల్లి కోమలతమ్మాళ్. వంటలక్కగా పనిచేస్తూ, కొద్దిగా సంపాదించేది. చిన్నతనం నుంచీ రామానుజం క్లాసులో లెక్కలు అతిలాఘవంగా చేస్తుండేవాడు. ఏకాంతంగా ఆలోచిస్తూ ఉన్నప్పుడు టీచర్ ప్రశ్నిస్తే, నక్షత్రాల మధ్య దూరాల్ని, వాటి పరిమాణాల్ని లెక్కిస్తున్నానని చెప్పేవాడు. దీంతో ఉపాధ్యాయులు అబ్బురపడేవారు. ఇలా ఉండగా రామానుజం జీవితంలో మొదటి మలుపు 16 ఏళ్ల వయసు(1903)లో తిరిగింది. లండన్ విశ్వవిద్యాలయంలో ట్యూటర్‌గా పనిచేస్తున్న 'కార్' రచించిన "ద సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరీ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ అండ్ అప్లైడ్ మేథమెటిక్స్" అనే గ్రంథాన్ని చదివాడు. ఈ గ్రంథం రామానుజంలోని అసాధారణ ప్రతిభను తట్టి లేపింది. ఈ గ్రంథంలో 6165 సిద్ధాంతాలున్నాయి. గ్రంథకర్త వాటిలో వేటికీ నిరూపణలుగానీ, వివరణలుగానీ ఇవ్వలేదు. కాని, అది చదివిన రామానుజం అందులోని సిద్ధాంతాలకు వివరణలు, ఉపపత్తులు రాయకుండా, చివరి ఫలితాలను మాత్రమే తన నోట్‌బుక్కులో రాసుకున్నాడు. 'కార్' గ్రంథంలోని ప్రతి సూత్రాన్నీ, సిద్ధాంతాన్నీ స్వయంగా శోధించి సమాధానాలు కనుక్కున్నాడు. దీంతో రామానుజం అసమాన ప్రతిభ వెల్లడైంది.

మెట్రిక్ పాసయ్యాక ఎఫ్.ఎ(ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్)లో చేరాడు. కాని ఒక్క గణితంలో మినహా మిగతా పాఠ్యాంశాలన్నింటిలోనూ తప్పాడు. అనంతరం 22 సంవత్సరాల వయసులో రామానుజానికి 9 ఏళ్ల జానకితో వివాహమైంది. ఆమె కాపురానికి రావడానికి కొంతకాలం పట్టింది. ఉద్యోగం లేదు. దారిద్ర్యం అతన్ని వెంటాడసాగింది. దీంతో రామానుజం మద్రాసు చేరాడు. కలవని వ్యక్తి లేడు. తొక్కని గడప లేదు. మద్రాసులోని అనేకమంది గణితోపాధ్యాయులకు తన నోట్సులు చూపించాడు. ఎవరికీ అందులోని లెక్కలు అంతుచిక్కలేదు. ఇంతలో పచ్చయప్ప కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న సింగారవేలుతో రామానుజానికి పరిచయమేర్పడింది. తన నోట్సులను కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి పంపించమని ఆయన సలహా ఇచ్చారు. కాని ఎలా పంపాలో రామానుజానికి అర్థంకాలేదు. ఇంతలో రామానుజానికి మద్రాసు పోర్టు ట్రస్టులో చిన్న గుమస్తా ఉద్యోగం వచ్చింది. అప్పుడు 1913లో కేంబ్రిడ్జిలోని గణిత శాస్త్రాచార్యుడు హార్డ్‌కు ఒక జాబు రాసి, దాంతోబాటు తాను పరిష్కరించిన గణిత సమస్యల నోట్సులను జతపర్చి పంపాడు. వాటిని చూసిన హార్డ్ నిశ్చేష్టుడయ్యాడు. రామానుజంలో నిద్రాణమైయున్న గణితశాస్త్ర పాండిత్యానికి అచ్చెరువొందాడు. వెంటనే ఉపకార వేతనంతోపాటు కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో ఉండేందుకు అన్ని వసతులూ కల్పించాడు. ఇది రామానుజం జీవితంలో అత్యంత ముఖ్యమైన మలుపు.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లాక, రామానుజం కృషికి హార్డ్ మెరుగులు దిద్ది ప్రపంచానికి చాటాడు. రామానుజం పరిశోధనలకు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బి.ఎ పట్టానిచ్చింది. భారతదేశంలో ఎఫ్.ఎ పాస్ కాలేనివ్యక్తి ఏకంగా కేంబ్రిడ్జిలోనే బి.ఎ పట్టా పొందాడు. అంతేకాదు, 1918లో రాయల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లాండ్‌లో రామానుజానికి 'ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ' బిరుదునిచ్చింది. ఇది అత్యంత అరుదైన సత్కారం. ప్రపంచంలో ఏ కొద్దిమంది మహనీయులకో కానీ ఇది లభించదు. అదే సంవత్సరం కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో సంవత్సరానికి 250 పౌన్ల వేతనంతో 'ఫెలో'గా ఎంపికయ్యాడు.

ఇంగ్లండులో ఇన్ని సత్కారాలు, గుర్తింపులు పొందుతున్నా రామానుజం సంతోషంగా లేడు. ఏకాంతవాసం, కుటుంబానికి సుదూరంగా వుండటంవల్ల ఇంటిమీద బెంగ, శాకాహారులకు సరిపడని ఆహారం వంటి సమస్యలతన్ని చుట్టుముట్టాయి. దీంతోబాటు అప్పట్లో భయంకర వ్యాధిగా పరిగణించే క్షయవ్యాధికీ గురయ్యాడు. 1918లో స్వదేశానికి తిరిగొచ్చాడు. 1920, ఏప్రిల్ 26న అంటే 32ఏళ్ల వయసులోనే అకాల మరణానికి గురయ్యాడు.

రామానుజం మరణాన్ని గురించి మాట్లాడుతూ హార్డ్ మహాశయుడు 'నేనొక అమూల్య రత్నాన్ని కోల్పోయాను' అన్నాడు. ప్రఖ్యాత శాస్త్రవేత్త జూలియన్ హక్స్‌తో, రామానుజాన్ని 'ఈ శతాబ్దపు గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు'గా అభివర్ణించాడు. ప్రాచీన భారతీయ గణిత శాస్త్రజ్ఞులు ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, భాస్కరుడు - మొదలైనవారి సరసర చేరదగ్గ సిసలైన జాతిరత్నం శ్రీనివాసరామానుజం. వలస పాలనాకాలంలో దారిద్ర్యానికి, నిరాదరణకు, నిర్లక్ష్యానికి బలైపోయాడు.



మహారాష్ట్రలో తొలి బాలికా పాఠశాలను స్థాపించిన ఘనత ఈయనదే. బాలికల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినుల కొరత గమనించిన జ్యోతిబా, తన భార్య సావిత్రీ పూలేకు చదువు చెప్పి, విద్యావంతురాల్ని చేసి తాను స్థాపించిన పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేర్చుకున్నాడు.

# పరాభవం నుండి పుట్టుకొచ్చిన మహానుభావుడు

**జ్యో**తిబాపూలే మహారాష్ట్రంలోని పూనేలో 1827 ఏప్రిల్ 11న జన్మించాడు. చిమ్నాబాయి, గోవిందరావు ఆయన తల్లిదండ్రులు. పాలుతాగే ప్రాయంలోనే పూలే తల్లిని కోల్పోయాడు. ఆయన పుట్టిన కాలంనాటికి కింది కులాలవారికి పాఠశాలల్లో ప్రవేశం లభించేదికాదు. అప్పుడున్నది అసమాన సామాజిక వ్యవస్థ. అయితే ఆంగ్లపాలకులు. మిషనరీలు అక్కడక్కడ స్థాపించిన పాఠశాలలవల్ల బడుగు వర్గాలవారికి కొంతమేరకు విద్యావకాశాలు లభించేవి. పూలే అలాంటి ఒక పాఠశాలలో చేరి, ఒకవైపు కాయకష్టం చేస్తూ, మరోవైపు విద్యను అభ్యసించాడు. తాను పొందిన ఆంగ్లభాషాజ్ఞానంతో పాశ్చాత్య తత్త్వవేత్తల రచనలు చదివి స్వేచ్ఛ, సమానత్వ భావాలను పెంపొందించుకున్నాడు.

ఇదిలా ఉండగా పూలే జీవితాన్ని సమూలంగా మార్చేసిన సంఘటన ఒకటి జరిగింది. ఒకనాడు తన బ్రాహ్మణమిత్రుని ఆహ్వానంపై అతని పెళ్లి ఊరేగింపులో పాల్గొనేందుకు వెళ్లాడు. ఊరేగింపు సాగుతుండగా అక్కడుండే బ్రాహ్మణులు పూలేను గమనించి పూలే తోటమాలి కుమారుడని, కులరీత్యా శూద్రుడని దూషించారు. బ్రాహ్మణుల దృష్టిలో

శూద్రులు వెలవేయదగ్గవారనీ, వారితో ఎలాంటి సంబంధమూ పెట్టుకోరాదనీ ఫూలేను నానా తిట్లూ తిట్టి ఊరేగింపు నుండి బయటకు గెంటేశారు. పరాభవం, బాధతో ఫూలే ఇల్లుచేరాడు. తండ్రి అక్కున చేర్చుకుని ఓదార్చాడు. అయినా ఫూలే శోకం ఆగలేదు. ఆరాత్రి నిద్ర కూడా పట్టలేదు. కులంపేరుతో అగ్రవర్ణాలవారు పాటిస్తున్న కులవివక్షను ఎలా నిర్మూలించాలా అని ఆలోచించాడు. అనాదిగా అగ్రవర్ణాల దురన్యాయానికి బలైపోతున్న కింది కులాలవారిని ఉద్ధరించాలనుకున్నాడు. కిందికులాలవారు అనుభవిస్తున్న దయనీయ జీవితాలను వారి పూర్వజన్మ కర్మఫలాలుగా భావించి, మౌనంగా రోదిస్తున్నవారిని మేల్కొలిపి చైతన్యాన్ని రగిల్చి, బడుగు జనోద్ధరణకు పురికొల్పింది పైన పేర్కొన్న సంఘటన.

ఫూలే అనుసరించదల్చుకున్న ముఖ్యమైన మార్గం కిందికులాలవారికి విద్యాపకాశాలను కల్పించడం. విద్యద్వారా వ్యక్తుల మనోభావాలను విశాలపర్చవచ్చు. వారిని విజ్ఞానవంతులుగా చేయొచ్చు. విద్య విచక్షణాజ్ఞానాన్నిచ్చి, జీవితంలో గౌరవంగా బతకడానికి మార్గాన్ని చూపుతుంది. విద్యను సకల సామాజిక రుగ్మతలకు విరుగుడుగా భావించాడు ఫూలే.

ఫూలే కార్యరంగంలోకి దిగి ఆడపిల్లలకోసం పాఠశాల ప్రారంభించాడు. మహారాష్ట్రలో తొలి బాలికా పాఠశాలను స్థాపించిన ఘనత ఈయనదే. బాలికల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినుల కొరత గమనించిన జ్యోతిబా, తన భార్య సావిత్రీ ఫూలేకు చదువు చెప్పి, విద్యావంతురాల్ని చేసి తాను స్థాపించిన పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేర్చుకున్నాడు.

19వ శతాబ్దపు సంస్కర్తలు చేపట్టిన వితంతు పునర్వివాహాలు, బాల్యవివాహాల నిషేధం, దిక్కులేని వితంతు స్త్రీలకు శరణాలయాలు స్థాపించడం మొదలైన సంస్కరణలను కొనసాగించాడు. 'సత్యశోధక్ సమాజ్'ను స్థాపించి దాని తరపున సంస్కరణల కొరకు కృషి చేశాడు. వెనకబడ్డ కులాల ప్రజలకోసం శ్రమించినవారిలో జ్యోతిబాఫూలే ప్రథముడు. మహాత్ముడిగా బిరుదు పొందిన ఫూలే అంబేద్కరుకు మార్గదర్శకుడు.




*మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సవివరంగా తెలియచెప్పిన గ్రంథం కమ్యూనిస్టు మానిఫెస్టో, దీన్ని కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి రాశారు. ఈ గ్రంథం 1848లో వెలువడింది. ఈ గ్రంథప్రచురణ మానవాళి చరిత్రలోనే అపూర్వ ఘటనగా ప్రపంచంలోని తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలూ ముక్తకంఠంతో పేర్కొన్నారు. పవిత్ర మత గ్రంథాలైన ఖురాన్, బైబిల్ కంటే కూడ దీని ప్రాచుర్యం యెన్నదగిందిగా విజ్ఞులు భావిస్తున్నారు. ఇంతకీ ఈ గ్రంథంలో వుంది 33 పుటలే!*


# మానవాళి చరిత్రను మార్చిన మానిఫెస్టో

'ఇంతవరకు తత్వవేత్తలు ప్రపంచాన్ని గురించి మానవ సమాజాన్ని గురించి వివరిస్తూ, వ్యాఖ్యానిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు కావాల్సింది ప్రపంచాన్ని మార్చడం' ఈ మాటలు మార్క్సిస్టు సిద్ధాంతకర్త కారల్‌మార్క్స్, దాదాపు ఒకటిన్నర శతాబ్దం క్రితం చెప్పినవి. మానవజాతి చరిత్ర సమస్తం వర్గపోరాటాల చరిత్రేనని చెప్పి, వర్గ రహిత సమాజం, ఆర్థిక, సామాజిక సమానతల పునాదిగా ఏర్పడుతుందని గాఢంగా నమ్మాడు. నమ్మడమే గాకుండా, ఆదర్శ కమ్యూనిస్టు సమాజంకోసం విప్లవాలు అవసరమని ఆ దిశలో కృషి సల్పిన శ్రామికవర్గ పక్షపాతి కారల్‌మార్క్స్. తాను కన్న కలలు పండి, వాస్తవమయ్యేదాకా జీవించకపోయినా, ఆ తర్వాత వచ్చిన లెనిన్ మహాశయుడు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని పెంపొందించి, మరింత ముందుకు తీసుకెళ్ళి, రష్యాలో బోల్షివిక్ విప్లవాన్ని సాధించి, ప్రపంచంలో మొట్టమొదటి కష్టజీవుల రాజ్యాన్నే ఏర్పర్చాడు.

మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సవివరంగా తెలియచెప్పిన గ్రంథం కమ్యూనిస్టు మానిఫెస్టో. దీన్ని కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి రాశారు. ఈ గ్రంథం 1848లో వెలువడింది. ఈ గ్రంథప్రచురణ మానవాళి చరిత్రలోనే అపూర్వ ఘటనగా ప్రపంచంలోని తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలూ ముక్తకంఠంతో పేర్కొన్నారు. పవిత్ర మత గ్రంథాలైన ఖురాన్, బైబిల్ కంటే కూడ దీని ప్రాచుర్యం యెన్నదగిందిగా విజ్ఞులు భావిస్తున్నారు. ఇంతకీ ఈ గ్రంథంలో వుంది 33 పుటలే! అయినా, అచ్చుయంత్రం కనుగొన్నాక ప్రచురించిన గ్రంథాలన్నింటికంటే, కమ్యూనిస్టు మానిఫెస్టో కొన్ని వందల ముద్రణలకు నోచుకుంది. ఎన్నో మిలియన్ల కాపీలు అమ్ముడుపోయాయి.

పారిశ్రామిక విప్లవం ఊపందుకుని, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న దశలో, కార్మికవర్గం తలెత్తింది. ఇది క్రమేపీ బలపడుతూ వచ్చింది. పెట్టుబడిదారీ విధానం ఫలితంగా పుట్టుకొచ్చిన శ్రామికవర్గమే, పెట్టుబడిదారీ విధానానికి చరమగీతం పాడుతుందనీ, ఆ తర్వాత శ్రామిక రాజ్యం ఏర్పడుతుందనీ కమ్యూనిస్టు మానిఫెస్టో నొక్కివక్కాణించింది. మార్క్సిజం పిడివాదం కాదు. అది కేవలం సిద్ధాంతమో, భావజాలమోకాదు. సమాజగతిని మార్చడానికుపకరించే సైద్ధాంతిక పునాదికలది. శాస్త్రీయమైన అధ్యయనం ద్వారా, చరిత్ర గమనానికి నిక్షిప్తంగా దోహదంచేసే చోదక శక్తులను పరిశీలించడం ద్వారా కనుగొన్న సిద్ధాంతం అది. అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తిశక్తులకు, కాలం చెల్లిపోయిన ఉత్పత్తి సంబంధాలకు మధ్య తలెత్తే ఘర్షణ కారణంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కుంటుపడుతుంది. దీంతో ఉత్పత్తి విధానంలో మార్పులు సంభవిస్తాయి. మార్పులు జరిగినప్పుడల్లా సమాజం మారుతూ, ఒక దశ నుండి అంతకంటే ఉన్నతమైన మరో దశకు పరిణామం చెందుతూ వస్తుంది. ఈ అంశాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు మానిఫెస్టోలో క్లుప్తంగానే అయినా సూటిగా పదునైన పదజాలంతో వివరించారు. గతి తర్కాన్ని, చారిత్రక భౌతికవాదంతో మేళవించి, రెండు భిన్నమైన వైరుధ్యాల ఘర్షణలో చరిత్ర పురోగమిస్తుందంటారు. దీన్నే శ్రీశ్రీ 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అని దేశ చరిత్రలు అనే గేయంలో రాశాడు.

జర్మనీలో పుట్టి పెరిగిన కారల్‌మార్క్స్, 1848-49లో జర్మనీలో జరిగిన మహావిప్లవంలో ముందు నిలబడి పోరాడాడు. 1849లో జర్మనీ నుండి బహిష్కృతుడై, తుదకు ఇంగ్లండ్‌లో శాశ్వతంగా స్థిరపడ్డాడు. ప్రథమ ఇంటర్నేషనల్‌లో (1864) స్థాపించడంలో తీవ్ర కృషి సల్పాడు. ప్రపంచం నలుమూలల్లో జరుగుతున్న శ్రామికవర్గ పోరాటాలను శ్రద్ధగా గమనించేవాడు. భారతదేశంలోని ఆంగ్లేయపాలనపై సునిశితవాఖ్యానాలు చేశాడు. 1857 తిరుగుబాటును గూర్చి లోతుగా విశ్లేషించాడు. రాజకీయార్థికశాస్త్ర సంబంధమైన ఉద్గ్రంథం 'కాపిటల్' మూడు సంపుటాలు రచించాడు. 19-20 శతాబ్దాల్లో జరిగిన శాస్త్రీయాభివృద్ధి, దాన్ని ఆచరణలో పెట్టిన తీరు, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని బలపర్చింది. రుజువు చేసింది. ఆచరణ వుస్నప్పుడే సిద్ధాంతానికి యోగ్యత, ఫలశ్రుతి అని నమ్మాడు. కమ్యూనిస్టు మానిఫెస్టో మానవుల ఆలోచనా విధానంలో మార్పుకు దోహదంచేసి, ఈనాటికీ అది సజీవంగా నిలిచివుంది.



(ఈ నేపథ్యంలో) 1859లో ఒక గ్రంథం వెలువడింది. దాని పేరు 'ఆరిజన్ ఆఫ్ స్పీషీస్'. గ్రంథకర్త చార్లెస్ డార్విన్. ఈ 'జీవరాశుల పుట్టుక' శాస్త్రవిజ్ఞానంలోనే కాక, మత సామాజికపరంగా కూడా విప్లవాత్మక మార్పులకు దోహదం చేసింది. ఈ గ్రంథ ప్రచురణతో మతవ్యవస్థపై పిడుగుపడ్డట్టయింది.

# డార్విన్ పరిణామ సిద్ధాంతం

**ప**ందొమ్మిది, ఇరవై శతాబ్దాల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొంది ప్రపంచచరిత్ర గమనాన్నే మార్చివేసింది. పారిశ్రామిక విప్లవం తెచ్చిన పెనుమార్పుల గూర్చి ఇంతకుముందు తెలుసుకున్నాం. ముఖ్యంగా ఈ నూతన శాస్త్ర ఆవిష్కరణలతో ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల్లో కర్మాగారాలు విపరీతంగా పెరిగి, రవాణా సౌకర్యాలు వృద్ధిచెంది, వస్త్రోత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి, ఆవిరి ఓడలు - ఇంకా ఎన్నో కొత్త పరిశోధనలు ప్రపంచాన్ని కుదిపేశాయి. దేశాలమధ్య సరిహద్దులు చెరిగిపోకున్నా, దేశాలమధ్య దూరం తగ్గి రాకపోకలు పెరిగాయి. ఈ మార్పులవల్ల ఇంగ్లండ్ మరింతగా లాభపడింది. వలస విధానం పాటించి ఆయా దేశాలనుండి సహజవనరులు, సంపద వచ్చిపడి ఇంగ్లండ్ సంపన్నమైంది. వ్యవసాయ సమాజంగా ఉన్న ఇంగ్లండ్ పారిశ్రామిక సమాజంగా రూపుదిద్దుకుంది. కొత్తగా ఏర్పడ్డ పారిశ్రామిక సమాజంలో ఆర్థిక అంశాల ప్రాధాన్యత పెరుగుతూవచ్చి, మతపరమైన ఆలోచనలు తగ్గుముఖం పట్టి, ప్రజలజీవితాల్లో మతం పట్టు క్రమేపీ సడలడం ఆరంభమైంది.

ఈ నేపథ్యంలో 1859లో ఒక గ్రంథం వెలువడింది. దాని పేరు 'ఆరిజన్ ఆఫ్ స్పీషీస్ స్పెసెస్'. గ్రంథకర్త చార్లెస్ డార్విన్. ఈ 'జీవరాశుల పుట్టుక' శాస్త్రవిజ్ఞానంలోనే కాక, మత సామాజికపరంగా కూడా విప్లవాత్మక మార్పులకు దోహదం చేసింది. ఈ గ్రంథ ప్రచురణతో మతవ్యవస్థపై పిడుగు పడ్డట్టయింది. మతానికీ, శాస్త్రానికీ మధ్య జరుగుతున్న పోరాటం తారాస్థాయికి చేరింది.

ఇంతకీ డార్విన్ ప్రవచించిన జీవపరిణామ సిద్ధాంతం ఏం చెప్పింది? చార్లెస్ డార్విన్ వస్తుతా ప్రకృతి శాస్త్రవేత్త. వైద్యశాస్త్రంలో ఆరితేరినా, ప్రకృతి శాస్త్రవేత్తగానే వృత్తిచేపట్టాడు. ప్రకృతికి సంబంధించి, అందులోని అసంఖ్యాక జీవరాశుల గూర్చి కూపీలు తీశాడు. కొత్త ఆలోచనల క్రమం జీవపరిణామసిద్ధాంతానికి దారితీసింది. జీవులు గుణోత్తరం(జామెట్రిక్)గా వృద్ధిచెందుతాయి. అందులో కొన్ని యథాతథంగా ఉండిపోయినా, మరికొన్ని వేగంగా రూపాంతరం చెంది మారుతూ ముందుకుపోతాయి. దీన్ని డార్విన్ 'సర్వైవల్ ఆఫ్ లైఫ్' సిద్ధాంతంగా మలిచాడు. దీన్నే మరోరకంగా చెప్పాలంటే, మనం నివసించే ఈ భూమిపుట్టి దాదాపు 450 కోట్ల సంవత్సరాలని శాస్త్రజ్ఞుల అంచనా. ఈ భూమిపై జీవం పుట్టడానికి కొన్ని కోట్ల సంవత్సరాలు పట్టింది. ఏకకణజీవి(అమీబా) నుండి బహుకణజీవి, జలచరాలు, భూమ్మీద, నీటిమీద కూడా తిరిగే ఉభయచరాలు, భూచరాలు, జంతుజాలం, వానరం ఇలా అనేక దశలు దాటాక, మనిషి అవతరించాడు. దీన్ని డార్విన్ 'మానవ సంతతి'(ద డిస్సెంట్ ఆఫ్ మ్యాన్)గా వర్ణించాడు.

డార్విన్ పరిణామసిద్ధాంతం ద్వారా దైవసృష్టి సిద్ధాంతాన్ని తిరస్కరించాడు. తద్వారా దేవుని ఉనికినే ప్రశ్నించినట్లయింది. పరిణామక్రమంలో పుట్టుకొచ్చిన మనిషి జీవులను సృష్టించడంవల్ల దేవుని పాత్ర ఏముందనే ప్రశ్న తలెత్తింది. దీంతో మతగురువులు డార్విన్‌పై విరుచుకుపడ్డారు. మతం హేతుబద్ధమైన, స్వతంత్రమైన ఆలోచనలను ప్రోత్సహించదు. గుడ్డివిశ్వాసాలను ప్రజలపై రుద్ది, మూఢాచారాలను, సాంఘిక దురాచారాలను ప్రోత్సహిస్తుంది. కానీ సైన్స్ మతానికి భిన్నం. ఇది యథార్థాలపైనా, వాస్తవాలపైనా ఆధారపడుతుంది. ప్రయోగం దాని పద్ధతి. ప్రయోగం ద్వారా నిగ్గుతేల్చి నిజాన్ని చెబుతుంది సైన్స్. మనిషిలో ఆలోచనలను రేకెత్తించి, ప్రశ్నించేతత్వాన్ని పెంపొందిస్తుంది. సృష్టి ఆవిర్భవించింది మొదలు నేటివరకూ మానవుడు సాధించిన ప్రగతి మొత్తం శాస్త్రవిజ్ఞానం ద్వారానే సాధ్యమైందన్న వాస్తవాన్ని అంగీకరించకపోవడమే మతంలోని మౌఢ్యం.

డార్విన్ సిద్ధాంతాన్ని ఆ తర్వాతికాలంలో సామ్రాజ్యవాదులు సోషల్‌డార్వినిజంగా మార్పుచేసి వలసలపై తమ ఆధిపత్యాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు కుట్రపన్నారు. సామ్రాజ్యవాద దేశాల్లోని సామాజిక శాస్త్రవేత్తలు డార్వినిజాన్ని 'సర్వైవల్ ఆఫ్ ఫిట్టెస్ట్' అనే బలమున్నవాడే బతికి బట్టకట్టడతాడనీ, జాతిపరంగా తెల్లజాతివారు ప్రపంచంలోని ఇతర జాతులకంటే తెలివితేటలు, శక్తిసామర్థ్యాల్లో ఉన్నతులన్న జాతివివక్ష సిద్ధాంతాన్ని లేవదీశారు. దీని ప్రకారం సమర్థులైన తెల్లజాతివారికే ఇతర జాతులను పరిపాలించే అధికారం ఉందన్న వితండవాదనను ముందుకుతెచ్చారు. ఈ అమానవీయ రాజ్యాధికార సిద్ధాంతాన్ని ఆంగ్లపాలకులు భారతదేశంలో తమపెత్తనాన్ని సమర్థించుకోవటానికి ఉపయోగించుకున్నారు.

మనిషి పుట్టుకను శాస్త్రీయంగా పరిశోధించి దైవదృష్టిని తిరస్కరించిన డార్విన్‌సిద్ధాంతం మానవుల సామాజిక దృక్పథాన్ని మార్చినంతగా మరే ఇతర శాస్త్రగ్రంథమూ చేయలేదు.



*టిప్పుసుల్తాన్ కేవలం తన రాజ్యాన్ని
కాపాడుకోవడంకోసమే ఆంగ్లేయులపట్ల వైరం
పెంచుకోలేదు. అక్రమంగా భారతదేశాన్ని
ఆక్రమించి, సంపదను తమ దేశానికి
తరలించుకుపోతూ, ప్రజల్ని పీడిస్తున్నవారి
విధానాల్ని ఆమోదించలేకపోయాడు. ఆంగ్లేయులను
దేశం నుంచి తరమాలని దీక్షపూనాడు.*

# మైసూర్ టైగర్ టిప్పు సుల్తాన్

**మొ**ఘల్ సామ్రాజ్య పతనం, 1707లో ఔరంగజేబు మరణంతో ఆరంభమైంది శక్తిమంతుడైన మొఘల్ చక్రవర్తి లేకపోవడంతో, దేశంలోని వివిధప్రాంతాలు తమ స్వతంత్రాన్ని ప్రకటించుకున్నాయి. ఇవి ప్రాంతీయ స్వతంత్ర రాజ్యాలుగా ఖ్యాతిగాంచాయి వాటిలో ముఖ్యమైనవి బెంగాల్, అయోధ్య, హైదరాబాద్, మైసూర్ మొదలైనవి. దక్షి భారతంలో ముఖ్యమైన రాజ్యంగా ప్రసిద్ధి కెక్కిన మైసూర్‌కు 1761లో హైదరలీ రాజయ్యాడ విద్యాబుద్ధులు లేని హైదరలీ, మైసూరు రాజుల కొలువులో, వారి సైన్యంలో చిన్నపా అధికారిగా చేరి, తెలివితేటలతో, సైనికపాటవంతో, పట్టుదలతో పైకొచ్చాడు. దిండిగ ప్రాంతానికి ఫోజుదారుగా ఉంటూ, మైసూర్ రాజ్యాధిపతులు నంజరాజు, దేవరాజులన తొలగించి, అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. శ్రీరంగ పట్నాన్ని రాజధానిగా చేసుకుని ఆంగ్లేయుల అధికారాన్ని అంగీకరించక. వారిని ఎదిరించడానికి ఫ్రెంచివారితో స్నేహ

సంబంధాలను ఏర్పర్చుకున్నాడు. ఇది ఆంగ్లేయులకు కంటక ప్రాయమైంది. మైసూర్ అధీనంలో ఉన్న కర్నాటక ప్రాంతాన్ని, మద్రాసు పట్టణంతో సహా ఆక్రమించుకుని, తద్వారా హైదరలీని బలహీనపరచి లొంగదీసుకోవాలని ఆంగ్లేయులు చేసిన ప్రయత్నం ఫలించలేదు.

ఇక, ఆంగ్లేయుల కుతంత్రాలు, జిత్తులమారి ఎత్తులు, విభజించి పాలించు విధానాలు మొదలయ్యాయి. మైసూర్ రాజ్యానికి సరిహద్దుల్లో బలంగా ఉన్న రాజ్యం హైద్రాబాద్. అది నిజాంల ఏలుబడిలో ఉంది. ఆంగ్లేయులు వల పన్నారు. హైదరాబాద్ నవాబుతో మంతనాలు జరిపారు. నెమ్మదిగా తాము ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతి అనే ఒడంబడికలోకి అతడిని తెచ్చుకున్నారు. దాని ప్రకారం తమ అనుమతి లేకుండా నైజాం నవాబు ఎవరితోనూ సంధి చేసుకోడానికి, లేదా యుద్ధంలో పాల్గొనడానికి వీల్లేదు. ఆ అవకాశంతో ఆంగ్లేయులు మైసూరుపై యుద్ధాలకు సమాయత్తమయ్యారు.

ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. దక్షిణ భారతదేశంలో తమ ఆధిపత్యాన్ని ఎదుర్కొని నిలవగలిగిన సత్తా ఒక మైసూరు రాజ్యానికే ఉంది. దాన్ని ఓడించడం అంత సులభం కాదని ఆంగ్లేయులకు తెలుసు. హైదరలీ పటిష్టమైన, సుశిక్షితమైన సైన్యాన్ని తయారుచేశాడు. అంతేకాక మైసూరుని ఆక్రమించందే ఆంగ్లేయుల సార్వభౌమత్వానికి నిండుతనం చేకూరదు. భారతదేశంలో రాజపుత్ర రాజ్యాలు అనైక్యతతో బలహీనపడి ఉండగా ఒక మహారాష్ట్రులు మాత్రమే పీష్వాల నాయకత్వంలో ఆంగ్లేయులను దీటుగా ఎదుర్కొనే స్థితిలోఉన్నారు మైసూరు రాజ్యానికి మహారాష్ట్రులు సహాయం చేయనీయకుండా దూరంగా ఉంచి, హైదరలీ పై యుద్ధాన్ని ప్రకటించారు ఆంగ్లేయులు. నిజానికి మైసూరుపై ఆంగ్లేయులు మొత్తం నాలుగు యుద్ధాలు చేయాల్సివచ్చింది. మొదటి రెండు యుద్ధాలు హైదరలీతో జరగ్గా, రెండోయుద్ధంలో హైదరలీ మరణించాడు.

హైదరలీ కుమారుడు టిప్పుసుల్తాన్ మైసూర్ రాజ్యాభిషిక్తుడయ్యాడు. ఇతడు తండ్రిని మించిన తనయుడు. గొప్ప సైనికుడిగా యుద్ధాల్లో ఆరితేరినవాడు. వ్యక్తిగతంగా బలసంపన్నుడు. క్రూరజంతువులను వేటాడ్డంలో దిట్ట. అమాంతంగా పులిపై దూకి, పోరాడి చంపడంలో పేర్గాంచిన టిప్పుసుల్తాన్ మైసూర్ టైగర్‌గా ఖ్యాతినొందాడు. సైన్యాన్ని పునరుద్ధరించడంలో ఫ్రెంచివారి సహాయం తీసుకుని, మైసూరు రాజ్య సైన్యం పేరు చెపితే శత్రువుల గుండెలవిసిపోయేలా తీర్చిదిద్దాడు. ఆర్థికంగా మైసూరును అభివృద్ధిచేశాడు. వ్యవసాయంలో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టడం, పారిశ్రామికంగా ఐరోపాదేశాల వత్తాసుతో మైసూరు రాజ్యాన్ని అభివృద్ధి పర్చాడు. మతసామరస్యాన్ని తు.చ తప్పకుండా పాటించి హిందూ దేవాలయాలకు ఉదారంగా ధన సహాయం చేశాడు. హిందువులకు కొలువులో పెద్ద ఉద్యోగాలిచ్చి ప్రతిభకు పెద్దపీట వేశాడు. దీంతో టిప్పు సుల్తాన్ ప్రజారంజకపాలకుడిగా ప్రసిద్ధికెక్కాడు.

టిప్పుసుల్తాన్ కేవలం తన రాజ్యాన్ని కాపాడుకోవడంకోసమే ఆంగ్లేయులపట్ల వైరం పెంచుకోలేదు. అక్రమంగా భారతదేశాన్ని ఆక్రమించి, సంపదను తమ దేశానికి

తరలించుకుపోతూ, ప్రజల్ని పీడిస్తున్నవారి విధానాల్ని ఆమోదించలేక... ఆంగ్లేయులను దేశం నుండి తరమాలని దీక్షపూనాడు. ఈ కర్తవ్య నిర్వహణలో అవస (అప్పుడు ఫ్రాన్స్‌లో విజయవంతంగా ముందుకు దూసుకుపోతున్న) నెపోలియన్ సహ తీసుకోడానిక్కూడా వెనుకాడలేదు. ఇంతలో మూడో మైసూర్ యుద్ధం జరగడం, అం టిప్పుసుల్తాన్ ఓడిపోయి, నగం రాజ్యం కోల్పోవడం జరిగిపోయింది. కానీ లొంగిపోలేదు. తిరిగి తన సైన్యాన్ని కూడగట్టుకొని, తుదిపోరాటానికి సిద్ధమయ్యాడు. 17 నాల్గవ మైసూరు యుద్ధం భీకరంగా జరిగింది. బ్రిటీష్ సైన్యాధిపతి వెలస్లీ లొంగిపో హెచ్చరించాడు. లొంగిపోయి దాసోహమంటే, మైసూరు రాజ్యానికి అధిపతిగా కొనసాగే అనుమతిస్తానని చెప్పినా టిప్పు అంగీకరించలేదు. నైజాం నవాబు, మహారాష్ట్రులు సహ చేయనిరాకరించి ఆంగ్లేయులను సమర్థించగా ఒంటరిగా పోరాడి ధీరుడిగా మరణిం దీంతో ఆంగ్లేయుల అధికారానికి అడ్డు లేకుండాపోయింది. మొత్తం దేశం దాసో స్థితికొచ్చింది. ఒకవేళ నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు గెలిచి ఉంటే..? దేశ పూర్తిగా వేరే మార్గంలో నడిచేదా? 1800 కల్లా ఆంగ్లేయుల దాస్యంనుండి దేశం పొందేదా? చరిత్రలో సమాధానం దొరకని ప్రశ్నలివి. అందుకే, చరిత్ర అనూహ్యంగా మ తిరుగుతూ ముందుకు సాగిపోతుంది.



*ఈ తిరుగుబాటు సందర్భంగా రైతాంగ పరిస్థితులను వర్ణిస్తూ 1860లో దీనబంధు మిత్ర అనే బెంగాలీ నాటకకర్త 'నీల్ దర్పణ్' అనే నాటకాన్ని రచించాడు. తిరుగుబాటు ప్రాంతాల్లో కాకుండా బెంగాల్లో అనేక ప్రాంతాల్లో ఈ నాటక ప్రదర్శన జరిగి, విదేశీ తోటల యజమానుల దురంతాలను బట్టబయలుచేసింది.*

# నీలిమందు తిరుగుబాటు

**1857** సిపాయిల తిరుగుబాటు భారతదేశ చరిత్రను ఎలా మలుపు తిప్పిందని మనకు తెలుసు. ఆ తిరుగుబాటు ప్రధానంగా సార్వభౌమాధికారాన్ని కోల్పోయిన స్వదేశీ రాజ్యాలు జరిపినది. సంప్రదాయరీతిలో జరిగిన ఆ తిరుగుబాటులో ఆంగ్లేయులచే బర్తరఫ్ కాబడ్డ సిపాయిలు, అక్కడక్కడా సామాన్యప్రజలు పాల్గొన్నారు. ఆ కోవలో జరిగినవే సన్యాసుల తిరుగుబాటు (బెంగాల్), దక్షిణ భారతదేశంలోని పాలెగాళ్ళ తిరుగుబాట్లు. అప్పటికి జాతీయతాభావం దేశంలో మొదలవలేదు. ఆంగ్లేయుల వ్యతిరేక తిరుగుబాట్లుగా మాత్రమే వాటిని పరిగణించాలి.

కానీ, 1857 తర్వాత ఆధునిక భారతదేశ చరిత్ర గమనంలో పెనుమార్పు పొడచూపింది. ఈ మార్పును రెండు అంశాల్లో గమనించవచ్చు. ఒకటి, 1857 తర్వాత జరిగిన తిరుగుబాట్లు కేవలం ఆంగ్లేయులకు వ్యతిరేకమైనవేకావు. వారి ఆర్థిక విధానాలకు వ్యతిరేకమైనవి. వారి దోపిడీని నిరసించినవి. వాటిలో ఆర్థికాంశం ముఖ్యం. జాతీయ భావజాలం ఆర్థికదోపిడీని వ్యతిరేకించడంతోనే ఆరంభమైంది. భారతీయుల ఆర్థిక ప్రయోజనాలు, ఆంగ్లేయుల దోపిడీతో ఘర్షణ చెందినపుడే భారతీయుల్లో జాతీయతాభావం అంకురించింది. ఇక రెండో మార్పు- దేశంలో తలెత్తిన విద్యావంతుల మధ్యతరగతి వర్గం, 1857 తిరుగుబాటుకు పూర్వం ఆంగ్లేయ పాలనను సమర్థించింది. ఆంగ్ల పాలకులు



91738

సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ఆధునికీకరణద్వారా అభివృద్ధి చేస్తారని నమ్మింది తర్వాత, వలస పాలకులు, దేశంలోని భూస్వామ్య, స్వార్థపర, స్వదేశీ సంస్థానా చేతులు కలిపి అపవిత్రకూటమిగా ఏర్పడ్డంతో, మేధావివర్గం దాన్ని గమనిం పాలకులపై వారు పెట్టుకున్న ఆశలను వదులుకున్నది.

ఈ నేపథ్యంలో, 1860లో నీలిపితూరిగా (బ్లూ మ్యూటినీ) ఆం చిత్రించిన నీలిమందు తిరుగుబాటు బెంగాల్‌లో జరిగింది. ఇది నిఖార్సయిన తిరుగుబాటు. రైతాంగం సంఘటితమై ఏకైక శక్తిగా ఆంగ్లేయులకు, వారి తాబే జమీందార్లకు, కాఫీ, టీ, నీలిమందు తోటల యజమానులకు, వడ్డీ వ్యాప వ్యతిరేకంగా సమీకృతమైంది. నీలిమందు తాలూకు నిరసన బెంగాల్లో 18 ఆరంభమైంది. నీలిమందు ఉత్పత్తిపై ఐరోపావాసులకు గుత్తాధిపత్యం ఉండేది. నీ తోటల యజమానులు విదేశీయులు. కానీ, నీలిమందు సాగుచేసే భారతీయ కట్టుబానిసలకంటే హీనంగా చూసేవారు. ఇష్టమున్నా, లేకున్నా.. సాగులో ఫ చేతికి అందక పోయినా, నానా బాధలూ పడుతూ చిత్రహింసలు భరించి నీ సాగుచేయాలి. దీన్ని ప్రతిఘటించేందుకు రైతాంగం ఆయత్తమైంది. వేలాదిమంది తమ భూములను బీడు బెట్టి సాగు నిలిపేశారు. తోట యజమానులు వినియె కిరాయి సైన్యాల దురాగతాలను రైతులు ధైర్యంగా ఎదుర్కొన్నారు.

తిరుగుబాటు ఊపందుకుంది. బెంగాల్ రాష్ట్రమంతటా తిరుగుబాటు దావానలంలా వ్యాపించాయి. ఆంగ్ల పాలనలో విసిగిపోయి బాధలననుభవిస్తున్న సంచలనం పుట్టుకొచ్చింది. అప్పటికే బెంగాల్లో బ్రహ్మసమాజం, యువ బెంగాల్ ఉ ప్రజల్ని ఉత్తేజపరుస్తున్నాయి. కలకత్తాలోని మేధావులు నీలిమందు తిరుగుబాటు సంఘీభావాన్ని బహిరంగంగా ప్రకటించారు. కలకత్తా నగరంనుండి వెలువ పత్రికలకు, తాము తిరుగుబాటు జరుపుతున్న ప్రాంతాలకు వెళ్ళి చూసిన వా రైతుల కడగండ్లను, తిరుగుబాటు వివరాలగూర్చిన వార్తలను పంపారు. అవి ప్రచ బెంగాల్లో ప్రజాభిప్రాయం తిరుగుబాటుకు అనుకూలంగా మలచ తిరుగుబాటుకనుకూలంగా ఒక సమాంతర ప్రజాఉద్యమం బెంగాల్లో పెల్లుబికింది

ఈ ఘటనతో ఆంగ్లేయ వ్యతిరేకత గణనీయమైన మార్పుకు లోనయింది. ప్రజా నాందిగా నిలిచింది. ఈ తిరుగుబాటు సందర్భంగా రైతాంగ పరిస్థితులను వర్ణిస్తూ 1 దీనబంధు మిత్ర అనే బెంగాలీ నాటకకర్త 'నీల్ దర్పణ్' అనే నాటకాన్ని రచి తిరుగుబాటు ప్రాంతాల్లో కాకుండా బెంగాల్లో అనేక ప్రాంతాల్లో ఈ నాటక ప్రదర్శన విదేశీ తోటల యజమానుల దురంతాలను బట్టబయలుచేసింది. ఆంగ్లంలోకి ఈ న జేమ్స్ లాంగ్ అనువదించగా దాన్ని నిషేధించి అనువాదకుణ్ణి ప్రభుత్వం శిక్షి ప్రజాసమస్యలకు సాహిత్యం బలంగా స్పందిస్తుందనడానికి ఇది ప్రబలనిదర్శనం. నీ తిరుగుబాటు రైతాంగానికి, విద్యాధిక వర్గానికి మధ్య వారధి నిర్మించి, సమాజం రెండు ప్రధాన పాయల ఐక్యత, ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గమని సూచిం



*1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఈ యుద్ధాన్ని రెండు సామ్రాజ్యవాద శిబిరాలమధ్య ఆధిపత్యం కోసం జరిగే ఘటనగా పేర్కొని సంచలనం సృష్టించాడు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధాన అంతిమదశగా పేర్కొని ప్రపంచాన్ని కబళింపచూస్తున్న సామ్రాజ్యవాదుల పన్నాగాల్ని ఎత్తిచూపాడు.*

# సోవియట్ రష్యా విప్లవ సారథి లెనిన్

ఆదిమ మానవ సమాజంలో మానవులమధ్య నెలకొన్న సమానత్వ భావం క్రమేపీ అదృశ్యమైంది. సొంత ఆస్తి, స్వార్థం, ధనార్జనధ్యేయంగా సాగిన క్రమంలో పేదలు, ధనికులు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. సంపదను ఉత్పత్తి చేసే వనరులను, సాధనాలను సొంతం చేసుకున్న ధనికవర్గం పేదలను నిరుపేదలుగా మార్చింది. సమాజంలో అధికులుగా ఉన్న పేదల శ్రమను దోచుకోవడం ద్వారా తమ ఆస్తులను, అధికారాన్ని ధనిక వర్గాలు గణనీయంగా పెంచుకున్నాయి. ధనిక వర్గ ప్రయోజనాలకు మతం, కులం, రాజ్యం ఇతోధికంగా సాయపడ్డాయి. రెండు ప్రధాన వర్గాలుగా ఏర్పడ్డ సమాజంలో, అణచివేయబడ్డ ప్రజలు నిస్సహాయులుగా, నిరాశాపరులుగా, నిష్క్రియాపరులుగా ఉండిపోలేదు. బానిస సమాజంలో

యజమానులకు వ్యతిరేకంగా ఎన్నో తిరుగుబాట్లు జరిగాయి. దీనికి ప్రబల ఉదాహ స్పార్టకస్ చారిత్రాత్మక తిరుగుబాటు. బానిస సమాజం దాటి భూస్వామ్యదశలో అనేకా రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. అదే క్రమంలో పెట్టుబడిదారీ సమాజంలో, పాశ్చా దేశాల్లో, ఇటు వలస పాలిత ప్రాంతాల్లో కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గాన్ని ఎదిరి పోరాటాలు సాగించింది.

పై నేపథ్యంలో, జారు చక్రవర్తులు పరిపాలిస్తున్న రష్యాదేశంలో 1870 పాఠశాలలపై అజమాయిషీ చేసే ఒక అధికారి కుటుంబంలో, వ్లాడిమిర్ ఇల్యీచ్ లె పుట్టాడు. పుట్టినప్పుడు తెలీదు, లెనిన్ ప్రపంచంలో మొదటి కష్ట జీవులరాజ్యాన్ని స్థాపిస్తా ఒక మనిషిని మరొక మనిషి కొన్ని యుగాలుగా దోచుకుంటున్న సమాజాన్ని నిర్మూలి సమసమాజాన్ని స్థాపిస్తాడని. జారు చక్రవర్తులు పరమనిరంకుశలు. వారి పాలనలో ప్ర కడగండ్లకు మితం లేదు. ఒకవైపు దారిద్ర్యం, మరోవైపు పీడనతో ప్రజలు మగ్గిపోత సమయం. ఐరోపా ఖండనాగరికతకు పుట్టిన చివరి శిశువుగా రష్యాను చరిత్రకార అభివర్ణించారు. లెనిన్ పుట్టే నాటికే రష్యాలో చైతన్యం మొదలైంది. లెనిన్ అన్న అలెగ్జాం విప్లవ రహస్య కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. లెనిన్‌కు సోదరుడు అలెగ్జాం మార్గదర్శకుడు, గురుతుల్యుడు. అలెగ్జాండర్ కార్యదీక్ష, నైతిక నిబద్ధత తిరుగులేనిది. అం లెనిన్ అన్నను అనుసరించాడు. లెనిన్‌కు మార్క్సిజ్మాన్ని గూర్చి మొదటిసారిగా తెలియజెప్పి అన్నే! అన్న ఆశయం జారుచక్రవర్తుల నిరంకుశ అధికారాన్ని కూలదోసి, విప్లవ ప్రభుత ఏర్పర్చడం. ఇదిలా ఉండగా 1886లో తండ్రి మరణంతో కుంగిపోయిన లెనిన్‌కు, జ ప్రభుత్వం అన్న అలెగ్జాండర్‌ను నిర్బంధించి, 1887లో ఉరి తీయడంతో, జీవితంలో తట్టుకోలేని దిగ్భ్రాంతికి, తీరని దు:ఖానికి గురయ్యాడు. ఇదే లెనిన్ జీవితంలో గ మలుపు. ఇక తన అన్న ఆశయసిద్ధికి అంకితం కావాలని నిర్ణయించుకున్నాడు.

లెనిన్ న్యాయశాస్త్ర వృత్తి చాలించాడు. పూర్తి కాలాన్ని మార్క్సిస్టు సిద్ధా అధ్యయనానికి, అవగాహనకు వినియోగించాడు. ఆయనలో అప్పటికే రగులుత విప్లవజ్వాల మరింతగా ప్రజ్వరిల్లసాగింది. అయితే అన్న అనుసరించిన టెర్ర మార్గంద్వారా విప్లవం సాధ్యం కాదని ఆ మార్గాన్ని విడనాడి ప్రజల్ని సమీకరించి పోరాట నిర్వహించడంద్వారానే జారు ప్రభుత్వాన్ని మట్టికరిపించాలనుకుని, ఆ మార్గంలో నడిచా ఆ క్రమంలో జారు ప్రభుత్వం లెనిన్‌ను రెండుసార్లు దేశ బహిష్కృతుణ్ణి చేసి సైబీరియ పంపింది. అయినా ఆయన దీక్ష సడలలేదు. 1903లో రష్యా సోషలిస్టు డెమోక్రా పార్టీలో చీలిక తెచ్చాడు. బోల్షివిక్కులకు బలం చేకూర్చి, నాయకత్వం వహించడందా భవిష్యత్తులో బోల్షివిక్కుల నాయకత్వంలో సోషలిస్టు విప్లవం సాధించడానిగ్గానూ పునాద వేశాడు.

1914లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలైంది. ఈ యుద్ధాన్ని రెం సామ్రాజ్యవాద శిబిరాలమధ్య ఆధిపత్యం కోసం జరిగే ఘటనగా పేర్కొని సంచల సృష్టించాడు. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధాన అంతిమదశగా పేర్కొని ప్రపంచ

కబళింపచూస్తున్న సామ్రాజ్యవాదుల పన్నాగాల్ని ఎత్తిచూపాడు. ప్రపంచవ్యాప్తంగా బడుగుదేశాలను, ఆ దేశాల్లోని పీడిత, తాడితుల్ని అమానవీయంగా దోచుకుంటున్న పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించాలంటే, సామ్రాజ్యవాదాన్ని మట్టుపెట్టాలని ప్రపంచ కార్మిక వర్గానికి ప్రత్యేకించి రష్యన్లకు పిలుపునిచ్చాడు.

మొదటి ప్రపంచ యుద్ధం ఇంకా ముగియక ముందే *(1918లో ముగిసింది)* రష్యాలో యుద్ధం ఆరంభమైంది. ఆ సమయంలో అదనుచూసి విప్లవం తీసుకొచ్చారు. మెన్షివిక్కుల నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వాన్ని కూలదోసి, *1917* నవంబర్ 7న లెనిన్ బోల్షివిక్కుల నాయకుడుగా, సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌ను స్థాపించి, కారల్‌మార్క్స్, ఎంగెల్స్‌ల కలల్ని సాకారం చేశాడు. సామ్రాజ్యవాదుల యుద్ధంనుండి రష్యాను తప్పించాడు. 'దున్నేవాడికే భూమి' నినాదంతో భూపంపకం చేపట్టాడు. రాజకీయ అధికారాన్ని ప్రజలకు అప్పచెప్పాడు. మార్క్సిజాన్ని అభివృద్ధిచేసి, విప్లవాన్ని సాధించడంద్వారా లెనినిజానికి కారకుడయ్యాడు. విప్లవసిద్ధికి బలమైన, క్రమశిక్షణాయుతమైన కమ్యునిస్టుపార్టీ నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. ప్రపంచదేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తికి తోడ్పడ్డాడు.



*'శాంతి' రంగానికి బహుమతిని కేటాయించడం వెనుక సాహితీ వికాస ప్రభావముంది. ఆస్ట్రియా రచయిత్రి బెర్తా-వాన్-సట్నర్ ప్రభావమూ అతనిపై ఉంది. 1876లో తనకు వ్యక్తిగత కార్యదర్శి కావాలని పేపర్లో ప్రకటనివ్వగా దానికావిడ దరఖాస్తు చేసింది. తిరిగి పారిస్‌లో 1887లో ఆవిడను కలిశాడు. అప్పుడావిడ అంతర్జాతీయ శాంతి ప్రచార కార్యకర్తగా ఉండేవారు. రచనలు చేస్తుండేవారు. దాంతో నోబుల్ బహుమతి, శాంతిపట్ల నిబద్ధతా ఆల్ఫ్రెడ్‌కు ఏర్పడ్డాయి.*

# విస్ఫోటం నుండే శాంతి సత్కారాలు

ప్రపంచంలో వైద్య, సాహిత్య రంగాలలోబాటు ప్రపంచ శాంతికి బాటలు వేసేవారికి నోబుల్ బహుమతిని ప్రదానం చేస్తారు. ఇది పరిశోధకులకు ఉత్సాహం ప్రేరణ కలిగించే అంశం. ప్రపంచంలోకెల్లా ప్రసిద్ధమైన ఈ అవార్డు కారకుడైన నోబుల్ పూర్తిపేరు ఆల్ఫ్రెడ్ బెర్నార్డ్ నోబుల్. ఈయన 1833 అక్టోబరు 21వ తేదీన ఇటలీలో జన్మించాడు. ఆల్ఫ్రెడ్‌కు ముగ్గురు సోదరులు. పదహారేళ్లవరకూ ప్రైవేటుగా విద్యనభ్యసించాడు. ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ, రష్యన్, స్వీడిష్ భాషలు నేర్చుకున్నాడు. రసాయనిక శాస్త్రంలో దిట్టగా పేరు సంపాదించాడు. పారిస్‌లో ఒక సంవత్సరం రసాయనిక శాస్త్రం చదివాడు. తర్వాత తండ్రి నిర్వహిస్తున్న ఫ్యాక్టరీలో చేరాడు. అది కాస్తా దివాళా తీసింది. స్వీడన్‌కు తిరిగొచ్చాడు. నైట్రోగ్లిసరిన్‌ను ద్రవరూపంలో తయారుచేయడానికి ప్రయోగాలు చేశాడు. ఈ దశలో 1864లో పేలుడు సంభవించింది. సోదరుడు, నలుగురు కార్మికులు బలయ్యారు. ఫ్యాక్టరీ

పునరుద్ధరణకు ప్రభుత్వం నిరాకరించింది. 'పిచ్చి సైంటిస్టు' అని అందరూ గేలి చేసేవారు. ఈ పరిణామం నోబుల్ జీవితాన్నే మలుపు తిప్పింది. నైట్రోగ్లిసరిన్ పేలుడు తీవ్రతను తగ్గించడానికి పరిశోధనలు చేశాడు. 'సెల్యులోజు'వంటి పదార్థాన్ని దానికి పూయడంవల్ల దాన్లోని తేమశాతం తగ్గుతుందనీ, తద్వారా ప్రమాదాలు నివారించొచ్చనీ కనిపెట్టాడు. దాంతో 'డిటోనేటరు' తయారైంది. దీనికి 1867లో బ్రిటన్‌లోనూ, 1868లో అమెరికాలోనూ పేటెంటు దొరికింది. తర్వాత మరింత శక్తివంతమైన ప్రేలుడు సృష్టించే 'జిలటిన్' తయారుచేశాడు. ఇది 1876లో పేటెంటు పొందింది. ఒక దశాబ్దం తర్వాత 'బాలిస్టెంటు'ను తయారుచేశాడు. దీనివల్ల పొగ ఉత్పత్తికాదు. నోబుల్ ఆశావాది. మృదుస్వభావి. ఈ పదార్థాలవల్ల ప్రపంచానికి విపత్తు వచ్చిపడుతుందేమోనని మధనపడేవాడు. సాహిత్యమంటే మక్కువ. యౌవనంలో కొంత కవిత్వాన్ని సృష్టించాడు. స్వతహాగా ఆయనది ఆహ్లాదరకరమైన స్వభావం. కలల జీవి. సామాజిక విజయాలేమీ లేవు. నాస్తికుడు. అతడి భావనలో భగవంతుడునేవాడు చాలా క్రూరుడు. న్యాయబద్ధత లేని లోకపరిపాలకుడు. యుద్ధాలు, మత కల్లోలాలు దేవునివల్లే సంభవిస్తున్నాయని అతని భావన.

అతని 'యౌవన దశ' గురించి ఎలాంటి సమాచారమూ లేదు. అతని జీవితంలో బెర్త వాన్ సట్నర్ అనే యువతి పేరు కనిపిస్తుంది. బెర్తా అపూర్వమైన అందగత్తె! ఆవిడ నోబుల్ ఆంతరంగిక కార్యదర్శి. అంతకన్నా ఎక్కువా కాదు. తక్కువా కాదు.

అపారమైన కీర్తినంవదలున్నా జీవితాన్ని ఏమాత్రమూ నంతోషంగా గడపలేకపోయాడు నోబుల్. తన చివరి దినాలను ఫ్రెంచి పరివారం మధ్యనే గడిపాడు. 'ఒక ఆత్మీయుడుగానీ, బంధువుగానీ దయతో చేతినందించి మృదువుగా, నిజాయితీగా కాసిని ఓదార్పు మాటలు చెప్పే దశకూడా కరువాయె' అని అతనంటుండే వాడు.

నోబుల్ పరోపకారి. తన అపారమైన సంపదను 1895, నవంబరు నెలలో noble stiftlesenలో పెట్టాడు. ఆ మూలధనంపై వచ్చే ఆదాయాన్ని భౌతిక, రసాయనిక, వైద్య, సాహిత్యాలలో శాస్త్రవేత్తల స్వీయ పరిశోధనలకూ, కృషికీ గాను నోబుల్ బహుమతులను ప్రకటించాడు. ఈ జాబితాలో ఆర్థిక శాస్త్రాన్నీ చేర్చింది స్వీడన్ జాతీయ బ్యాంకు.

'శాంతి' రంగానికి బహుమతిని కేటాయించడం వెనుక సాహితీ వికాస ప్రభావముంది. ఆ యూ రచయిత్రి బెర్తా-వాన్-సట్నర్ ప్రభావమూ అతనిపై ఉంది. 1876లో తనకు వ్యక్తిగత కార్యదర్శి కావాలని పేపర్లో ప్రకటనివ్వగా దానికావిడ దరఖాస్తు చేసింది. తిరిగి పారిస్‌లో 1887లో ఆవిడను కలిశాడు. అప్పుడావిడ అంతర్జాతీయ శాంతి ప్రచార కార్యకర్తగా ఉండేవారు. రచనలు చేస్తుండేవారు. దాంతో నోబుల్ బహుమతి, శాంతిపట్ల నిబద్ధతా ఆల్ఫ్రెడ్‌కు ఏర్పడ్డాయి. అయితే 'బహుమతి'కి ఎవరిని ఎంపిక చేయాలి, దానికిగానూ నార్వే పార్లమెంటుకు ఈ 'పీస్ ప్రైజ్ కమిటీ'ని ఏర్పాటుచేసే అధికారం ఎందుకిచ్చాడో అర్థంకాదు. దానికి తన మాతృదేశం స్వీడన్ ఉంది గదా! 'అట్లా చేయడంవల్ల ఆ రోజుల్లో స్వీడన్- నార్వేలకు మధ్యగల ఉద్రిక్తతలను తగ్గించడానికే' అని కొందరి వాదన.

ఈ బహుమతిని ఆ రంగంలోనే ముగ్గురికి మించకుండా సమానంగా పంచవచ్చు. ఈ బహుమతిని 1985లో నిర్ణయించింది 18,00,000 స్వీడిష్ క్రోనర్లు! చాలా పెద్ద మొత్తం. దీంతోబాటే ఒక స్వర్ణఫలకం డిప్లొమా (అర్హత పత్రం) అందజేస్తారు. ఈ బహుమతిని పుచ్చుకున్నవాళ్లు ఆరునెలలకాలంలో తమ అంశంపై బహిరంగ సభలో ఉపన్యసించాల్సి ఉంటుంది. అధికారికంగా ఈ బహుమతి ప్రదానోత్సవం ప్రతి ఏటా నోబుల్ వర్ధంతి అయిన డిసెంబరు 10న నిర్వహిస్తారు.

ఈ బహుమతి ఎంపిక విధానం కొన్నిసార్లు వివాదాలకు దారితీసింది. ఎంపికైనవారు తమ బహుమతిని తిరస్కరించిన సందర్భాలున్నాయి. ఫ్రెంచి రచయిత జీన్- పాల్ సార్త్ర్ తిరస్కరిస్తూ- 'తన వ్యక్తిగత నమ్మకాలకూ దీనికీ పొంతన లేదని' ప్రకటించాడు.

వియత్నాం నాయకుడు లీ-డుక్-థో దీన్ని తిరస్కరిస్తూ "ఈ శాంతి బహుమానం నాకూ, అమెరికా రాయబారి (మాజీ) హెన్రీ కిసింజర్‌కూ ఇవ్వడంద్వారా ఇద్దర్నీ ఒకే గాటిన కట్టేశారు. విషాద మేమిటంటే కిసింజర్ పరోక్షంగా మిలియన్లకొద్దీ వియత్నాం పౌరులను చంపడానికి కారకుడు కాబట్టి!" అని చెప్పేశాడు.

అయినా ఈ బహుమతులు శాస్త్రవైజ్ఞానిక రంగాల పరిశోధనలనూ, సాహిత్యాన్నీ ప్రభావితం చేశాయి. అందుకే వీటి ప్రకటనకై ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తారు.



*ముస్సోలినీ, క్లారా పెట్టాక్సిలు పట్టుబడ్డారనీ, వారిని బహిరంగంగా కాల్చిచంపారనీ, మిలన్ (ఇటలీ) చౌరాస్తాలో ప్రజల సందర్శనార్థం ఆ శవాలను తలకిందులుగా వేలాడదీశారనీ ఓ వార్త వెలువడింది. హిట్లర్ "నా భార్య శరీరాన్ని, నా శరీరాన్ని పూర్తిగా సర్వనాశనం చేయాలి... పూర్తిగా! వాళ్లు నన్ను ఎన్నటికీ సజీవంగా పట్టుకోవడానికి వీల్లేదు" అని పిచ్చి పట్టినవాడిలా కేకలు పెట్టాడు.*

# నాజీ నియంత చివరిరోజు

**వాళ్ల**తో హిట్లర్ కరచాలనం చేసి భార్యతో తన గదిలోకి వెళ్ళి ధఢాల్న తలుపులు వేశాడు. నిమిషం తర్వాత పిస్తోలుపేలిన శబ్దం! అది ఫాసిస్టు నాజీ ఫ్యూరర్ రీచ్‌కు అంతం!

రెండో ప్రపంచ యుద్ధం. యావత్ ప్రపంచానికదో పీడకల. నాజీ నియంత (ఫ్యూరర్) హిట్లర్ యూదుల నిర్మూలన పేరిట సాగించిన నరమేథం ప్రపంచంలోని అన్ని దేశాలనూ బీభత్సానికి గురిచేసింది. శుద్ధ ఆర్యరక్తం పేరిట సాగించిన ఈ మానవ హననం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. కాకి కూడా కలకాలం బతకదు గదా. దానికీ నూకలు చెల్లుతాయి. అదే నాజీ నియంత హిట్లర్ విషయంలోనూ సంభవించింది. 1945 ఏప్రిల్ 30నాడు ఈ ప్రపంచానికే పట్టిన పీడ వదిలిపోయింది. ప్రపంచ చరిత్రలో అదో పెద్ద టర్నింగ్‌పాయింట్. ఆనాడు హిట్లర్ చరిత్ర పరిసమాప్తం కాకుంటే ఇంకా ఎన్ని లక్షలమంది ప్రజలు తమ అస్తిత్వాన్ని, సర్వస్వాన్ని కోల్పోవలసి వచ్చేదో?!

ఈ విషయంపై సంయుక్త దళాల ఇంటలిజెన్సు 1945లో ఎంక్వైరీకి ఆదేశించింది. కుప్పలు తెప్పలుగా పత్రాలు పరిశీలించారు. తర్వాత జరిగిన వాస్తవాలు ఒకటొకటిగా వెలుగులోకొచ్చాయి.

1945 ఏప్రిల్ 30 మధ్యాహ్నం సరిగ్గా 2.30లకు తన భూగర్భ నివాసం (ఫుహరర్ బంకర్) వాల్తర్ ఆటోమాటిక్ రివాల్వర్‌ను నోట్లో ఉంచుకుని హిట్లర్ ట్రిగ్గర్ నొక్కాడు. పక్కనే కూర్చుని ఉన్న అతని భార్య ఈవా సైనెడ్ కాప్సూల్‌ను కొరికింది. రాత్రి 10.30లకు వాళ్ల మృతదేహాలను పెట్రోలుతో తడిపారు. ఛాన్సలరీ గార్డెన్‌లో వాటికి నిప్పంటించగా భగ్గున మండిపోయాయి. రాత్రంతా రష్యన్ దళాలు శవాలకోసం గాలించాయి. మాడిపోయిన హిట్లర్ ఎముకలు కనిపించాయి.

ఈ అంతానికి ఆరంభం ఆ నాజీనియంత జన్మదినం రోజున 20 ఏప్రిల్ 1945లో ప్రారంభమైంది. ఛాన్సలర్ గార్డెన్ కింద యాభై అడుగుల లోతున ఈ స్థావరంలో జర్మనీ యుద్ధ అధికారులు, నాజీ పార్టీ ప్రముఖులూ శుభాకాంక్షలు తెలపడానికి హాజరయ్యారు. అటు అన్నివైపులా నాజీ దళాలు దారుణంగా సంయుక్త దళాల చేతిలో దెబ్బతింటున్నాయి. ఆ విషయం చెప్పబోయిన సైనికాధికారిపై "నాన్సెన్స్... రష్యన్లు ఓడిపోతున్నారు. బెర్లిన్ గేటు వరకు కూడా రాలేరు. తర్వాత వాళ్లను మనం వెనక్కు నెట్టి సముద్రంలో కలిపేద్దాం!" అని విరుచుకుపడ్డాడు హిట్లర్.

"కానీ, మనం వెనక్కి తగ్గితే మంచి"దని సూచించాడు, గోయరింగ్.

హిట్లర్ మండిపడి "అంత ప్రాణభయం ఉంటే నువ్వు సురక్షిత ప్రాంతానికి పారిపో!" అన్నాడు.

గోయరింగ్ వెంటనే అంతులేని సంపదతో మెర్సిడెస్ కారులో బవేరియాకు వెళ్లిపోయాడు.

ఆ స్థావరంలో ఆయుధశాఖ మంత్రి అల్బర్ట్ స్పీర్ ప్రజా సంక్షేమాన్ని పట్టించుకునేవాడు. హిట్లర్ చేసిన అతి భయానకమైన ప్రణాళికను పసికట్టాడు. సంయుక్త దళాలు జొరబడగానే పారిశ్రామిక కేంద్రాలనూ, గనులనూ, ప్రజాసౌకర్యాలనూ, ఆహారనిల్వలనూ, వస్త్రనిల్వలనూ తక్షణమే ధ్వంసం చేసిపారేయాలంటూ హిట్లర్ నాజీ జిల్లా యూనిట్లన్నింటికీ ఆదేశాలు జారీచేశాడు. ముఖ్యమైన బ్రిడ్జిలను, రైల్వేలైన్లను, ఓడలను ప్రజలకు ఉపయోగపడే ఏ రకమైన సౌకర్యాలనైనా ధ్వంసం చేసేయాలని ఈ మహా ఫాసిస్టు నాజీ నియంత ఆదేశించాడు. అయితే స్పీర్ సుడిగాలిలా మొత్తం దేశాన్ని చుట్టి, ఈ ఆదేశాలు అమలు కాకుండా సైనికాధికారులను ఒప్పించగలిగాడు.

ఏప్రిల్ 22 నాడు రష్యా దళాలు అండర్‌గ్రౌండు రైలు మార్గం గుండా బెర్లిన్‌లో ప్రవేశిస్తాయని తెలిసి 'ఆ సొరంగం నిండా నీళ్లు వదలండి' అన్నాడు హిట్లర్.

"కాని ఫుహరర్... దాన్లో గాయపడిన మన వేలాదిమంది సైనికులున్నారు.. ఎట్లా?" అని జనరల్ కేబ్స్ అభ్యంతర పెట్టాడు.

"నీళ్లు వదలండీ!" హిట్లర్ భయంకరంగా కేకపెట్టాడు. అంతే... నీళ్లు వదిలారు.

29 ఏప్రిల్... అంతా హడావిడి. ఆరోజు ఉదయం హిట్లర్ నిరాడంబరంగా

పెళ్ళిచేసుకున్నాడు. బయట రష్యన్ దళాలు ఫిరంగి గుండ్లు పేలుస్తున్నాయి. తన వారసుడిగా కార్లడోనిట్జను నియమించాడు హిట్లర్.

అప్పుడే... ముస్సోలినీ, క్లారా పెట్టాక్సీలు పట్టుబడ్డారనీ, వారిని బహిరంగంగా కాల్చిచంపారనీ, మిలన్ (ఇటలీ) చౌరాస్తాలో ప్రజల సందర్శనార్థం ఆ శవాలను తలకిందులుగా వేలాడదీశారనీ ఓ వార్త వెలువడింది. హిట్లర్ "నా భార్య శరీరాన్ని, నా శరీరాన్ని పూర్తిగా సర్వనాశనం చేయాలి... పూర్తిగా! వాళ్లు నన్ను ఎన్నటికీ సజీవంగా పట్టుకోవడానికి వీల్లేదు" అని పిచ్చి పట్టినవాడిలా కేకలు పెట్టాడు.

ఆ రాత్రి హిట్లర్ ముఖ్యులందరితో కరచాలనం చేశాడు. లోపల క్యాంటీన్‌లో ఒక ఉన్మాదకర వాతావరణం నెలకొంది. విస్కీ బ్రాందీ వరదలై పారాయి. కొందరు వెర్రెత్తినట్లు డాన్సులు చేశారు. ప్రాతఃకాలం వరకూ చిందులువేశారు.

"నిశ్శబ్దం" అని ఫుహరర్ ఎన్నిసార్లు అరిచినా ఎవరూ పట్టించుకోలేదు.

30నాడు ఉదయాన మామూలుగా, సంతృప్తిగా ఆహారం తీసుకున్నారు. బయట బోర్మన్ గోబెల్సులు వేచియున్నారు. వాళ్లతో హిట్లర్ కరచాలనం చేసి భార్యతో తన గదిలోకి వెళ్ళి దఢాల్న తలుపులు వేశాడు. నిమిషం తర్వాత పిస్తోలుపేలిన శబ్దం!

అది ఫాసిస్టు నాజీ ఫుహరర్ రీచ్‌కు అంతం!



*సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' నవలను సినిమాగా తీసేందుకు నిర్మాతలను కలిస్తే ఎవరూ సరే అనలేదు. రెండేళ్లపాటు అలా తిరిగిన తర్వాత చివరికి తనే ఆ చిత్రాన్ని నిర్మించాలనుకున్నారు. ఇన్సూరెన్సు కట్టిన కంపెనీ నుంచి ఏడువేల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. బంధువుల దగ్గర మరో రెండువేలు అప్పుచేశారు. ఆ డబ్బుతో వీలైనంత చిత్రీకరించి, సినిమా పూర్తిగా తీయటానికి ఎవరైనా నిర్మాతను ఒప్పించవచ్చనేది ఆయన ఉద్దేశం. అది కుదరకపోతే చిత్రకారుడిగానే ఉండిపోవాలనుకున్నారు.*

# భారత సినీ చరిత్రను మలుపు తిప్పిన 'పథేర్ పాంచాలి'

సుప్రసిద్ధ దర్శకుడు సత్యజిత్‌రే దర్శకత్వం వహించిన బెంగాలీ చిత్రం 'పథేర్ పాంచాలి' 1955 ఆగస్టు 26న విడుదలైంది. ఆ సినిమా ద్వారానే పాశ్చాత్యదేశాల వారికి మన సినిమాలపై ఆసక్తి కలిగింది. భారతీయుల్లోనూ గొప్ప దర్శకులున్నారనీ, అద్భుతమైన సినిమాలు తీయగలరనీ వారు తెల్సుకున్నారు. "పథేర్ పాంచాలి భారతీయ సినీ రంగ చరిత్రనే మార్చిన సినిమా" అని మెచ్చుకుంటారు విశ్లేషకులు.

ఈ సినిమా సత్యజిత్‌రే జీవితంలో టర్నింగ్ పాయింట్. ఈ సినిమాకు స్ఫూర్తి విక్టోరియా డిసికా తీసిన 'బైసికిల్ థీవ్స్'. సత్యజిత్‌రే అప్పట్లో కలకత్తాలోని డిజె కీమర్ అనే అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలో ఆర్ట్ డైరెక్టర్. ఓ శిక్షణ కోసం ఆయన్ని లండన్‌కు పంపింది

యాజమాన్యం. భార్య బిజయతో కలిసి అక్కడికి వెళ్లారాయన. ఆఫీసు లేని సమయంలో కాలక్షేపానికి సినిమాలు చూసేవాడు. దాదాపు నూరు సినిమాలు చూశారు. వాటిలో 'బైసికిల్ థీవ్స్' సత్యజిత్‌రేను అమితంగా ఆకట్టుకుంది. "సినిమా చూసి బయటికొచ్చేసరికి నా మనసులో దృఢ నిశ్చయం ఏర్పడింది. నేను దర్శకుణ్ణి అవుదామనుకున్నాను" అని చెప్పారాయన. "నాకు భద్రతనిచ్చే ఉద్యోగాన్ని వదులుకోవాలనే విషయం నన్ను భయపెట్టడం మానేసింది. ఖచ్చితంగా డిసికా మాదిరిగానే నా సినిమాను తీయాలనుకున్నాను. నటనను వృత్తిగా స్వీకరించని వారితో పని చేయడం, తక్కువ బడ్జెట్‌తోనే సినిమా తీయడం, వాస్తవంగా ఉన్న లొకేషన్లలోనే షూటింగ్ చేయడం నా ఉద్దేశాలు. రోమ్‌నగర శివార్లు డిసికా చిత్రానికి లొకేషన్ అయినట్టుగానే" బిభూతి భూషణ్ 'పథేర్ పాంచాలి' నవలలో వర్ణించిన గ్రామంలోనే నా చిత్రాన్ని తీయాలనుకున్నాను.

సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' నవలను సినిమాగా తీసేందుకు నిర్మాతలను కలిస్తే ఎవరూ సరే అనలేదు. రెండేళ్లపాటు అలా తిరిగిన తర్వాత చివరికి తనే ఆ చిత్రాన్ని నిర్మించాలనుకున్నారు. ఇన్సూరెన్సు కట్టిన కంపెనీ నుంచి ఏడువేల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. బంధువుల దగ్గర మరో రెండువేలు అప్పుచేశారు. ఆ డబ్బుతో వీలైనంత చిత్రీకరించి, సినిమా పూర్తిగా తీయటానికి ఎవరైనా నిర్మాతను ఒప్పించవచ్చనేది ఆయన ఉద్దేశం. అది కుదరకపోతే చిత్రకారుడిగానే ఉండిపోవాలనుకున్నారు.

1952 అక్టోబర్ 27న సత్యజిత్‌రే షూటింగ్ మొదలుపెట్టారు. ఆ సినిమాకు పనిచేసిన సాంకేతిక నిపుణులు, నటీనటుల్లో చాలామంది కొత్తవాళ్లే. సత్యజిత్‌రేతో పాటు కెమెరామన్ సుబ్రతామిత్రాకు కూడా అంతకుముందు సినిమా తీసిన అనుభవం లేదు. తీరిక సమయాల్లో సినిమా తీస్తూ, డబ్బు లేనప్పుడు షూటింగ్ మానేస్తూ ఉండేవారు.

అప్పుడు రాణా దత్తా అనే నిర్మాత సహాయపడ్డాడు. కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. వాటిని పట్టుకుని మళ్లీ నిర్మాతలకోసం తిరిగితే ఎవరూ ముందుకు రాలేదు. నిర్మాతలను ఒప్పించడానికి కొందరు మధ్యవర్తులకు డబ్బులిచ్చారు రే. అవి తన దగ్గరున్న ఆర్ట్ బుక్స్, మ్యూజిక్ రికార్డ్సు అమ్మగా వచ్చినవి. ఈ విషయం భార్యకు తెలియనివ్వలేదు. అయితే మధ్యవర్తులు ఆయన్ని మోసం చేశారు.

పరిస్థితి ఇలా అస్తవ్యస్తమైనా ఓ గాఢనమ్మకం ఆయనకు ఉత్సాహం కలిగించేది. తను చేస్తున్నది ముఖ్యమైన పని, ఖచ్చితంగా అది భారతీయ సినీరంగంలో పేరు తెచ్చుకుంటుంది. అంతర్జాతీయంగానూ కావచ్చు. రషెస్ చూసిన తర్వాత ఆయనకు కలిగిన నమ్మకం అది.

చివరికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సహాయంతో 'పథేర్ పాంచాలి' పూర్తయింది. ఎటువంటి గడ్డు పరిస్థితుల్లో ఆ సినిమా తీయడం జరిగిందో చూస్తే నిజంగా అద్భుతం లాంటిది అనిపిస్తుంది. అదో కళాఖండంగా రూపుదిద్దుకోవడం మరో అద్భుతం.

అంతటి గొప్ప చిత్రం పథేర్ పాంచాలికి మొదట్లో ప్రేక్షకులు లేరు. చూసినవాళ్లు మెచ్చుకోవడంతో కొన్ని రోజులకు హౌస్‌ఫుల్ అవడం మొదలెట్టింది. సత్యజిత్‌రే 1955

నుంచి 1978 వరకూ ఏడాదికి ఓ చిత్రం చొప్పున తీశారు. ఆయన దర్శకత్వం వహించి చిత్రాలు మొత్తం 28. ఐదు డాక్యుమెంటరీ చిత్రాల్లో మూడు చిన్న చిత్రాలు కూడా ఉన్నాయి

జపాన్ దర్శకుడు, జీనియస్ అనదగ్గ అకిరా కురసావా పథేర్ పాంచాలి గురిం "ఆ సినిమా చూసిన తర్వాత నాకు కలిగిన ఎక్సయిట్‌మెంట్‌ను మరచిపోలేను. నాకు సినిమా చూసే అవకాశం పలుసార్లు వచ్చింది. ప్రతిసారీ అద్భుతంగానే అనిపించింది. అ ప్రశాంతంగా, గంభీరంగా ప్రవహించే పెద్దనదిలాంటి" అని మెచ్చుకున్నాడు.

దర్శకుడై మూడు దశాబ్దాలు గడిచిన తర్వాత సత్యజిత్‌రే ఇలా చెప్పాడు. "నే ఇన్నేళ్లుగా సినిమాలు తీస్తూ, నేర్చుకుంటూ పరిణతి పొందుతున్నాను. ఐడియాలు అ వస్తూనే ఉన్నాయి. నా పరిసర ప్రపంచం గురించి మరింత తెల్సుకుంటున్నాను. నేనింత ముందు చాలా సినిమాలు తీశాను. ఇప్పుడు వాటిపై అంత ఆసక్తిలేదు. ఇప్పుడు నా చుట జరిగే వాటి మీదే ఆసక్తి. ముఖ్యంగా ప్రస్తుతం నా ఆరోగ్యరీత్యా ఔట్‌డోర్లలో పనిచేయలే గనుక సంభాషణలకు ప్రాధాన్యం ఉండే సినిమాలు తీయాలి. అయితే నా సినిమాలో పాత్ర మాట్లాడేది ప్రేక్షకులు పట్టించుకునే ముఖ్య విషయాలే అయి ఉండాలి" అని.

"నా ఇష్టప్రకారం తీయని సినిమా ఒకటుంది. పరిస్థితుల ఒత్తిడి వల్ల నేను 'చిడియ ఖానా' సినిమా తీశాను. దాన్ని సరదాగానే తీశాను. తీయకపోతే బాగుండేది. డిటెక్టి కథలు ఏమంత మంచి సినిమాలు కావు. అందులో డిటెక్టివ్ చివర్లో పెద్ద ఉపన్యాసమిస్తాడ అదిలా జరిగింది. అలా జరిగిందంటూ. చాలా బోర్‌కొట్టేస్తుంది" అన్నాడు సత్యజిత్‌రే నిజంగా భారతదేశం గర్వించదగ్గ దర్శకుడాయన.



*పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచి దేశస్థులు ఆఖరుగా ఆంగ్లేయులు రావడం, వలస ఆధిపత్యానికి భారత దేశం గురికావడం మనకు తెలుసు. పశ్చిమ రాజ్యాల దోపిడీకే గాక, వారితో సంబంధ బాంధవ్యాలకు నాంది పలికింది వాస్కోడిగామాయే. భారత భూమిపై గామా కాలూనినచోట, యిప్పటికీ ఒక శిలాశాసనం యిలా వుంది. "వాస్కోడిగామా లాండెడ్ హియర్ కప్పాదవ్ ఇన్ ది యియర్ 1498".*

# వాస్కోడిగామకు దారిచూపిన భారతీయుడు


ఐరోపా ఖండ చరిత్రలో 15, 16 శతాబ్దాలు ఉజ్వల యుగంగా ప్రసిద్ధికెక్కాయి. సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలైంది అప్పుడే. మధ్యయుగాల మతాధిక్యత క్షీణించి, మానవమేధస్సుకు, స్వతంత్ర ఆలోచనలకూ నాంది పలికింది అప్పుడే. సృష్టిలో మకుటదారి మానవుడేనన్న మానవతావాదం చివుళ్ళు తొడిగింది అప్పుడే. పునరుజ్జీవనంలో భాగంగా, ఎన్నో శాస్త్ర పరిశోధనలూ జరిగాయి. వీటిలో ముఖ్యమైంది నావికా దిక్సూచి.

దీని సాయంతో సముద్రయానం సులభ తరంగావడమే కాదు... ఏ దిక్కులో పయనిస్తున్నామో, నడి సముద్రంలో వున్న నావికులకు, స్పష్టంగా తెలిసినందువల్ల , నౌకాయానం సురక్షితంగా సాగింది. దిక్సూచి కనిపెట్టాక, భౌగోళిక ఆవిష్కరణలు జరిగాయి. నావికాదిక్సూచి కనుగొనడం ఓ మలుపు.

ఆ యుగంలోనే మొదటి సారిగా భారతదేశానికి సముద్ర మార్గం కనుగొనబడింది. వాస్కోడిగామా ఈ మార్గాన్ని కనుగొనడంలో కృతకృత్యుడైన వైనం ఆసక్తి గొలుపుతుంది. ఐరోపా ఖండంలో సముద్రయానాన్ని ప్రోత్సహించిన దేశాలు పోర్చుగల్, స్పెయిన్.

మాజిలాన్, కొలంబస్ ఈ దేశాల రాజులచే ప్రోత్సహింపబడిన వాళ్ళే. పోర్చుగల్ రాజ మాన్యువల్ వాస్కోడిగామాకు అన్ని సౌకర్యాలు అమర్చి, భారతదేశానికి సముద్రమార్గం కనుగొనాలని పురమాయించాడు. అంతేకాక, అప్పట్లో క్రైస్తవమతం ప్రాచుర్యంలో వున్న క్రైసవ బోధక రాజు ఐతిహ్యం గూడా యిందుకు తోడ్పడింది. ప్రజల నోళ్ళలో ఎన్ని శతాబ్దాలుగానో నానుతున్న వైభవోపేతమైన ఈ రాజు పేరు ప్రెస్టర్ జాన్. సకల భోగభాగ్యాలతో ఆ రాజ్యం తులతూగూతూ ఉంది. అక్కడ శాంతి సౌభాగ్యాలు వెల్లి విరుస్తున్నాయని కాథలిక్ మతస్తుల నమ్మకం. ఈ రాజ్యాన్ని కూడా కనుగొనాలని వాస్కోడిగామా ఉవ్విళ్ళూరాడు.

పోర్చుగల్ రాజధాని లిస్బన్ నుండి జులై 8, 1497లో మందీమార్బలంతో బయలుదేరాడు. అంతకు ముందే బార్త్‌లో మియో డియాజ్ అనే నావికుడు ఆఫ్రికా ఖండ అగ్రాన్ని చేరి, దానికి గుడ్‌హోప్ అనే పేరు పెట్టాడు. కానీ అది దాటి ముందుకు పోలేకపోయాడు. ఇప్పుడు వాస్కోడిగామా అక్కడికి సులభంగానే చేరాడు. కాని అప్పటికే అతడి తోటి నావికులు అలసిపోయి, విసుగు చెంది ముందుకు సాగడానికి సిద్ధంగా లేరు. గామా యుక్తిపరుడే కాక శక్తిపరుడు కూడా. అనుచర నావికులను భయపెట్టి, బతిమిలాడి ఒక్కోసారి బెదిరించి, ఎలాగయితేనేం ప్రయాణాన్ని కొనసాగించాడు. నెమ్మదిగా 1497 నవంబర్‌కు ఆఫ్రికా అగ్రాన్ని చుట్టి, మొజాంబిక్‌కు చేరాడు. అక్కడి నుండి ముందుకు ఉత్తర దిశలో పయనిస్తే, ప్రసిద్ధమైన రేవు పట్టణాలున్నాయనీ సుగంధద్రవ్యాలు, మంచి ముత్యాలు, రూబుళ్ళు దొరుకుతాయనీ, వాణిజ్యం లాభసాటిగా చేసుకోవచ్చనీ, మొజాంబిక్ వాసులు చెప్పాడు. సాహసించి ముందుకు సాగాడు. క్రైస్తవ మతబోధక రాజు ప్రెస్టర్ జాన్ రాజ్యం కూడా కనుక్కోవచ్చునన్న ఆశ యెలాగూ వుండనే వుంది. ఈ విషయం అతడి అనుచరులనూ సంతోషపరిచింది. ఆఫ్రికా తీరంలోని 'మొంబాసా' చేరాడు. అంతటితో ఆగకుండా, యింకా ఉత్తర దిక్కుగా ప్రయాణం చేసి, మాలింది అనే చిన్న రాజ్యాన్ని చేరుకున్నాడు. 'మాలింది' సుల్తాన్ స్వాగతించి, వాస్కోడిగామాను సత్కరించాడు. గామా ఆనందించాడు. చరిత్ర మలుపు తిరిగింది యిక్కడే. 'మాలింది'లో అక్కడున్న భారతీయ వర్తకులను వాస్కోడిగామా కలుసుకున్నాడు. కొన్ని తరాలుగా వాళ్ళక్కడ జీవిస్తున్నారు 'మాలింది' నుండి భారతదేశ పశ్చిమ తీరానికి రాకపోకలు, వర్తక వాణిజ్యాలున్నాయి వాస్కోడిగామాను అదృష్టం వరించింది. ఒక గుజరాతీ నావికుడి సహాయంతో గామా అరేబియా సముద్రాన్ని క్షేమంగా దాటాడు. మలబార్ తీరాన్ని చేరుకొని, కాలికట్‌కు సమీపంలో మే 28, 1498 నాడు లంగర్ దించాడు. పశ్చిమ దేశాల నుండి (ఐరోపా ఖండ) భారతదేశానికి ఇది కొత్త సముద్ర మార్గం. దీన్ని కనుగొన్న ఘనత వాస్కోడిగామాకే దక్కింది. దీంతో ఐరోపాలో దేశాల వారి రాక ఆరంభమైంది. పోర్చుగీసువారు, డచ్చివారు, ఫ్రెంచి దేశస్థులు ఆఖరుగా ఆంగ్లేయులు రావడం, వలస ఆధిపత్యానికి భారత దేశం గురికావడం మనకు తెలుసు. పశ్చిమ రాజ్యాల దోపిడీకే గాక, వారితో సంబంధ బాంధవ్యాలకు నాంది పలికింది వాస్కోడిగామాయే. భారత భూమిపై గామా కాలూనినచోట, యిప్పటికీ ఒక శిలాశాసనం యిలా వుంది. "వాస్కోడిగామా లాండెడ్ హియర్ కప్పాడవు ఇన్ ది యియర్ 1498".




ఆంగ్లేయుల సాంఘిక విధానాలకు, సంస్కరణలకు వ్యతిరేకంగా, ప్రజల్ని కూడగట్టే ప్రయత్నాలారంభమయ్యాయి. నివురుగప్పిన నిప్పులా ఆంగ్ల వ్యతిరేకత *1857* నాటికి తారాస్థాయికి చేరుకొంది. అగ్నిపర్వతం బద్దలు కావడానికి సమయమాసన్నమైంది. అయితే పిల్లిమెడలో గంట కట్టేదెవరు ? తిరుగుబాటు ఎవరు, ఎలా ఆరంభిస్తారు. అత్యంత శక్తివంతమైన బ్రిటీష్ పరిపాలనను నిలవరించగల శక్తులేవి ?

# ఆంగ్లేయులకు తొలి దెబ్బ
# ఎన్‌ఫీల్డ్ రైఫిల్

శతాబ్దాల దీర్ఘ చరిత్ర గల దేశం మనది. వైశాల్యంలోనూ, వైవిధ్యంలోనూ ఉపఖండం అన్నదందుకే. మొత్తం దేశాన్ని పాలించిన సామ్రాజ్యాలు, ప్రాచీన కాలం నుండి, ఆధునిక యుగందాకా చాలా కొద్ది మాత్రమే. మొట్ట మొదటిది మౌర్య సామ్రాజ్యం కాగా, ఆంగ్లేయులది చివరిది. వీరు దాదాపు రెండు వందల సంవత్సరాలు మనదేశాన్ని పరిపాలించారు. వారి పాలనకు అనువైన భౌతిక, బౌద్ధిక పునాదుల్ని క్రమేపీ ఏర్పాటు చేసుకొంటూవచ్చారు. ఆంగ్ల మేధావులు భావించినట్టుగా ఈ దేశం ఏనాడూ స్థాణువులా, నిలవనీరులా లేదు. చలనం, గమనం, భారతీయ సమాజానికి పట్టుకొమ్మలు. ఆంగ్లేయుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజలు అనేక తిరుగుబాట్లు చేశారు. వీటిలో 1857లో చేసిన తిరుగుబాటు చాలా గొప్పది. ఇది సైనికులు, భారతీయ సిపాయిలు నిర్వహించిన ఘటన.

ఇది సిపాయిల తిరుగుబాటా లేక మొదటి స్వాతంత్ర సంగ్రామమా అన్న చర్చ చరిత్రకారుల్లో విస్తారంగా సాగింది. ఈ రెండూ కాదని, అది ఒక బృహత్‌పోరాటమనీ, ఆంగ్లేయులను దేశాన్నుండి తరిమికొట్టే క్రమంలో చేసిన భారీ హింసాయుత పోరాటమనీ కొందరు అంచనావేశారు. ఆ చర్చ ప్రస్తుతానికి పక్కనపెట్టి ఈ తిరుగుబాటు ప్రారంభించడానికి దోహదం చేసిన ఘట్టాన్ని పరిశీలిద్దాం.

నయానా, భయానా, వంచనతో రాజ్యాక్రమణ సిద్ధాంతాలతో, బ్రిటిషు ప్రభుత్వ తన అధికారాన్ని సుస్థిరం చేసుకున్నప్పటికీ, సమాజంలో చాపకింద నీరులా వారి పట్ల వ్యతిరేకత, ద్వేషం అంతర్లీనంగా పెరుగుతూవచ్చింది. వలసపాలనలో ప్రజల ఆర్థిక స్థితిగతులు క్షీణించాయి. జీవన ప్రమాణాలు అడుగంటాయి. ఆంగ్లేయుల సాంఘిక విధానాలకు, సంస్కరణలకు వ్యతిరేకంగా, ప్రజల్ని కూడగట్టే ప్రయత్నాలారంభమయ్యాయి నివురుగప్పిన నిప్పులా ఆంగ్ల వ్యతిరేకత 1857 నాటికి తారాస్థాయికి చేరుకొంది. అగ్నిపర్వతం బద్దలు కావడానికి సమయమాసన్నమైంది. అయితే పిల్లిమెడలో గంట కట్టేదెవరు ' తిరుగుబాటు ఎవరు, ఎలా ఆరంభిస్తారు. అత్యంత శక్తివంతమైన బ్రిటీష్ పరిపాలనను నిలవరించగల శక్తులేవి ?

సరిగ్గా ఆ సమయంలో, యుద్ధ గిడ్డంగిలో నిప్పురవ్వ పడి అగ్నిజ్వాలలు సర్వత్ర వ్యాపించినట్టుగా, ఒక సంఘటన చోటు చేసుకొంది. 1857లో బ్రిటీషు ప్రభుత్వం ఎన్‌ఫీల్డ్ రైఫిల్ అనే కొత్త ఆయుధాన్ని ప్రవేశపెట్టింది. రైఫిల్‌లో దట్టించాల్సిన తూటాలకు ఆవు పంది కొవ్వుతో తొడుగు తయారు చేసింది. సైనికులు నోటితో దాన్ని తొలగించి, రైఫిల్‌లో దూర్చాల్సి ఉంటుంది. హిందువులకు ఆవు పవిత్రమైంది. దాని మాసం తినకూడదు మహాపాపం. ముస్లిములకు పందిమాంసం నిషిద్ధం. ఈ రెండు మతాల భావాలను విశ్వాసాలను ఈ చర్య పూర్తిగా భంగపరిచింది. వారిని రెచ్చగొట్టింది. ఆంగ్లేయ ప్రభుత్వ క్రైస్తవ మతాన్నభిమానించి, దానికి ప్రోత్సాహాన్ని కల్పిస్తోందన్న విమర్శ ప్రజల్లో అప్పటికే వ్యాపించి ఉంది. దానికి ఈ తూటాల వ్యవహారం తోడైంది. కావాలనే, దేశంలోని ప్రబలమైన ఈ రెండు మతాలను అవమానించడానికే ఈ చర్య చేపట్టారని భావించిన భారతీయ సైనికులు ఒక్కసారిగా కోపోద్రిక్తులై తిరుగుబాటు ప్రారంభించారు. హిందువులు, ముస్లింలు కలిసి ఐక్యంగా పోరాడిన చారిత్రాత్మక ఘట్టమిది. ఢిల్లీకి 58 కిలో మీటర్ల దూరంలో ఉన్న మీరట్‌లో మే 10న 1857లో ఆరంభమైంది. కొద్ది రోజుల్లోనే ఉత్తర భారతమంతా దావానలంలా వ్యాపించి ఆంగ్లేయుల అధికారపునాదుల్ని కదిపేసింది.

ఆ తిరుగుబాటు, ఆధునిక భారతదేశ చరిత్ర గమనాన్ని కొత్త మలుపు తిప్పింది ఈ పంది కొవ్వు, ఆవు కొవ్వు తూటాలే.... తెల్ల దొరల అధికారపు కొవ్వు కరగదీసాయి



*[illegible] తాను పనిచేయ [illegible] ప్రెటోరియాకు రైల్లో బయలుదేరాడు. దా[illegible] మారి[illegible]ర్గ్ స్టేషనుకు చేరాక ఒక రైల్వే అధికారి గాంధీని సాధారణ కంపార్టుమెంటులోకి వెళ్లవలసిందిగా ఆదేశించాడు. తనవద్ద ఫస్టుక్లాస్ టిక్కెట్టుందనీ, కాబట్టి తాను అక్కడి నుండి వెళ్లాల్సిన అవసరం లేదనీ గాంధీ వాదించాడు. అయినా ఆ అధికారి వినిపించుకోలేదు. గాంధీని సామానుతో సహా దౌర్జన్యంగా బయటికి గెంటేశాడు.*

# గాంధీని మహాత్ముడిగా మార్చిన రైలు

**మా**నవేతిహాసంలో ఎందరో మహానుభావులు తమ ఆత్మార్పణతో, త్యాగనిరతితో సమాజగమనాన్ని ఆదర్శాల వేపు మళ్లించారు. భావితరాలకు మార్గదర్శకులయ్యారు. అయితే చరిత్ర నిర్మాతలు ఏ కొందరు నాయకులో కారు. ప్రజలే! ఒక్కో చారిత్రక దశలో నెలకొన్న అనేకానేక పరిస్థితులు నాయకులను సృష్టిస్తాయి. వీరు సమాజానికి దిశానిర్దేశం చేస్తారు. దాన్ని ముందుకు తీసుకెళతారు. ఆధునిక యుగంలో ఎందరో ఆదర్శజీవులు చరిత్రను కొత్త మలుపు తిప్పారు. భారతదేశం దీనికి మినహాయింపుకాదు. అలాంటి వారందరిలోకెల్లా మహాత్మాగాంధీ ఓ విలక్షణమైన వ్యక్తి. మట్టినుండి మాణిక్యాలను సృష్టించగల నేర్పు గొప్ప నాయకులకుండాల్సిన మొదటి లక్షణం. గాంధీజీ నాయకత్వంలో గొప్ప పేరు సంపాదించుకున్న నాయకులెందరో సామాన్యకుటుంబాల నుంచి వచ్చినవారే.

గాంధీజీ పుట్టుకతోనే నాయకుడు కాదు. అందరిలాగే పెరిగాడు. పై చదువులకు ఇంగ్లండుకెళ్లాడు. అక్కడ న్యాయవాదవృత్తిలో పట్టా తీసుకుని తిరిగొచ్చాడు. ఆర్థికంగా కొద్దో గొప్పో స్థిరత్వం కలిగిన కుటుంబాలవారు తమ పిల్లలను విదేశాలకు పంపి, న్యాయవిద్య

చదివించడం అప్పట్లో రివాజు. ఇంగ్లండ్ నుండి గాంధీ 1891లో తిరిగొచ్చాడు. కథియవార్‌లోని రాజ్‌కోటలో ప్రాక్టీసు ప్రారంభించాడు. విద్యలో ఆరితేరినా వృత్తిలో రాణించలేక పోయాడు. పైగా రాజ్‌కోటలోని ఆంగ్లరాజకీయ ప్రతినిధితో సరైన సంబంధాలు లేకుండా పోయాయి. ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో దక్షిణాఫ్రికాలో ఉన్న భారతీయుల తరపున ఒక సివిల్ వాజ్యంలో పనిచేసే అవకాశం వచ్చింది. రానూ పోనూ ప్రయాణ ఖర్చులు, ఫీజు 105 పౌండ్లు, ఒక సంవత్సరం పాటు అక్కడుండే విధంగా ఒప్పందం చేసుకున్నారు.

1893లో దర్బన్ పట్టణానికి చేరాడు. అక్కడ తనకు ఉపాధి కల్పించిన సంపన్న భారతీయ వాణిజ్యవేత్త, అబ్దుల్లాను కలిశాడు. ఆయనతో కలిసి అక్కడున్న న్యాయస్థానానికెళ్లాడు. గాంధీజీ ఆ రోజుల్లో తలకో గుడ్డ కట్టుకునేవారు. కోర్టు ఆవరణలో ఉన్నప్పుడు దాన్ని తీసేయాలని గాంధీజీని అడిగారు. దానికి ఆయన నిరాకరించి, కోర్టు నుండి వెళ్లిపోయాడు. ఈ సంఘటన గూర్చి నిరసన తెలుపుతూ స్థానిక వార్తాపత్రికలకో ఉత్తరం రాశాడు. పత్రికలు గాంధీని "అనాహూత సందర్శకుడు"గా వర్ణిస్తూ రాశాయి. గాంధీ ఈ సంఘటనలతో కలత చెందాడు.

జాతి వివక్ష గూర్చి గాంధీజీ విన్నాడు. భారతదేశంలో అలాంటి ఘటనలు సంభవించినప్పుడు అవి కొందరు ఆంగ్లేయ అధికార్ల విపరీత చర్యలుగానే భావించాడు. ఇంగ్లండులో ఉండగా ఇలాంటి అనుభవం ఆయనకెన్నడూ ఎదురవలేదు. దీన్ని ఒకానొక ప్రత్యేక పరిస్థితుల్లో సంభవించిన అసాధారణ సంఘటనగా భావించి సమాధానపడ్డాడు.

దర్బన్ నుండి తాను పనిచేయాల్సిన ప్రెటోరియాకు రైల్లో బయలుదేరాడు. దారిలో మారిట్జ్‌బర్గ్ స్టేషనుకు చేరాక ఒక రైల్వే అధికారి గాంధీని సాధారణ కంపార్టుమెంటులోకి వెళ్లవలసిందిగా ఆదేశించాడు. తనవద్ద ఫస్టుక్లాస్ టిక్కెట్టుందనీ, కాబట్టి తాను అక్కడి నుండి వెళ్లాల్సిన అవసరం లేదనీ గాంధీ వాదించాడు. అయినా ఆ అధికారి వినిపించుకోలేదు. గాంధీని సామానుతో సహా దౌర్జన్యంగా బయటికి గెంటేశాడు. ఎముకలు కొరికే చలి. చిమ్మ చీకటి. వెలుతురు సరిగా లేని వెయిటింగ్ రూంలో కూర్చొని గాంధీ దీర్ఘాలోచనలో పడ్డాడు. ఏం చేయాలి? అవమానాలు భరించి ఉండాలా? భారతదేశానికి తిరిగెళ్లాలా? ఇక్కడే గాంధీ ఒక ధృఢనిర్ణయానికొచ్చాడు. ముందుకు ప్రయాణించాలనే నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత ఛార్ల్‌స్టన్ స్టేషనుకెళ్లి, అక్కడినుండి స్టేజికోచ్‌లో ప్రెటోరియాకు వెళ్లేటప్పుడూ ఇదే అనుభవమెదురైంది. కోచ్‌లో నుండి దిగి డ్రైవర్ పక్కన కూర్చొని, ఫుట్ బోర్డు మీద ప్రయాణం చేయమని చెప్పినప్పుడు గాంధీ నిరాకరించాడు. దాంతో ఆంగ్లేయులు సహనం కోల్పోయి గాంధీని బలంగా కొట్టాడు. అయినా సీటు నుండి గాంధీ లేవలేదు. ఆ అధికారి దురహంకారాన్ని ఎంతో ధైర్యంతో, స్వాభిమానంతో ఎదుర్కొన్నాడు.

ఈ ఘటనలే గాంధీ జీవితాన్ని మలుపు తిప్పాయి. తెల్లవారి ఆధిపత్యాన్ని ఎదుర్కోవాలన్న తీవ్ర ఆంకాంక్ష మొలకెత్తేట్లు చేశాయి. ఇదే ఆ తర్వాత కాలంలో పెద్ద మానుగా ఎదిగి భారతదేశంలో వలసపరిపాలన అంతమొందించేందుకు దారితీసింది.



దక్షిణ భారతదేశంలో ఒక చిన్న ప్రాంతం తప్ప దేశం మొత్తం అశోకుడి అధీనమైంది. అయితే, ఈ యుద్ధ విజయం అశోకుడికి హర్షం కలిగించలేదు. మనసులో అశాంతి, హృదయంలో ఆవేదన, కరుణతో నిండిన అశోకుడి కళ్ళ నుండి దుఃఖాశ్రువులు. కొన్ని లక్షల మంది అసువులు బాశారు. ఒక లక్ష మంది క్షతగ్రాతులైనారు. ఒకట్నీర లక్ష మంది యుద్ధ బందీలుగా పట్టుబడ్డారు. ఆ సువిశాల యుద్ధ మైదానంలో జరిగిన మారణహోమాన్ని తిలకించి, తీవ్రమైన మనస్తాపానికి గురయ్యాడు.

# కత్తిదూసినవాడు కరుణా సముద్రుడైన వేళ

**భా**రతదేశ చరిత్రలో మొట్టమొదటి సామ్రాజ్యాన్ని స్థాపించిన ఘనత మౌర్యవంశానికి దక్కుతుంది. చంద్రగుప్తమౌర్యుడు దీనికి చక్రవర్తి. చంద్రగుప్తుడి తర్వాత అతడి కుమారుడు బిందుసారుడు 25 సంవత్సరాలు పరిపాలించాడు. బిందుసారుడి కుమారుడు అశోకుడు క్రీ.పూ. 268లో సింహాసనాన్నధిష్టించాడు. అతిపెద్ద సామ్రాజ్యం. ఉత్తర, మధ్యభారతాలతో సహా ఆఫ్ఘనిస్తాన్ దాటి దాదాపు మధ్య ఆసియా వరకూ విస్తరించింది. మౌర్య సామ్రాజ్యానికి దక్షిణంగా, ఆగ్నేయంగా వున్న కళింగ రాజ్యాన్ని కూడా ఆక్రమించారు. కళింగతీరంలోని రేవుపట్టణాలపై ఆధిపత్యాన్ని సాధించి, విదేశీవాణిజ్యం ద్వారా అశోకచక్రవర్తి ఆర్థికంగా లబ్ధి పొందాలనుకున్నాడు. అంతేకాదు ఆ కళింగ రాజ్యం సంపన్నవంతమైంది కూడా.

అశోకుడు పరిపాలనకొచ్చిన తొమ్మిదవ సంవత్సరంలో కళింగపై దండెత్తాడు. కళింగ ప్రజలు వీరోచితంగా పోరాడి ఓడిపోయారు. అనతికాలంలో తానూహించని రీతిలో,

సునాయసంగా విజయం లభించింది. దీంతో దక్షిణ భారతదేశంలో ఒక చిన్న ప్రాంతం తప్ప దేశం మొత్తం అశోకుడి అధీనమైంది. అయితే, ఈ యుద్ధ విజయం అశోకుడికి హర్షం కలిగించలేదు. మనసులో అశాంతి, హృదయంలో ఆవేదన, కరుణతో నిండిన అశోకుడి కళ్ళ నుండి దుఃఖాశ్రువులు. కొన్ని లక్షల మంది అసువుల బాశారు. ఒక లక్ష మంది క్షతగాత్రులైనారు. ఒకట్నిర లక్ష మంది యుద్ధ బందీలుగా పట్టుబడ్డారు. ఆ సువిశాల యుద్ధ మైదానంలో జరిగిన మారణహోమాన్ని తిలకించి, తీవ్రమైన మనస్తాపానికి గురయ్యాడు. ఆ రణక్షేత్రంలో శవాల కుప్పల మధ్య నుంచొని అశోకుడు భోరున విలపించాడు. మనమంతా దేని కోసం? యుద్ధ విజయాలు శాశ్వతమా? ఇంతమంది చనిపోయాక ఎవర్ని తాను పరిపాలించాలో దిక్కుతోచలేదు. ఈ హింస, ప్రతి హింసను ప్రేరేపించదా? తాను చేసిన దానికి ప్రతీకారంగా మరొకరు మరో యుద్ధం చేయారా? మళ్ళీ చావులూ, రక్తపాతమే కదా! శాంతి, అహింసలు, మానవ మనుగడలకే గాక, సకల ప్రాణికోటికి అవసరం కాదా? ఈ ప్రశ్నలతో పాటు బిడ్డల్ని పొగొట్టుకున్న తల్లులు, పతుల్ని కోల్పోయిన సతులు, ఎందరెందరో అశోకుడి మస్తిష్కంలో కదలాడారు. హింసను, యుద్ధాలను త్యజించి, అహింసను తన పరిపాలనా పతాకగా ప్రకటించాడు. ఇక యుద్ధాలు చేయబోనని శపథం చేశాడు. అశోకుడి జీవితంలోనే కాక, భారతదేశ చరిత్రలోనే ఇదొక గొప్ప మలుపు ప్రపంచ చరిత్రలో ఇదొక అపూర్వ ఘటన. ఎందరో యుద్ధ వీరులు, గొప్ప చక్రవర్తులు సామ్రాజ్య నిర్మాతలుగా పేరొందారు. గొప్ప సైనిక విజయాన్ని సాధించిన తర్వాత యుద్ధాన్ని త్యజించిన మహా వీరుడు అశోకుడొక్కడేనని, చరిత్రకారులు అతణ్ని వేనోళ్ళ కొనియాడారు.

భేరీ ఘోషను ధర్మఘోషగా, యుద్ధ విజయానికి ప్రత్యామ్నాయంగా ధర్మ విజయాన్ని తన విధానంగా అశోకుడు ప్రకటించాడు. నైతికత, ధర్మ విశిష్టత సమ్మతంగా పరిపాలన సాగించాడు. మనుషులకే గాక, నోరు లేని మూగ జీవాలకు, వైద్య సదుపాయాలు కల్పించిన కారుణ్యమూర్తి అశోక చక్రవర్తి. తన వ్యక్తిగత జీవితంలో బౌద్ధాన్ని ఆచరించడమేకాక బౌద్ధమతాన్ని రాజ్యమతంగా ప్రకటించాడు. కానీ ప్రజలపై బలవంతంగా రుద్దలేదు. రాజ్యాన్ని, మతాన్ని విడదీసి మతాతీత లౌకిక పాలన సాగించాడు. సర్వమతసారాన్ని సంగ్రహించి, దాన్నే ధర్మంగా రూపుదిద్ది. ప్రజల ఆచరణకు ప్రతిపాదించిన మత సామరస్య పాలకుడు. ధర్మాచరణకు సామ్రాజ్యమంతటా శిలాశాసనాలు చెక్కించి, ధర్మసూత్రాలు వ్యాపింపచేసి, ధర్మ పరిరక్షణకు 'ధర్మ మహామాత్రులు' అనే అధికార్లని నియమించాడు. 'దేవానాం ప్రియ', 'ప్రియదర్శి' బిరుదులతో గణుతికెక్కిన అశోకుడు, బౌద్ధ మతాన్ని ఆసియాఖండమంతటా వ్యాపింపచేశాడు.



ఫ్రెంచి విప్లవం అత్యంత ప్రాధాన్యతను పొందింది.
కేవలం రాజకీయ విప్లవం కాకుండా, ఆర్థిక,
అంతర్జాతీయ పరిణామాలకు ఇది దోహదం చేసింది.
స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం- నినాదాలు ఫ్రెంచి
విప్లవం చేపట్టింది. అందుకు ఒక "టెన్నిస్ కోర్టు"
వేదికవ్వడం విచిత్రం.

# వారేవ్వా... టెన్నిస్ కోర్టు

**18** శతాబ్దంలో మూడు విప్లవాలు జరిగాయి. అవి పారిశ్రామిక, అమెరికన్, ఫ్రెంచి విప్లవాలు, ఇందులో ఫ్రెంచి విప్లవం అత్యంత ప్రాధాన్యతను పొందింది. కేవలం రాజకీయ విప్లవం కాకుండా, ఆర్థిక, అంతర్జాతీయ పరిణామాలకు ఇది దోహదం చేసింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం- నినాదాలు ఫ్రెంచి విప్లవం చేపట్టింది అందుకు ఒక "టెన్నిస్ కోర్టు" వేదికవ్వడం విచిత్రం.

అన్ని విప్లవాలకు మల్లే, ఫ్రెంచి విప్లవానికి, వివిధ రాజకీయ, ఆర్థిక సామాజిక కారణాలున్నా వాటిలో ముఖ్యమైనది నిరంకుశ రాజరికం. దీనికి ప్రజల దుర్భర ఆర్థిక పరిస్థితులు తోడయ్యాయి. రాచరిక వ్యతిరేకత తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆర్థికంగా, ప్రభుత్వం దివాళా తీసి, తీవ్ర సంక్షోభంలో పడింది. ఫ్రాన్స్ దేశాన్ని పరిపాలిస్తున్న బౌర్బన్ రాజ వంశీకుల గూర్చి చరిత్రలో ఒక నానుడి వాడుకలోకి వచ్చింది. ("బౌర్బన్ రాజులు గతాన్ని మర్చిపోయింది లేదు. గత అనుభవాల నుండి నేర్చుకొన్నదీ లేదు"). దేశం ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయట పడాలంటే ఒకటే మార్గం ఫ్రెంచి పార్లమెంటును సమావేశపర్చాలి. పార్లమెంటు శాసనాల ద్వారానే, కొత్త పన్నులు విధించాలి. ఫ్రెంచి పార్లమెంటు ఎస్టేట్స్ జనరల్. 175 సంవత్సరాలు పార్లమెంటును సమావేశ పరచకుండానే పబ్బంగడుపుకొంది ఫ్రెంచి రాజరికం. పరిస్థితులు విషమించడంతో పార్లమెంటును పిలపక తప్పలేదు. ఫలితంగా 1789వ సంవత్సరం మే నెల 5వ తేదీ నాడు సమావేశమవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

మూడంతస్తుల, నిచ్చెన మెట్ల పార్లమెంట్ స్టేట్స్ జనరల్ (పార్లమెంటు) మూడు వర్గాల ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ మూడింటిని మూడు ఎస్టేట్స్‌గా పిలుస్తారు. మొదటి ప్రభువర్గం, రెండవది మత వర్గం, కాగా మూడవది సామాన్యుల వర్గం. మొదటి రెం వర్గాలకు కలిపి, పార్లమెంటులో 600 మంది సభ్యులుండగా, మూడవ ఎస్టేట్‌లో 6( పైగా వున్నారు. మూడు వర్గాలకు వర్గప్రాతిపదికపై మూడు ఓట్లు. గతంలో ప్రభువర్గ మత వర్గంతో చేతులు కలిపి, తనకున్న రెండు ఓట్లతో, మూడవ ఎస్టేట్‌పై ఆధిక్యా సాధించి, సామాన్యుల వర్గాన్ని తమ సమస్యల పరిష్కారానికి తోడ్పడకుండా ఓడించేవా కానీ, ఈ సారి మూడవ ఎస్టేట్ సభ్యులు, ప్రజల విజ్ఞాపనలు తీసుకొని, వాటి పరిష్కా కోసం తుదికంటా నిలబడి పోరాడాలని గట్టిగా అనుకుని వచ్చారు. పార్లమెంట్‌లో ఎస్టే వారీగా కాకుండా తలకొక్క ఓటు లెక్కన పరిగణించాలని తీర్మానించారు. దీంతో మొద రెండు ఎస్టేట్ల గొంతులో వెలక్కాయ పడినట్లయింది. ఎస్టేట్స్ జనరల్ సమావేశం కొన్ని తీర్మానాలు ఆమోదించాలని పట్టు బట్టారు. ఫ్రాన్స్ దేశపురాజు, పదహారవ లూయి ఇది ససేమిరా నచ్చలేదు. ఆ రోజు చేసిన తీర్మానాల్లో, నిరంకుశత్వం నశించి, వ్య స్వాతంత్ర్యాన్ని సాధించే రాజ్యాంగాన్ని ఏర్పర్చాలన్నారు. పార్లమెంట్ క్రమం తప్పకుం సమావేశాలు నిర్వహించాల్సిందేనన్నారు. పన్నులు విధించి వసూలు చేసే హక్కు స్టే జనరల్‌కే ఉండాలని కోరారు. పన్నుల చెల్లింపులో ఎవరికీ మినహాయింపులుండరాద కోరారు. ప్రభు వర్గానికి సామాన్యులు ఏ విధమైన నజరానాలూ చెల్లించనవసరం లేద తీర్మానించారు. రాజు ఎడల విధేయత ప్రకటిస్తూ పార్లమెంటును సమావేశపరిచినందు కృతజ్ఞత తెలిపారు. ఆ తర్వాత నిర్వహించే సమావేశాల్లో మిగతా అంశాలు చర్చించాలనుకొ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఈ తీర్మానాలను మొదటి రెండు ఎస్టే అంగీకరించలేదు. ప్రతి సభ్యుడికి ఒక ఓటు అనే నిర్ణయాన్ని ఆమోదిస్తే, తమ ఆధిపత్య పోతుందని భావించి పార్లమెంటు సమావేశాల్లో, మూడవ ఎస్టేట్‌తో కలిసి కూర్చొ నిర్ణయాలు చేయడాన్ని ఒప్పుకోలేదు. ఫలితంగా మూడవ ఎస్టేట్ తనను జాతీయ అసెంబ్లీ ప్రకటించుకొంది. ఫ్రెంచి విప్లవానికిది మొదటి మెట్టు.

దీనికి మరో ఘటన, విప్లవారంభానికి దోహదం చేసింది. జాతీయ అసెంబ్లీ ప్రకటించుకొన్న మూడవ ఎస్టేట్ సభ్యులు 1789న జూన్ 20వ తేదీ నాడు తాము అంత ముందు సమావేశమై భవనానికెళ్ళారు. భవనం తలుపులు మూసున్నాయి. రిపేర్లు, ఇతర ఏర్పాట్లు జరుగుతున్నాయన్న బోర్డు ఆ భవన ద్వారాలకు వేలాడేశారు. ఇది చూ సభ్యులు ఖంగు తిన్నారు. అంతరార్థం అర్థమైంది. మూడవ ఎస్టేట్ సభ్యులు హాజ కాకుండా చేయడానికి పన్నిన పన్నుగడగా భావించారు. వారు వెంటనే పక్కన ఆవరణ వున్న టెన్నిస్ కోర్టులో సమావేశం జరిపి తమ అధ్యక్షుడు బెయిలీ నాయకత్వంలో శపథ చేశారు. తాము ఎప్పుడూ, ఏ క్లిష్ట పరిస్థితుల్లోనూ విడిపోరాదని. కొత్త రాజ్యాంగం రచిం వరకూ సంఘటితమై వుంటామనీ, సభ్యులందరూ, ప్రతిన బూనారు. దీంతో ఫ్రెం విప్లవమారంభమయింది. టెన్నిస్ కోర్టు శపథం ఫ్రెంచి విప్లవారంభానికి నాందిపలికి ప్రపంచ చరిత్రనే మలుపు తిప్పింది.



జలియన్‌వాలాబాగ్ వెళ్ళి పిడికిటితో మట్టి తీసుకొని,
దేశం కోసం త్యాగదీక్ష బూనాడు. పెళ్ళి ప్రస్తావన
వచ్చినప్పుడు, "పరాధీన దేశంలో పెళ్ళంటూ జరిగితే,
మృత్యువే నా వధువు " అని ప్రకటించాడు.

# స్వేచ్ఛాజ్వాలగా మారిన యువకుడు

**ప**రాయి పాలన నుండి దేశాన్ని విముక్తి చేసి, ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్రాలతో పాటు, ఆర్థిక సమానత్వాన్ని, సామాజిక న్యాయాన్ని అందించాలన్న అకుంఠిత దీక్షతో, ప్రాణాలనర్పించి అమరజీవిగా నిల్చిపోయిన షహీద్ భగత్‌సింగ్ నేటికీ ప్రజల మనసుల్లో సజీవంగా మిగిలిపోయాడు. ఉడుకునెత్తురుతో వురకలు వేస్తూ, మరో ప్రపంచాన్ని ఆవిష్కరించే మహాయజ్ఞంలో భాగస్వాములయ్యే యువతకు భగత్‌సింగ్ నేటికీ ప్రేరణ కల్గిస్తూనే వున్నాడు. ఇంతకూ ఈ భగత్సింగ్ ఎవరు ? ఆ మహావీరుడి జ్ఞాపకాలు ఇంకా మన మస్తిష్కంలో తడి ఆరకుండా ఎందుకు మిగిలివున్నాయో తెల్సుకుందాం. 23 ఏళ్ళ వయసులోనే చిరునవ్వుతో వురికంబమెక్కిన షహీద్ భగత్ సింగ్ జీవితాన్ని మలుపు తిప్పిన ఘటన(లు) ఏమిటి ?

1907లో పంజాబ్‌లో సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. తండ్రి కిషన్ సింగ్, పిన తండ్రులు అజిత్ సింగ్, స్వరణ్‌సింగ్‌లు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధులే. కారగారాల పాలయినవారే. వారిలో ముఖ్యంగా భగత్‌సింగ్ చిన్నాయన అజిత్‌సింగ్ రైతు ఉద్యమ నాయకుడు. స్వదేశీ ఉద్యమకాలంలో, 1906-07 సంవత్సరాల్లో కాలనైజేషన్ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటంలో ముఖ్య పాత్ర వహించాడు. మాజీ సైనికులకిచ్చిన భూములపై, పూర్తి హక్కులివ్వకుండా ఈ చట్టం నిషేధించింది. నీటి తీరువాను, భూమి శిస్తును ఇంకా పెంచి కరువు, కాటకాలతో సతమతమవుతున్న

రైతాంగం జీవితాలను దుర్భరం చేసింది. వీటికి వ్యతిరేకంగా తలెత్తిన రైతాంగ ఉద్యమానికి, అజిత్‌సింగ్ సమర్థవంతంగా నాయకత్వం వహించాడు. ఆంగ్ల ప్రభుత్వాన్ని గడగడ లాడించాడు. ప్రభుత్వం అజిత్‌సింగ్‌ను, పంజాబ్ సింహంగా పేరొందిన లాలాలజపతిరాయ్‌లను నిర్బంధించింది. వారిని దేశ బహిష్కరణకు గురి చేసి బర్మాలోని మాండలే జైలుకు పంపింది. తన పినతండ్రి అజిత్‌సింగ్ కార్యకలాపాలు, త్యాగనిరతి, నిర్భయత్వం, దేశం కోసం దిక్కూ మొక్కూ లేని రైతాంగం కోసం చేసిన పోరాటం, దేశ బహిష్కరణకు గురి కావడం, భగత్‌సింగ్‌ను ఉత్తేజపర్చాయి. కార్యోన్ముఖుణ్ణి చేశాయి. అజిత్‌సింగ్ ఆయనకు ఆదర్శ పూరిత వీరుడయ్యాడు. తన పిన తండ్రి చూపిన దారిలోనే, తన ప్రజల విముక్తి కోసం జీవితాన్ని అర్పించాలనుకొన్నాడు.

జలియన్‌వాలాబాగ్ వెళ్ళి పిడికిటితో మట్టి తీసుకొని, దేశం కోసం త్యాగదీక్ష బూనాడు. పెళ్ళి ప్రస్తావన వచ్చినప్పుడు, "పరాధీన దేశంలో పెళ్ళంటూ జరిగితే, మృత్యువే నా వధువు " అని ప్రకటించాడు. మార్క్సిస్టు సిద్ధాంతాలతో, రష్యా విప్లవ ఆశయాలతో ఉత్తేజితుడై, హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను, హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌గా మార్చి దానికి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. వ్యక్తిగత హింసా చర్యలను, టెర్రరిస్టు పోకడలను విడనాడి, విప్లవ సిద్ధి కోసం, వజ్రపునాదిని యేర్పర్చుకున్నాడు. ఆ సమయంలో, 1928 అక్టోబర్‌న లాహోర్‌కు సైమన్ కమిషన్ వచ్చింది. ఆ సందర్భంగా జరిగిన ప్రదర్శనలో జరిపిన లాఠీ ఛార్జీలో లాలాలజపతి రాయ్ దెబ్బలు తిని మరణించారు. భగత్‌సింగ్, అతడి అనుచరులతో పాటు, దేశం నివ్వెర పోయింది. ఆనాటి లాఠీ ఛార్జీకి ముఖ్య కారకుడు శాండర్స్. ప్రజల్ని అత్యంత కూర్రంగా హింసించి, అందరి చేతా అసహ్యంపబడుతున్న పోలీస్ సీనియర్ సూపరింటెండెంట్ స్కాట్. స్కాట్‌ని చంపాలనుకుని శాండర్స్‌ను చంపారు. అందులో ప్రధాన పాత్ర భగత్‌సింగ్‌దే. ఆ పిమ్మట కేంద్ర శాసన సభలో బటుకేశ్వర్‌దత్‌తో కలిసి 'పబ్లిక్ సేఫ్టీ బిల్లుకు' వ్యతిరేకంగా, బాంబులు వేసి, కరపత్రాలు విసిరారు. డౌన్‌విత్ బ్రిటిష్ ఇంపీరియ లిజం, ఇంక్విలాబ్ జిందాబాద్, అంటూ నినాదాలు చేసి, పారిపోడానికి అవకాశమున్నా, అరెస్టు చేసేదాకా నిర్భ యంగా నిలబడ్డారు. ఆ తర్వాత నేరమోపడం, శిక్ష విధించడం జరిగిపోయింది. " నేను స్వేచ్ఛా జ్వాలను" అన్న భగత్‌సింగ్ దయాభిక్ష అడగలేదు. దైవ నిర్ణయంపై భారం మోపలేదు. మతాన్ని వదిలి నాస్తికుడయ్యాడు. మతానికి, రాజకీయంగా ముడి పెట్టడం సరికాదని ఆనాడే భగత్‌సింగ్ చెప్పాడు 1931 మార్చి 23 సాయంకాలం 7 గంటలకు ఆయన్ను ఉరితీశారు. భగత్ సింగ్ మరణానికి దేశం యావత్తు అట్టుడికి పోయింది. ప్రజలు అన్నం ముట్టలేదు. యువకులు విద్యాలయాలకు వెళ్లడం మానేశారు. యావత్ ప్రజానీకం నిత్య కార్యకలాపాలు పక్కన పెట్టారు. "భగత్ సింగ్ నేడు వ్యక్తి కాదు. సంకేతం. దేశాన్ని ఆవేశించిన విప్లవోత్సాహ చిహ్నం" అని ఆ మార్నాడే కరాచీలో సమావేశమైన కాంగ్రెస్ కార్యవర్గం పొగడక తప్పలేదు 1905 నుండి "వందేమాతరం" స్వాతంత్ర్య సంగ్రామ మంత్రంగా మార్చుకొన్న జాతికి, భగత్ సింగ్ పదునైన కొత్త నినాదం అందించాడు. అదే 'ఇంక్విలాబ్ జిందాబాద్.



స్టాలిన్ గ్రాడ్ యుద్ధం రెండవ ప్రపంచ యుద్ధ గమనంలో పెద్ద టర్నింగ్ పాయింట్. హిట్లర్ పతనం దాంతోనే ఆరంభమైంది. ఆ యుద్ధమే అనేక మంది కవులను, కళాకారులను ప్రపంచం మొత్తంగా ఉత్తేజపరిచింది. అప్పుడే మహాకవి శ్రీ శ్రీ - "గర్జించు రష్యా! గాండ్రించు రష్యా! పర్జన్య శంఖం పలికించు రష్యా!", అంటూ కవితాగానం చేశాడు.

# హిట్లర్‌ను సాగనంపిన యుద్ధం

అపారమైన సైనిక శక్తితో, దురహంకారపూరిత జాతి స్వచ్ఛత, జాతి విద్వేష సిద్ధాంతాలతో, ప్రపంచాన్నంతటినీ తన ఏలుబడిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించి, రెండవ ప్రపంచ యుద్ధానికి కారణ భూతుడైన హిట్లర్ పతనం ఏ మలుపులో ప్రారంభమైందో తెలుసుకుందాం. మొదటి ప్రపంచయుద్ధం ముగిసిన ఇరవై యేళ్ళ వ్యవధిలోనే రెండవ ప్రపంచ యుద్ధం (1939) ఆరంభమవడం ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపింది. హిట్లర్ నాయకత్వంలో జర్మనీలో నాజీజం, ముస్సోలినీ నేతృత్వంలో ఇటలీలో ఫాసిజం తలెత్తాయి. పరమ కిరాతక, భయంకర నియంతృత్వ సిద్ధాంతాలతో, వీరిద్దరూ ప్రపంచాధిపత్యం కోసం ఉవ్విళ్ళూరారు. జర్మనీలో హిట్లర్ యూదు జాతీయులను ద్వేషించి, ఒక కోటి ముప్పైలక్షల మందిని గ్యాస్ చేంబర్స్‌లో, కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో పొట్టన బెట్టుకున్నాడు. ఈ మానవ మారణ హోమానికి తోడుగా, బలమైన ప్రతిపక్షంగా వున్న కమ్యూనిస్టుల్ని నిందలు మోపి నిరంకుశంగా హతమార్చి, నిశ్శేషం చేశాడు. దేశంలో యువకులను చేరదీసి, ప్రపంచంలో జర్మన్ జాతి (ఆర్యజాతి) అత్యుత్తమమైనదని, మనుగడసాగించి, ప్రపంచాన్ని శాసించే

హక్కు వారికొక్కరికే వున్నదనీ నమ్మ బలికాడు. సైనిక యంత్రాన్ని, అత్యంత శక్తివంతంగా నిర్మించి, మిలియన్ల సైన్యాన్ని ఏర్పర్చి యుద్ధానికి కాలు దువ్వాడు. పశ్చిమ రాజ్యాలు- ఇంగ్లండ్, ఫ్రాన్స్ మొదలగునవి- చూసీ చూడనట్లు ప్రవర్తించి, లొంగుబాటు తనాన్ని ప్రదర్శించాయి. అప్పట్లో రష్యా సోషలిస్టు దేశం దాని అధినేత జోసెఫ్‌స్టాలిన్. పశ్చిమ దేశాలను జర్మనీ కార్యకలాపాలు, యుద్ధ కాంక్షల గురించి స్టాలిన్ హెచ్చరించినా ప్రయోజనం లేకపోయింది. పశ్చిమ రాజ్యాలపై హిట్లర్‌ను ఈసడింపుతో కూడిన తృణీకర భావముంది. వారిని క్రిమికీటకాలకంటే హీనంగా పరిగణించడమే కాకుండా, బహిరంగంగా ప్రకటించాడు కూడా. హిట్లర్‌కు రష్యాపై ద్వేషం. కమ్యూనిజమంటే సింహస్వప్నం. విపరీతమైన భయం. తన ప్రథమ శత్రువు రష్యాగా భావించాడు. అయినా పైకి ప్రకటించలేదు. స్టాలిన్‌కు తెలుసు, హిట్లర్ రష్యాపై దండెత్తి తీరుతాడని, అందుకని వ్యూహాత్మకంగా, వ్యవధి పొందడం కోసం, ఆలోగా, దేశాన్ని యుద్ధనెదుర్కోవడానికి సిద్ధం చేయడం కోసం హిట్లర్‌తో మైత్రి సంధి చేసుకున్నాడు.

హిట్లర్ 1939లో పోలెండ్‌ను ఆక్రమించాడు. పశ్చిమరాజ్యాలు మేల్కొన్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభం, ఫ్రాన్స్ ఒక్క తుపాకీ గుండు గూడా పేల్చకుండానే లొంగి పోయింది. ఇక, తర్వాత సోవియట్ రష్యా సరిహద్దుల్లో హిట్లర్ సైన్యాన్ని మోహరించాడు. రష్యా నుండి ఎలాంటి సమాధానాన్ని ఆశించకుండానే, జూన్ 21, 1941 సంవత్సరం యుద్ధం ఆరంభమైంది. నాలుగు నెలల్లో రష్యాను ఓడిస్తానని, ఆ తర్వాత రష్యాలోని అపారమైన పెట్రోలియం, రవాణా వనరులు స్వాధీనం చేసుకొంటానని హిట్లర్ ప్రగల్భాలు పలికాడు. 180 డివిజన్ల భారీ సైన్యం పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి, వేల విమానాలు, ట్యాంకులు, ట్రక్కులతో, నాలుగు నెలల్లో రష్యాలోని అపారమైన బొగ్గు, ఉక్కు గనులను, పరిశ్రమలను, సారవంతమైన వ్యవసాయి భూములను, సంపదను ఆక్రమించాడు. కాని లెనిన్ గ్రాడ్, మాస్కో లాంటి ముఖ్య నగరాలు ఇంకా చేతికి చిక్కలేదు. ఇంతలో కొంచెం ముందుగానే, రష్యాలో శీతాకాలం వచ్చేసింది. భయంకరమైన నెత్తురు గడ్డకట్టుకుపోయే చలి ఎముకలు కొరుక్కుతింటోంది. జర్మన్ సైనికులకు వెచ్చదనాన్నిచ్చే ఉన్ని దుస్తులు లేవు. యంత్రాలు చల్లబడి పని చేయడం లేదు. రవాణా సరుకులు మంచు కింద కూరుకుపోయాయి. జర్మన్లు విధిలేక తిరుగు ముఖం పట్టారు. రష్యన్‌సైన్యం వెనకనుండి దాడి. హిట్లర్ పతనానికి ఇది మొదటి మెట్టు ఇప్పటి నుండే ప్రపంచ యుద్ధం దిశ మారింది. కానీ, హిట్లర్ పట్టు వదలకుండా మళ్ళీ 1942 వేసవిలో మరో యుద్ధానికి తలపడ్డాడు.

## గర్జించు రష్యా, గాండ్రించు రష్యా

ఇదే ప్రపంచ చరిత్రలోనే అపూర్వంగా చెప్పుకోదగిన స్టాలిన్ గ్రాడ్ యుద్ధం. రష్యన్లు ప్రతి అంగుళం భూమికోసం, ప్రతి ఇంట్లో పెరట్లో వీధిలో మెట్లపై, వీరోచితంగా పోరాడిన దేశభక్తి యుద్ధం. ఇది స్టాలిన్ నాయకత్వంలో, తీవ్రమైన జన, ధన నష్టాలకు గురవుతూ. మొక్కవోని దీక్షతో ఎదురునిల్చి ప్రతిఘటించిన ఎర్రసైన్యం త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. శత్రు సైన్యాలకు తాగడానికి నీళ్ళుదొరక్కుండా చేశారు. తిండిలేదు. నవంబర్

అంతానికి జర్మన్ సైన్యాన్ని మార్షల్ ఝుకోవ్ చక్రబంధంతో చుట్టుబుట్టాడు. అన్ని వైపులనుండి దాడి ఆరంభమైంది. జర్మన్ సైన్యం తిరోగమనం ఆరంభించింది. తొమ్మిది లక్షల మంది జర్మన్ సైనికులు హతమయ్యారు. 18 లక్షల మంది బందీలుగా చిక్కుబడ్డారు. జర్మనీకి చెందిన 10 వేల విమానాలు, 17 వేల టాంకులు, 75 వేల మిలటరీ ట్రక్కులు ధ్వంసమయ్యాయి. దీంతో జర్మనీ వెన్నెముక విరిగినట్లయింది. రష్యా కూడా తీవ్ర నష్టానికి గురయింది. రష్యా జనాభాలో 14 శాతం ప్రజలు ప్రాణాలు కోల్పోగా, జాతీయ సంపదలో 30 శాతం నష్టమైంది. 1710 పట్టణాలు, 70 వేల గ్రామాలు ధ్వంసమయ్యాయి. ఏమయితేనేం స్టాలిన్ గ్రాడ్ యుద్ధం రెండవ ప్రపంచ యుద్ధ గమనంలో పెద్ద టర్నింగ్ పాయింట్. హిట్లర్ పతనం దాంతోనే ఆరంభమైంది. ఆ యుద్ధమే అనేక మంది కవులను, కళాకారులను ప్రపంచం మొత్తంగా ఉత్తేజపరిచింది. అప్పుడే మహాకవి శ్రీ శ్రీ- "గర్జించు రష్యా,! గాండ్రించు రష్యా ! పర్జన్యశంఖం పలికించు రష్యా !", అంటూ కవితాగానం చేశాడు.



*వ్యాహ్యాళికి బయలుదేరి పురవీధుల గుండా తరలివెడుతున్న సిద్ధార్థుడు ఒక పండు ముసలివాణ్ణి, రోగ పీడితుణ్ణి, మరణావస్థను చూశాడు. నిర్జీవంగా పడివున్న శవాన్ని చూశాడు. ఈ దృశ్యాలు అతడిని పూర్తిగా కలచివేశాయి. దుఃఖ భాజనుడయ్యాడు. మనశ్శాంతి కొరవడింది. సకల సౌకర్యాలున్న రాజ ప్రాసాదం కానీ, గాఢంగా ప్రేమించిన భార్య అందాలరాణి యశోధర కానీ, అతడి దుఃఖాన్ని రూపుమాపలేకపోయాయి.*

# మరణం చూసిన మనస్సు...

క్రీ.పూ. 6వ శతాబ్దం ప్రపంచ వ్యాప్తంగానే మతపరంగా నిరసనలకు, తిరుగుబాట్లకు కొత్త మతశాఖలకు పేరెన్నికగన్నది. భారతదేశంలో వర్ధమానుడు, బుద్ధుడు, చార్వాకుడు చైనాలో కన్‌ఫ్యూషియస్, పర్షియాలో జొరాస్టర్ యింకా ఎందరో తమ సమకాలీన సమాజాల్లో మతాన్ని సరళీకరించి, ముందున్న పరిస్థితులకు భిన్నంగా, ప్రజలకు చేరువగా చేర్చి మానవజీవితంలో నిష్టకు, నియమాలకు, నైతికతకు చోటు కల్పించారు. సత్యనిరతితో క్రమపాలనతో, భూతదయతో ప్రశాంత జీవనం సాగిస్తే, జీవితం సుఖమయమవుతుందన్న వారి భావజాలం వల్ల యజ్ఞయాగాదులనుండి, కర్మక్రతువుల నుండి, పూజాపునస్కారాల నుండి, పూజారులు, పురోహితుల నుండి మతం విముక్తి పొందింది.

పై ధోరణికి భారతదేశంలో బుద్ధుడు ప్రతీకగా నిలుస్తాడు. బుద్ధుడి అసలు పేరు సిద్ధార్థుడు. క్షత్రియుడు, రాజవంశీకుడు, యువరాజు. తండ్రి శుద్ధోధనుడు, తల్లి మాయాదేవి. ప్రాచీన భారతదేశంలో అప్పుడే చిన్న, చిన్న రాజ్యాలు ఏర్పడుతున్నాయి

శాక్య వంశానికి చెందిన సిద్ధార్థుడు కపిలవస్తు రాజ్యానికి వారసుడు. సకల భోగ భాగ్యాలతో పెరిగాడు. విలువిద్య, మల్లయుద్ధం, వేటలలో ఆరితేరాడు. పదహారేండ్ల వయసులో యశోధరతో వివాహమైంది. సుఖసంతోషాలతో తులతూగుతున్న సిద్ధార్థుడి జీవితంలో జరిగిన ఒక సంఘటన అతడి జీవితాన్నే మలుపు తిప్పింది.

వ్యాహ్యాళికి బయలుదేరి పురవీధుల గుండా తరలివెదుతున్న సిద్ధార్థుడు ఒక పండు ముసలివాణ్ని, రోగ పీడితుణ్ని, మరణావస్థను చూశాడు. నిర్జీవంగా పడివున్న శవాన్ని చూశాడు. ఈ దృశ్యాలు అతడిని పూర్తిగా కలచివేశాయి. దు:ఖ భాజనుడయ్యాడు. మనశ్శాంతి కొరవడింది. సకల సౌకర్యాలున్న రాజ ప్రసాదం కానీ, గాఢంగా ప్రేమించిన భార్య అందాలరాణి యశోధర కానీ, అతడి దు:ఖాన్ని రూపుమాపలేకపోయాయి. సుందరమయమైన జీవితంలో చోటుచేసుకున్న ఈ దు:ఖం నుండి ప్రజలకు విముక్తి లేదా ? విముక్తి కల్పించలేమా ? ఏమిటి పరిష్కారం ? మనుషులకు దూరంగా ఉంటూ దీర్ఘాలోచనలో లీనమైన సిద్ధార్థుడికి కుమారుడు పుట్టాడు. రాహులుడని నామకరణం చేశారు. పుత్రజననం, సిద్ధార్థుడికి ఆర్తిని, మానసిక వ్యధను తీర్చకపోగా, వృద్ధి చేసింది. ఇక లాభం లేదనుకున్నాడు.

ఒకనాటి అర్ధరాత్రి ప్రశాంతత నిండుకున్న సమయం. ప్రపంచం గాఢసుషుప్తిలో వుంది. నిద్రిస్తున్న యశోధరను పొదివిపట్టుకొని, రాహుల్ ముఖంమీద చెరగని చిర్నగవుతో నిద్రిస్తున్నాడు. గుండెదిటవు చేసుకున్నాడు సిద్ధార్థుడు. రథచోధకుడు చెన్నడిని పిలిచి, ప్రాపంచిక జీవితంలోని పరమార్థాన్ని కనుగొనడానికి సర్వసంగపరిత్యాగం గావించాడు. దీన్నే 'మహాభినిష్క్రమణం' అంటారు. ఇదే సిద్ధార్థుడి జీవితాన్ని మలుపుతిప్పి, ఆ తర్వాత బోధివృక్షం కింద జ్ఞానోదయం పొంది, బుద్ధుడైనాడు. ముఖ్యంగా నాలుగు విషయాలు చెప్పాడు. "జీవితంలో దుఃఖముంది. దానికి హేతువు వాంఛ. దుఃఖాన్ని నివారించే మార్గం ప్రబోధిస్తాను". అన్నాడు. అదే నిర్వాణం. అది అష్టాంగికమార్గంగా రూపుదిద్దుకొంది. మత సంబంధమైన యజ్ఞాలు, యాగాలు, క్రతువులు, భగవత్ అర్పితాలు అవసరం లేదన్నాడు. రాగద్వేషాలను, అసూయ, అక్రమ ఆలోచనలను త్యజించాలన్నాడు. వైదికమతంలో చోటు చేసుకున్న కుల వ్యవస్థను ఖండించాడు. వైదిక మతాధిపత్యాన్ని వ్యతిరేకించిన ప్రజా సంస్కర్త బుద్ధుడు. సత్యం, అహింస, సరైన ఆలోచనలు, రుజువర్తనం, పరుల సొమ్ము ఆశించకపోవడం మొదలైన సాదా, సీదా నియమాలతో, సరళ సుందర జీవనం సాగించమని ఉద్బోధించాడు. మన ఎదుటవున్న భౌతిక ప్రపంచమే యదార్థమనీ, అర్థంకాని, అంతుచిక్కని పారలౌకిక విషయాలు పట్టించుకోనవసరం లేదన్నాడు. నాస్తికుడు కాదు గానీ, బుద్ధుడు నిశ్చయంగా సంశయాత్మే. అనేకానేక చెడుగులతో, అర్థం, పర్థం లేని మతనియమాలతో భారతీయ సమాజం అల్లాల్లాడిపోతున్నపుడు, దిక్కూ దిశాలేక ప్రజలు ఆత్మ సంక్షోభానికి గురయినపుడు, వారికి హేతుబద్ధ, ఆచరణాత్మక జీవితాన్ని ప్రసాదించిన బుద్ధుడిని కన్న గర్వించదగ్గ భూమి మనది.



*తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అత్యంత తక్కువ స్థాయిలో వుండగా, సామాజికంగా హీనస్థితిలో ఉంది. అయినా జాషువాకు ... విలక్షణ సంస్కారం అబ్బింది. తల్లిదండ్రుల అంతర్వర్ణ వివాహం వల్ల కావచ్చు లేదా, తన చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం వల్లనూ కావచ్చు. క్రైస్తవ మిషనరీల ప్రభావం, బాల్యంలో తాను నేర్చుకున్న గొల్ల సుద్దులలోని సెక్యులర్ దృక్పథం, పరమత సహనం జాషువా వ్యక్తిత్వంపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని కల్గించాయి. అన్నింటికీ మించి, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసినవి మరో రెండు వున్నాయి. ఒకటి, అంటరానితనం, రెండు కటికదారిద్ర్యం.*

# దళితాకాశపు ధృవతార

**నేటి** దళిత వాదం, దళిత సాహిత్యం ప్రాచుర్యంలోకి రాక మునుపే గుర్రం జాషువా తన పదునైన కలంతో, స్ఫూర్తిదాయక, సృజనాత్మక కవిత్వాన్ని రచించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్న జాషువా. దళిత కుటుంబంలో పుట్టారు. కడుపేదవాడు. ఇప్పటికీ గ్రామసీమల్లో భూస్వామ్య సంస్కృతి తాలూకు అవశేషాలు ఆధిపత్యం వహిస్తూ, వర్గరీత్యా, వర్ణరీత్యా సమాజంలో అట్టడుగునవున్న ప్రజానీకాన్ని పీడిస్తూవుండడం గమనిస్తున్నాం. రెండు గ్లాసుల వివక్షతో పాటు, వూరికి దూరంగా వెలివాడల్లో కటిక దారిద్ర్యంతో మగ్గుతున్న అభాగ్యుల జీవితాల దయనీయ స్థితిగతులు చూస్తూనే వున్నాం. విద్యకు, వైద్యానికి సరే, కనీస అవసరాలైన గూడు, గుడ్డకు కూడా నోచుకోని అభాగ్యుల

జీవితాలు ఎండమావులుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి యాభై యేళ్ళు పై బడ్డాక కూడా ఇలా ఉంటే, వంద సంవత్సరాలకు పూర్వ, సమాజం యే స్థితిలో వుందో, నిమ్న జాతులనబడేవారి జీవన సరళి ఎంత దుర్భరంగా వుండేదో వూహాకందని విషయమేమీకాదు. అలాంటి పరిస్థితుల్లో 1895 సెప్టెంబర్ 28 వినుకొండలో జాషువా జన్మించాడు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అత్యంత తక్కువ స్థాయిలో వుండగా, సామాజికంగా హీనస్థితిలో ఉంది. అయినా జాషువాకు ... విలక్షణ సంస్కారం అబ్బింది. తల్లిదండ్రుల అంతర్వర్ణ వివాహం వల్ల కావచ్చు లేదా, తన చుట్టూ ఉన్న పరిసరాల ప్రభావం వల్లనూ కావచ్చు. క్రైస్తవ మిషనరీల ప్రభావం, బాల్యంలో తాను నేర్చుకున్న గొల్ల సుద్దులలోని సెక్యులర్ దృక్పథం, పరమత సహనం జాషువా వ్యక్తిత్వంపై చెప్పుకోదగ్గ ప్రభావాన్ని కల్గించాయి. అన్నింటికి మించి, ఆయన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసినవి మరో రెండు వున్నాయి. ఒకటి, అంటరానితనం, రెండు కటికదారిద్ర్యం. దరిద్రం లోని 'రుచి' ని, అంటరానితనంలోని 'అవమానాన్ని' జాషువా స్వయంగా అతి దయనీయంగా అనుభవించినందువల్లనే, వాటి రాపిడి నుండి ఆయన వ్యక్తిత్వం వికసించింది.

జాషువా ఎన్నో బాధలు పడ్డాడు. కష్టాల కడలిని అలుపెరుగక ఈదాడు... అవమానాలకు గురయ్యాడు. వీటన్నిటిని ఎదుర్కొనే శక్తి తనకు వ్యక్తిగతంగా వున్నా, సమాజం విధించిన అంక్షల వల్ల ధిక్కరించి, తిరుగుబాటు చేయలేక, మౌనంగా భరించాడు. కానీ, జాషువాలో అంతర్మథనం కొనసాగుతూనే ఉంది. కోపం, ప్రతీకారం గూడుకట్టుకొన్నా, ఏం చేయాలో తోచలేదు. తనకు జరిగిన అవమానాల వల్ల, ఎలాంటి మానసిక పరివర్తనకు లోనయ్యాడో. రెండు మూడు ఘటనలు ఆయన జీవితాన్ని ఎలా మలుపు తిప్పాయో చూద్దాం. వినుకొండలో ఒక రోజు నాటక ప్రదర్శన జరుగుతోంది. నాటకాలు, సంగీతం, చిత్రలేఖనం మొదలైన శ్రవ్య, ప్రదర్శన కళల్లో అభినివేశం వున్న జాషువా, నాటకం చూడాలన్న అభిలాషతో వెళ్లాడు. ఉత్సాహంగా , టిక్కెట్టు కొనడానికి వెళ్లి ఇమ్మంటాడు. "నీవు అస్పృశ్యుడివి. నీకు నాటకం చూసే అర్హతలేదు. వెళ్ళిపో అని నిర్వాహకులు అన్నారు. జాషువా పసివయసు, సున్నితమైన మనసు గాయపడింది. కులరక్కసి క్రూరత్వం అర్థం కాని జాషువా ఏడుస్తూ ఇంటికెళ్లాడు. తన దుస్థితికి వ్యాకులపడ్డాడు. ఇంతలోనే మరోఘటన. అది ఒక పండుగ రోజు. తోటి పిల్లలు తలంటు స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, రుచికరమైన వంటకాలు తింటూ, ఆనందిస్తున్నారు. జాషువా, ఆయన తమ్ముడు ఇశ్రాయేలు, ఇద్దరూ తమకు కొత్త బట్టలు కావాలని, తినడాన్కి మిఠాయిలు పెట్టమని అడిగారు. చేతిలో చిల్లిగవ్వలేని తల్లిగుండె తల్లడిల్లింది. అప్పుడా వీధిలో పళ్లెం నిండా తినుబండారాలు పెడుతున్న ఒక అమ్మాయి కొన్ని మిఠాయిలను నేలపై జారవిడుచుకోగా అది చూసిన జాషువా వెంటనే వెళ్ళి వాటిని తీసుకొని తిన్నాడు. ఇది చూసిన తల్లి పుట్టెడు దుఃఖంతో కుమిలిపోయింది. కన్న బిడ్డలకు పండుగనాడు పట్టెడన్నం పెట్టలేకపోయానన్న బాధ ఆమెను దహించివేసింది. ఈ సంఘటన జాషువా వ్యక్తిత్వాన్ని మలచడంలో అప్పటి సామాజిక స్థితిని ఆకళింపు చేసుకోవడంలో తోడ్పడింది. మరో ఘటన కూడా, ఆయన మనో ఫలకంపై చెరగని ముద్ర వేసింది.

జాషువా చదువుకొంటున్న బడిలో, తన తరగతిలో వైశ్యబాలుడిని అనుకోకుండా తాకాడు. దీన్నొక మహాపరాధంగా , చేయరాని పాపకార్యంగా భావించారు. అది చూస్తున్న సవర్ణబాలురు. వారి ప్రోద్బలంతో, ఆ వైశ్య బాలుడు జాషువాను బలంగా చెంపదెబ్బ కొట్టాడు. అందరూ సంతోషంగా చప్పట్లు కొట్టి గెలిచేశారు. సున్నితమైన జాషువా వ్యక్తిత్వం దెబ్బతింది. తిరిగి కొట్టగలిగిన శక్తి వున్నా, నిగ్రహంగా వుండిపోయాడు. ఇంటికెళ్ళి తల్లితో ఏడుస్తూ చెప్పాడు. తల్లి ఓదార్చింది. ఒళ్ళో పడుకోపెట్టుకొని, తలనిమురుతూ, సమయసందర్భాలను, కాలపరిస్థితులను నెమ్మదిగా వివరించి చెప్పింది. ఈ దేశంలో పంచములకు ఇల్లు, వాకిలి, మానవత్వాల్ని మాత్రమే కాకుండా, తుదకు 'జన్మను' కూడా, సమాజం హుళక్కి చేసిందని తన తల్లి చెప్పిన మాటలను, జాషువా 'నా కథలో' రాసుకున్నాడు.

పై ఘటనలు జాషువాని కలచి వేశాయి. ఆలోచింపచేశాయి. ఆయన జీవితాన్నే మార్చివేశాయి. ప్రతీకార జ్వాలతో వూగిపోయాడు. తమాయించుకొని సామాజిక దురన్యాయాన్ని అర్థం చేసుకున్నాడు. అవమానాలకు ప్రతిగా, కసితో తిరుగు దెబ్బతీయవచ్చు. కానీ అలా చేయలేదు. "దారిద్ర్యాన్ని, కులభేదాన్ని కూడా చీల్చి వేరుమనిషిగా నిరూపించుకోదలిచాను. వాటిపై కత్తి కట్టాను. అయితే నా కత్తి కవిత, ఆ కవితా కత్తికి సంఘంపై ద్వేషం లేదు. దాని విధానంపై ద్వేషం" అని ప్రకటించిన జాషువా తెలుగు సాహిత్యంలో అజరామరంగా నిలిచిపోయాడు.



ఆస్ట్రియా యువరాజు దంపతుల హత్యతో... ఆస్ట్రియాకు అవకాశం లభించింది. హంతకులు నిజానికి ఆస్ట్రియాదేశ వాసులే! అయినా వారు సెర్బియా జాతికి చెందిన వారు కావడంతో ఆవేశాలు పెరిగిపోయాయి. ఈ వార్త ఆస్ట్రియా మొత్తం వ్యాపించింది. సెర్బియన్లను, 'హంతకజాతి' గా అభివర్ణించింది ఆస్ట్రియా. ఈ హత్యకు సెర్బియా బాధ్యత వహించాలని ప్రకటించింది. వార్తా పత్రికలన్నీ యుద్ధ నినాదాలతో నిండిపోయాయి.

# హత్య సాకుతో మొదటి ప్రపంచ యుద్ధం

అది జూన్ 28, 1914...

ఆస్ట్రియా దేశపు యువరాజు ఆర్చిడ్యూక్ ఫ్రాన్సిస్ ఫర్డినాండ్, తన భార్యతో కలిసి బోస్నియా దేశ రాజధాని సెరాజివో నగర వీధుల్లో వెళుతున్నాడు. అకస్మాత్తుగా... వాళ్ళిద్దరిపై కాల్పుల వర్షం కురిసింది. దాంతో వారిరువురూ మృత్యువాతబడ్డారు.

పందొమ్మిదవ శతాబ్దాంతానికి పెట్టుబడిదారీ విధానం గుత్త స్వభావాన్ని సంతరించుకొని సామ్రాజ్యవాదంగా రూపుదిద్దుకుంది. జర్మనీ, ఇటలీ దేశాలు 1870లో ఏకీకరణ సాధించాయి. వలసల వేటలో ఇంగ్లండు, ఫ్రాన్సులతో పోటీపడ్డాయి. ఫిలిప్పీన్స్‌ను అమెరికా ఓడించింది. తన సామ్రాజ్యవాద స్వభావాన్ని రుజువు చేసుకుంది. ఇక దూరప్రాచ్యంలో అతి చిన్న దేశమైన జపాన్, ఆర్థికంగా బలపడింది. సైనిక శక్తిగా ఎదిగింది. చైనాను ఓడించింది. 1905లో రష్యాను కూడా ఓడించింది. ఈ ఘటన ప్రపంచాన్నే అబ్బురపరిచింది. ఈ సంఘటనలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సామ్రాజ్య వాదదేశాల మధ్య

రోజురోజుకూ వలసల కోసం, ప్రపంచాధిపత్యం కోసం పోటీ తీవ్రతరమైంది. ఇది ఏ పరిణామాలకు దారితీస్తుందన్నదే అందర్నీ కలవరపరుస్తున్న సమస్య.

ఇరవయ్యో శతాబ్దారంభానికి ఐరోపాఖండంలోని అగ్రరాజ్యాలు రెండు కూటాలుగా చీలిపోయాయి. ఫ్రాన్స్, రష్యా దేశాలు ఇంగ్లండ్ నాయకత్వంలో ట్రిపుల్ ఎన్టెంట్‌గానూ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీ దేశాలు జర్మనీ పర్యవేక్షణలో ట్రిపుల్ అలయన్స్‌గానూ ఏర్పడ్డాయి. ఈ రెండు కూటములు పరస్పర అనుమానంతో, భయంతో తమ సైనిక శక్తిని అపారంగా పెంచుకున్నాయి. ఒకదానిపై మరోటి కయ్యానికి కాలుదువ్వడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో 1908 ఆస్ట్రియా (హంగరీ), సెర్బియా దేశాలకు మధ్య స్పర్ధలు పెరిగాయి. బోస్నియా, హెర్జిగోవినా ప్రాంతాలను ఆస్ట్రియా ఆక్రమించుకుంది. వాటిని అల్బేనియా పేరుతో ప్రత్యేక దేశంగా చేసి, తన ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో సెర్బియా సముద్రమార్గం మూసుకుపోయింది. దాని విదేశీ వాణిజ్యం దెబ్బతింది. ఫలితంగా ఆ దేశం ఆర్థికంగా నష్టపోయింది. అయినా దీని ప్రాబల్యాన్ని ఆస్ట్రియా తగ్గించలేకపోయింది. సంధి షరతుల ప్రకారం ఆస్ట్రియా కొమ్ముకాయడానికి జర్మనీ సిద్ధంగానే ఉన్నప్పటికీ, యుద్ధానికి సుముఖతను వ్యక్తం చేయలేదు. సరైన అదను రాలేదని ఆస్ట్రియాకు నచ్చజెప్పింది.

సరిగ్గా, ఆ సమయంలోనే సంభవించిన ఆస్ట్రియా యువరాజు దంపతుల హత్యతో... ఆస్ట్రియాకు అవకాశం లభించింది. హంతకులు నిజానికి ఆస్ట్రియాదేశ వాసులే! అయినా వారు సెర్బియా జాతికి చెందిన వారు కావడంతో ఆవేశాలు పెరిగిపోయాయి. ఈ వార్త ఆస్ట్రియా మొత్తం వ్యాపించింది. సెర్బియన్లను, 'హంతకజాతి' గా అభివర్ణించింది ఆస్ట్రియా. ఈ హత్యకు సెర్బియా బాధ్యత వహించాలని ప్రకటించింది. వార్తా పత్రికలన్నీ యుద్ధ నినాదాలతో నిండిపోయాయి. సెర్బియాకీ ఉదంతంతో సంబంధం లేదని రుజువయినా, ఆ రిపోర్టును బహిర్గతం చేయలేదు ఆస్ట్రియా. ఆ దేశంపై యుద్ధాన్ని ప్రకటించడానికి చేజిక్కిన అరుదైన అవకాశాన్ని చేజార్చు కోవాలనుకోలేదు.

జర్మనీతో రహస్య మంతనాలు సాగించింది. యుద్ధానికేర్పాట్లు ప్రారంభించింది. జర్మనీ ఎటువంటి షరతులూ విధించకుండా తన మద్దతును ఆస్ట్రియాకు ప్రకటించింది. యువరాజు, రాణీల హత్యకు బాధ్యత వహిస్తూ, పది డిమాండ్లతో కూడిన అల్టిమేటం సెర్బియాకిచ్చింది. దాన్నంగీకరిస్తే, సెర్బియా తన సార్వభౌమాధికారాన్ని కోల్పోయే ప్రమాదముంది. ఇటువంటి పరిస్థితుల్లో యుద్ధం అనివార్యమైంది. అదే మొదటి ప్రపంచయుద్ధం. జర్మనీ, ఇటలీ ఆస్ట్రియాకు మద్దతుగా నిలిచాయి. సెర్బియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా రంగంలోకి దిగాయి. ఫర్డినాండ్ దంపతుల హత్య ప్రపంచ చరిత్రనే ఓ మలుపు తిప్పింది. వినాశకర సంగ్రామానికి తెరదీసింది.



ద్రోహచింతనతో, మంత్రి మీర్జాఫర్‌ను లోపాయికారిగా, తమవైపు తిప్పుకున్నారు. అంతిమంగా, సిరాజుద్దౌలాని 1757లో ప్లాసీ యుద్ధంలో (జూన్ నెల 23న భాగీరథినది ఒడ్డున వున్న మామిడితోపు వద్ద గల ప్లాసీ అనే చోట) ఓడించి మీర్జాఫర్‌ను బెంగాల్‌కు సుబేదార్‌గా ప్రకటించారు.

# చిన్న యుద్ధం - పెద్ద పర్యవసానం

**భా**రతదేశాధిపత్యం కోసం, ఆధునిక యుగంలో జరిగిన పెనుగులాట ఒకవైపు ఐరోపా దేశాల మధ్య మరోవైపు ఐరోపా దేశాలకు భారతదేశంలోని రాజ్యాలకు మధ్య జరిగింది. ఈ క్రమంలో అనేక యుద్ధాలు జరిగాయి. ఎంతో ధననష్టం, జననష్టం జరిగి, దేశం పరాధీనం కావడమేగాక, ఆర్థికంగా చితికి పోయింది కూడా.

1600వ సంవత్సరం నుండి ఆంగ్లేయులు, ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో వర్తక వాణిజ్యాల కోసం, భారతదేశంలోకి అడుగు పెట్టారు. అంతకుముందే పోర్చుగీస్‌వారితో ప్రారంభమై డచ్చి, ఫ్రెంచి కంపెనీలు దేశంలో తిష్టవేసుకుని కూర్చున్నాయి. అప్పట్లో దేశాన్ని ఏలే మొఘలు చక్రవర్తులు వీరికి రాయితీలు కల్పించి, వర్తక వాణిజ్యాలకు అనుమతిచ్చారు. విదేశీ కంపెనీల దురాలోచన, వ్యూహం వారికి అంతు చిక్కలేదు. ముఖ్యంగా ఆంగ్లేయులు, అనుసరించదలచుకున్న వ్యూహాత్మక పథకం (ఫ్లాగ్ పాలోస్ ట్రేడ్ 'వాణిజ్యం వెంట జెండా', అంటే రాజకీయ అధికారం వస్తుంది) అని మొఘలులు గ్రహించలేక పోయారు. క్రమేపీ, ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ, తతిమ్మా ఐరోపావాసుల్ని, నయానా, భయానా తరిమివేసి, యుద్ధాల్లో ఓడించడం ద్వారా కూడా శమ ప్రాభవాన్ని నిలుపుకోడాన్ని ఎత్తులపై ఎత్తులు వేస్తూ, తదనుగుణమైన విధానాలు రూపొందించుకొన్నారు.

ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీలో కిందిస్థాయి గుమస్తాగిరి చేయడానికి వచ్చిన రాబర్ట్ క్లైవ్, ఉద్యోగరీత్యా, తక్కువ స్థాయిలో వున్నా, అత్యంత సాహసికుడుగా పేరు తెచ్చుకున్నాడు. డూప్లే నాయకత్వంలో దక్షిణాన ఫ్రెంచి సైన్యాలను ఓడించడంలో క్లైవ్ ముఖ్యపాత్ర వహించాడు. విజయం సాధించి ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. కానీ, దేశంలో ప్రాదేశికంగా,

తీర ప్రాంతాల్లోని రేవు పట్టణాలు మినహా, ఆంగ్లేయులు కావాలనుకోలేదు. వారి దృష్టి బెంగాల్ రాష్ట్రంపై ఉంది. భౌగోళికంగా విశాలమైంది. సారవంతమైంది కూడా. అందుకే అత్యంత సంపన్న ప్రాంతంగా పేర్గాంచింది. నామ మాత్రంగానే మొఘలు చక్రవర్తికి లోబడి వున్నా, దాదాపు స్వతంత్ర రాజ్యంగా వ్యవహరిస్తోంది. బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా మంచివాడే కానీ అసమర్థుడు, విలాస వంతుడు, తన ఎదుట , రాజ్యాస్థానంలో జరిగే రహస్య ద్రోహపూరిత కుట్రలను పసిగట్టి, నివారించే సామర్థ్యం లేనివాడు. అయినా ఆంగ్లేయులకు లొంగని స్వతంత్రుడు.

రాబర్ట్ క్లైవ్ ఇదంతా దక్షిణ భారతదేశం నుండి గమనించి, సమయం కోసం గుంటనక్కలా వేచి చూశాడు. కలకత్తాలో తమ వర్తక స్థావరాలను పటిష్టపర్చుకొనే విషయంలో ఆంగ్లేయులు, పోర్టు విలియంను మరింత పదిలం చేసుకున్నారు. దాని రక్షణ కోసం సైనికశక్తిని పెంచుకున్నారు. నవాబు సిరాజుద్దౌలా దీనికి అంగీకరించ లేదు. వర్తక, వాణిజ్యాలకే పరిమితం కావాలన్న షరతునే గట్టిగా అమలుపర్చాడు. ఆంగ్లేయులు దీన్ని పెడచెవిన పెట్టారు. దాంతో సైన్యంతో వారిపై దండెత్తి, ఓడించి ఫోర్ట్ విలియంను ఆక్రమించాడు. కానీ సైనిక విజయాన్ని సుసంఘటితం చేసుకోకుండా, తీరుబాటుగా, విలాసాల్లో తేలియాడాడు. దీన్ని, ఆంగ్లేయులు అవకాశంగా తీసుకొని తమ కుట్ర, కుహకాలను వేగవంతం చేశారు. నవాబు వ్యతిరేకులను చేరదీశారు. ప్రోత్సహించారు. ముఖ్యంగా సిరాజుద్దౌలా ఆస్థానం లోని మంత్రి మీర్జాఫర్‌ను లొంగ దీసుకున్నారు. భారీగా డబ్బు ముట్ట చెప్పారు. దీంతో వారి కార్యం సగం పూర్తయింది. ఇక సైనిక చర్యకు సన్నాహాలు చేశారు. మదరాసు నుండి, క్లైవ్, అడ్మిరల్ వాట్సన్ నాయకత్వంలో, సైనిక నౌకాదళాలను కలకత్తాకు పంపారు. కంపెనీకి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాల్సిందిగా నవాబుకు అల్టిమేటం పంపారు. ఉపసంహరించిన రాయితీలను తిరిగి ఇమ్మని డిమాండ్ చేశారు. అల్టిమేటమ్ కేవలం పేరుకు మాత్రమే. ఎలాగైనా యుద్ధం చేయాలన్న నిర్ణయం ముందే తీసుకొన్నారు. ఎలాంటి వ్యతిరేకత ప్రతిఘటన లేకుండా సిరాజుద్దౌలా సైనికులు లొంగి పోయారు. ఆ తర్వాత నవాబు ఫ్రెంచి వారితో సంప్రదింపులు జరుపుతున్నాడని తెలిసి, ఇక ఉపేక్షించి లాభం లేదను కున్నారు. ద్రోహ చింతనతో, మంత్రి మీర్జాఫర్‌ను లోపాయికారిగా, తమవైపు తిప్పుకున్నారు. అంతిమంగా, సిరాజుద్దౌలానే 1757లో ప్లాసీ యుద్ధంలో (జూన్ నెల 23న భాగీరథినది ఒడ్డున వున్న మామిడితోపు వద్ద గల ప్లాసీ అనే చోట) ఓడించి మీర్జాఫర్‌ను బెంగాల్‌కు సుబేదార్‌గా ప్రకటించారు. మీర్జాఫర్‌ను ఆంగ్లేయుల చేతిలో కీలుబొమ్మ చేసుకొని క్లైవ్ బెంగాల్లో , ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని సాధించాడు. క్లైవ్ ఫోర్జరీలతో, ధనాశ చూపించి, కపటోపాయాలతో, విభజించి, పాలించు విధానాలతో భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యానికి బెంగాల్ విజయం ద్వారా పునాదులు నిర్మించాడు. మీర్జాఫర్ చర్య చరిత్రలో పెద్ద నమ్మక ద్రోహంగా నిలిచి పోయింది. క్లైవ్ బెంగాల్‌ను కంపెనీ అవసరాలకేగాక, వ్యక్తిగత లబ్ధికోసం దోచుకున్నాడు. లక్షలాది రూపాయల ధనాన్ని, అపారమైన బంగారు నిల్వల్ని కొల్లగొట్టుకొని ఇంగ్లండ్‌కు తీసుకు పోయాడు. అతడి చర్యలను బ్రిటీష్ పార్లమెంట్ నిరసించి, అభిశంసించింది. క్లైవ్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్లాసీ యుద్ధం, సైనిక ప్రమాణాల రీత్యా, ఎంతో చిన్న యుద్ధం కానీ, దాని ఫలితాలు మాత్రం గొప్ప యుద్ధాల కంటే ఎక్కువైనవి.



గాంధీ, దండి సత్యాగ్రహంలో ఒక పిడికెడు ఉప్పు
చేతిలో తీసుకొని శాసనోల్లంఘనం చేసిన ఘటనను
అమెరికా ప్రజలు తమ దేశంలో 'తేనీటి విందు'
ఘటనలో పోల్చుకున్నారు. గాంధీ ఉప్పుసత్యాగ్రహాన్ని
'ఉప్పు' విందుగా పేర్కొనడం గమనార్హం 1773లో
ప్రారంభమైన అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం,
1776లో స్వతంత్రదేశంగా
అమెరికా రూపొందడంతో ముగిసింది.


# తేనేటి విందుతో ఏర్పడ్డ అమెరికా

ఇవ్వాళ అమెరికా సంయుక్త రాష్ట్రాలు (యుఎస్ఎ) ప్రపంచాధిపత్యం కోసం అడ్డదారులు తొక్కుతూ, స్వతంత్ర రాజ్యాల సార్వభౌమత్వానికి ఎసరు పెడుతూ ప్రపంచానికంతకూ రక్షక భటుడిగా (పోలీస్ మాన్) ఉండాలని వువ్విళ్ళూరుతోంది. కానీ, సుమారు, రెండు శతాబ్దాలకు పూర్వం, 18వ శతాబ్దంలో, అప్పటి అమెరికాలోని 13 వలసలు, తమ స్వాతంత్ర్యంకోసం జరిపిన పోరాటం, కొన్ని మహత్తర ఆశయాలపై ఆధారపడడాన్ని తెలుసుకొంటే, ఇప్పటి అమెరికాను ఈసడించుకోక తప్పని పరిస్థితి.

18వ శతాబ్దంలోనే, ప్రపంచంలో ఆంగ్లేయుల వలసాధిపత్యానికి ఎదురొడ్డి, 'నూతన ప్రపంచం' లోని 13 వలస రాజీలేని పోరాటం, అందులోనూ హింసతో కూడిన విప్లవం లాంటి యుద్ధాన్నే చేశాయి. ఆ యుద్ధగమనంలో 1773లో, బోస్టన్ నగరంలో జరిగిన ఒక ఆసక్తికర ఘటన అమెరికన్ల పోరాటానికి ఉత్తేజాన్నిచ్చి, ఘర్షణలకు తుదిరూపం కల్పించి ఇంగ్లండు, అమెరికాల మధ్య యుద్ధాన్ని అనివార్యం చేసింది. మాసచుసెట్స్ (ఈనాడు అది

ఒక రాష్ట్రం), అప్పట్లో అమెరికా తూర్పు తీరంలో ఉన్న ఒక ముఖ్య వలస రాష్ట్రం. వలస స్థాపనలో ముందే ఏర్పడ్డ ప్రాంతం. సంపన్న మైంది. క్రమేపీ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకొంది. వలసలలో మొట్ట మొదటి వార్తా పత్రిక, న్యూస్‌లెటర్ 1704లో ఇక్కడి నుండి వెలువడింది.

దీనికి ముఖ్య పట్టణం బోస్టన్ నగరం ఇవ్వాళ ప్రపంచంలోనే అత్యుత్తమ హార్వర్డ్ విశ్వ విద్యాలయం (నోబుల్ బహుమతి గ్రహీత, భారతీయ ఆర్థికవేత్త అమర్త్యసేన్ అక్కడే ఇప్పుడు బోధిస్తున్నాడు. కాగా అనేకమంది అమెరికా అధ్యక్షులు కెన్నెడీ నుండి నేటి బుష్ దాకా, ఇక్కడి లా విశ్వ విద్యాలయంలోనే చదివారు) ప్రపంచ ప్రసిద్ధి చెందిన మాసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అక్కడే వుందీనాడు. ఇదిలా వుంటే, అమెరికా వలసలు 'బ్రిటీష్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కల్పించనిదే, పన్నులు చెల్లించేది లేదన్న' (నో టాక్సేషన్ విథౌట్ రిప్రజంటేషన్) నినాదంతో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. వలసల వ్యతిరేకత కారణంగా, బ్రిటీష్ వారు విధించిన టౌన్‌షెండు చట్టాలకు సంబంధించిన పన్నులు ఉపసంహరించుకున్నా, తేయాకుపై పన్ను మాత్రం తొలగించలేదు. తూర్పు ఇండియా కంపెనీ, భారత దేశాన్నుండి తేయాకును అమెరికాకు ఎగుమతి చేసేది. ఈ కంపెనీలో పలుకుబడి కలిగిన బ్రిటీషు పెట్టుబడిదారులకు ఎక్కువ షేర్లుండేవి. విపరీతమైన లాభాలు ఆర్జించేవారు. వారి ప్రయోజనాలను కాపాడ్డానికి, తేయాకుపై పన్ను కొనసాగించేందుకు బ్రిటీష్‌వారే కుట్రపన్నారు. మూడు నౌకల్లో, బోస్టన్ వాసులు, రెడ్ ఇండియన్ల మాదిరి వేషాలు ధరించి, బోస్టన్ రేవులో ప్రవేశించారు. అప్పటికే అక్కడ అశేష ప్రజా సమూహం పోగయింది. వారందరూ ఓడల్లో ఉన్న తేయాకు నిల్వలను సముద్రంలోకి పారపోశారు. అక్కడ గుమికూడిన ప్రజలు ఈ చర్యకు వత్తాసుగా కేరింతలు కొడుతూ, ఆనందంతో గంతులేశారు. ఈ ఘటన ఇంగ్లండుకు పెనుసవాలుగా నిలిచింది. ఇంగ్లండు తన సహనానికి ఇదొక పరీక్షగా భావించి, ఇక ఉపేక్షించి లాభం లేదనుకొని, యుద్ధాన్ని ప్రకటించింది. 'బోస్టన్ తేనీటి విందు"గా ప్రసిద్ధికెక్కిన ఈ సంఘటన ప్రపంచ చరిత్రలోనే అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకొంది. గాంధీ, దండి సత్యాగ్రహంలో ఒక పిడికెటి ఉప్పు చేతిలో తీసుకొని శాసనోల్లంఘనం చేసిన ఘటనను అమెరికా ప్రజలు తమ దేశంలో 'తేనీటి విందు' ఘటనలో పోల్చుకున్నారు. గాంధీ ఉప్పుసత్యాగ్రహాన్ని 'ఉప్పు విందుగా పేర్కొనడం గమనార్హం 1773లో ప్రారంభమైన అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం, 1776లో స్వతంత్ర్యదేశంగా అమెరికా రూపొందడంతో ముగిసింది. జార్జి వాషింగ్టన్ మొదటి అధ్యక్షుడిగా ఎన్నుకొన్న అమెరికా, తన స్వాతంత్ర్య ప్రకటనలో "మానవులందరూ పుట్టుకతో సమానులు" అని పేర్కొని, సమానత్వ ఆదర్శాన్ని మానవాళి ముందు నిలిపింది.



ఈ క్రమంలో అచ్చుయంత్రాన్ని కనుగొనడం, బైబిల్ గ్రంథం అచ్చుకావడం, కాథలిక్ చర్చిలో తిరుగుబాటు వచ్చి ప్రొటెస్టెంట్ మతం, ఆ తర్వాత దాంట్లో కాల్వినిజం జ్వింగ్లీజం, లూథరానిజమ్ లాంటి శాఖలెన్నో తలెత్తడం జరిగింది. అచ్చుయంత్రం క్రైస్తవమత చరిత్రలోనే పెద్ద టర్నింగ్ పాయింట్.

# అచ్చు యంత్రం తెచ్చిన మత విప్లవం

**సాం**స్కృతిక పునరుజ్జీవనంతో మధ్య యుగాల 'చీకటి' అంతమై, 15వ శతాబ్దంలో ఆధునిక ఐరోపా ఆరంభమైంది. సకల మానవ విజ్ఞానాభివృద్ధికి సాహిత్య, కళారంగాలకు ఇది పునర్జన్మ. పునరుజ్జీవనం తెచ్చిన అనేకానేక మార్పుల గూర్చి మరోసారి తెల్సుకుందాం. క్రైస్తవమత చరిత్రలో ఒకానొక అతి ముఖ్యఘటన సంస్కరణోద్యమంగా ఆరంభమైంది. ఇది మతవిప్లవంగా వినుతికెక్కింది. సంస్కరణోద్యమ స్ఫూర్తితో అసంఖ్యాక క్రైస్తవ మతావలంబకులు జిజ్ఞాస, ఆత్మస్థయిర్యం పెంచుకున్నారు. మతం చెప్పే ప్రతి అంశాన్ని గుడ్డిగా నమ్మే అలవాటును మానుకొన్నారు. దీంతో చర్చిలో పేరుకుపోయిన అవాంఛనీయ లక్షణాల పట్ల ఏహ్యాభావాన్ని, తృణీకారాన్ని పెంచుకొన్నారు. ఇది క్రైస్తవమత చీలికకు దారితీసింది. కాథలిక్ మతం పట్ల నిరసన (PROTEST) మొదలై, ప్రొటెస్టెంట్ మతశాఖగా రూపుదిద్దుకొంది. ఈ తిరుగుబాటు ఒకే ఒక శాస్త్రీయ ఆవిష్కరణతో సాధ్యమయింది. అది జరిగిన క్రమంబెట్టిదనిన...

కాథలిక్ మత అధికారవర్గానికి పోప్ అధినాయకుడు. పోప్‌ను ఆదర్శ మతగురువుగా క్రైస్తవులందరూ అంగీకరిస్తారు. కానీ 15వ శతాబ్దానికి చర్చిలో ఎన్నో దుర్లక్షణాలు చోటు చేసుకొన్నాయి. వీటిని క్రైస్తవమత ముఖ్యులెందరో ఖండిస్తూ వచ్చారు. 14వ శతాబ్దంలో జాన్ విక్లిఫ్, బొహీమియాకు చెందిన జాన్‌హస్ తిరుగుబాటు చేశారు. వెల్లువెత్తిన ఈ నిరసనలకు అసలు సిసలు జీవాన్నిచ్చింది మాత్రం పునరుజ్జీవనోద్యమం ముందుకు తెచ్చిన మానవతావాదం. దౌర్జన్యాన్ని ఎదిరించే గుండె నిబ్బరాన్ని మంచీ చెడులను విడమర్చి చూడగల హేతువాద దృక్పథాన్ని ఈ మానవతావాదం సమకూర్చింది. కాగా ఈ ఉద్యమానికి గొప్ప చేయూత అచ్చుయంత్రం రూపంలో లభించింది. ఎలాగంటే ? గుటెన్ బర్గ్ అనే శాస్త్రజ్ఞుడు కనుగొన్న అచ్చుయంత్రం అప్పుడే వ్యాప్తిలోకి రానారంభించింది దాని సాయంతో క్రైస్తవుల మత గ్రంథం "బైబిల్" అచ్చయింది. నిజానికి క్రైస్తవం ఏం చెపుతున్నదీ, తమ జీవితాలను ఏవిధంగా మలుచుకోవాలన్న సిద్ధాంతాలు ఇందులో వున్నాయి. ఇప్పుడవి చాలా సులభంగా, ఎంతో వివరంగా ప్రజల ముందుకు వచ్చాయి. దీంతో బైబిల్ సూత్రాలకు విరుద్ధంగా మతాధిపతులు, ముఖ్యంగా అధినాయకుడు పోప్ గడుపుతున్న విలాస జీవితం, చర్చి సంస్థల్లో నెలకొన్న అవినీతి, బంధుప్రీతి, పక్షపాతం, ధనార్జనలను ప్రజలు అసహ్యించుకొన్నారు. దీనికి తోడుగా, అదే చారిత్రకదశలో తలెత్తుతున్న మధ్యతరగతి వర్గం (విద్యా, వాణిజ్యవర్గాలు), దేశాధినేతలు కలసి, చర్చి అధికారాలకు గండి కొట్టి, తమ స్వతంత్రతను చాటుకోవాలని ఉబలాటపడ్డారు. అంతేగాక పాపపరిహార పత్రాలను మార్కెట్లో సరుకుల్లాగ విరివిగా పోప్ అమ్మడం మొదలెట్టారు. చేసిన పాపాల నుండి, పరిహారం పొందడానికి, ప్రక్షాళనం గావించుకొని మరణానంతరం, దైవసన్నిధి చేరడానికి, ఈ సర్టిఫికెట్లను కొని, వాడుకోవచ్చునని ప్రచారం చేశారు. చర్చి చేపట్టిన ఈ అవినీతి చర్య, మరింత గర్హనీయమైంది. సంస్కరణోద్యమానికి జర్మనీ దేశస్థుడు, మార్టిన్ లూథర్ నాయకత్వం వహించాడు. అంతకు ముందు చర్చికి ఎదురు తిరిగిన జాన్‌హస్‌ను చర్చి సజీవదహనం చేసింది. అయినా తిరుగుబాటుకు మార్టిన్ లూథర్ వెనుకాడలేదు రైతు కుటుంబంలో పుట్టిన లూథర్ తిరుగుబాటు బావుటా ఎగరేశాడు. దీనికి ప్రతిగా పోప్ మార్టిన్ లూథర్‌ను వెలివేసి, పవిత్ర రోమన్ సామ్రాజ్యం నుండి బహిష్కరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశాడు. పోప్ పంపిన శ్రీముఖాన్ని లూథర్ బహిరంగంగా మార్కెటు కూడలిలో తగలబెట్టాడు.

ఈ క్రమంలో అచ్చుయంత్రాన్ని కనుగొనడం, బైబిల్ గ్రంథం అచ్చుకావడం. కాథలిక్ చర్చిలో తిరుగుబాటు వచ్చి ప్రొటెస్టెంట్ మతం, ఆ తర్వాత దాంట్లో కాల్వినిజం. జ్వింగ్లీజం లూథరానిజమ్ లాంటి శాఖలెన్నో తలెత్తడం జరిగింది. అచ్చుయంత్రం క్రైస్తవమత చరిత్రలోనే పెద్ద టర్నింగ్ పాయింట్.



*ప్రపంచ విజేతల్లో ప్రథముడు సికందర్‌గా పేర్గాంచిన అలెగ్జాండర్ గ్రీస్ దేశానికి ఉత్తరానవున్న మాసిడోనియా నుండి బయలుదేరాడు. కొమ్ములు తిరిగిన సైనికయోధులతో, పటిష్టమైన యుద్ధ సామాగ్రితో తయారై, దండయాత్రను ప్రారంభించాడు.*

# ఆ జగజ్జేత వెనుదిరగడం

క్రీస్తు పూర్వకాలం నాటి చరిత్ర మొదలుకొని, ఇవ్వాల్టిదాకా, దేశాలనేలే రాజులు, చక్రవర్తులు, ప్రభుత్వాలు, రాజ్య విస్తరణకాంక్షతో దురాక్రమణ పూరిత విధానాలు అవలంభించారు. ఇతర దేశాలపై దండెత్తి, యుద్ధాలు చేసి, కొన్ని సార్లు సఫలులై, మరెన్నోసార్లు విఫలులై, చరిత్రలో విజేతలుగానో, పరాజితులుగానో మిగిలిపోయారు. అటువంటి ప్రపంచ విజేతలెందరో వున్నారు. రోమన్ చక్రవర్తి సీజర్, ఆ తర్వాత కాలంలో ఛార్లమెన్, తైమూర్, మరెందరో... మహాకవి శ్రీ శ్రీ అన్నట్టు...

**చెంఘిజ్‌ఖాన్, తామర్లేనూ**
**నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ**
**సికందరో ఎవడైతేనేం**
**ఒక్కొక్కడూ మహాహంతకుడు**


ఈ ప్రపంచ విజేతల్లో ప్రథముడు సికందర్‌గా పేర్గాంచిన అలెగ్జాండర్ గ్రీస్ దేశానికి ఉత్తరానవున్న మాసిడోనియా నుండి బయలుదేరాడు. కొమ్ములు తిరిగిన సైనికయోధులతో, పటిష్టమైన యుద్ధ సామాగ్రితో తయారై, దండయాత్రను ప్రారంభించాడు. అలెగ్జాండర్ సైనిక వ్యూహంలో ఆరితేరిన దిట్ట. ఎదురులేని యుద్ధవీరుడు. ప్రపంచ చరిత్రలో మిక్కిలిగా గ్లామర్ పొందిన చక్రవర్తి. అతడి పేరుతో ఎన్నో నగరాలు వెలిశాయి. నేటికీ ప్రాముఖ్యత సంతరించుకొన్న ఈజిప్టులోని "అలెగ్జాండ్రియా" పట్టణం అతడి పేరుపై ఏర్పడిందే.

అలెగ్జాండర్ మాసిడోనియా సింహాసనాన్ని అధిష్టించే నాటికి ఇరవయేళ్ళ నవయువకుడు. కీర్తి కోసం అర్రులు చాస్తూ, అత్యంత బలతరమైన పర్షియాను ఓడించాడు. ఈజిప్టును లొంగదీసుకొన్నాడు. ఆఫ్ఘనిస్తాన్, కాబూల్, హీరట్, సామర్‌ఖండ్‌లను ఆక్రమించుకున్నాడు. క్రీ.పూ. 326లో, భారతదేశంలోని సింధూనది ఎగువ భాగానికొచ్చి నిలిచాడు. భారత్‌గడ్డపై అలెగ్జాండర్ కాలూనడమే గొప్ప చారిత్రక ఘటనగా పేర్కొనాల్సి వుంటుంది. ప్రపంచచరిత్ర ఎట్లున్నా, భారతదేశచరిత్ర మాత్రం తీవ్ర మార్పులకు గురైంది.

ఎలాగంటే ? - అలెగ్జాండర్, భారతదేశ సరిహద్దుల్లో వున్న అనేక బలిష్టమైన కొండజాతులను, గణరాజ్యాలను, చిన్న చిన్న జనపదాలను ఆక్రమించుకొంటూ వచ్చాడు. కానీ గట్టి ప్రతిఘటనను పోరస్ (గ్రీకు చరిత్ర కారులు రాసిన పేరు) అనే పురుషోత్తం నుండి ఎదుర్కొన్నాడు. పురుషోత్తముడు పొడగరి, బలిష్టుడు, సాహసవంతుడు. గొప్ప రాజుకుండాల్సిన ఠీవీ, దర్పం ఉన్నాయి. స్ఫురద్రూపి. అయినా, అలెగ్జాండర్ ధాటికి నిలువలేకపోయాడు. సర్వశక్తులూ వొడ్డి ఎలాగైతేనేం పురుషోత్తముడిని ఓడించాడు అలెగ్జాండర్. పురుషోత్తముడి పరాక్రమానికి అలెగ్జాండర్ ముగ్ధుడయ్యాడు. రాజ్యాన్ని తిరిగి ఇచ్చి ఏలుకోమన్నాడు. పురుషోత్తముడిని ఓడించాక, గంగానదివైపు తన దండయాత్రను కొనసాగించాలనుకున్నాడు. కానీ ముందుకు వెళ్ళలేదు. వెనుదిరిగాడు. మాసిడోనియాకు తిరిగి వెడుతున్న అలెగ్జాండర్, మార్గమధ్యంలో, బాబిలోనియాలో 33 ఏండ్ల వయసులో, క్రీ.పూ. 323లో మరణించాడు.

అలెగ్జాండర్ వెనుదిరిగిపోవడంలో ఆంతర్యమేమయినా ఈ వెనుదిరగడమే ముఖ్యఘటన. దండయాత్ర కొనసాగించడానికి అలెగ్జాండర్ సైనికులు ఒప్పుకోలేదు. మొరాయించారు. దశాబ్దానికి పైగా సాగుతున్న యుద్ధకాండతో, వారు విసిగిపోయి. యుద్ధగ్లానికి లోనయ్యారు. ఈ కారణాన్నే అనేక మంది చరిత్రకారులు, అలెగ్జాండర్ వెనుతిరగడానికి దోహదం చేసిందని పేర్కొన్నారు. అది నిజమా ? కాకుంటే, మరేమైనా కారణాలున్నాయా ? అలెగ్జాండర్ ముందుకుపోయివుంటే, భారతదేశానికి గుండెకాయగా చెప్పదగిన గంగా-సింధూ మైదానంలో "మగధరాజ్యం" వుంది. నంద వంశపు రాజుల్లో ముఖ్యుడు, అత్యంత బలవంతుడైన మహా పద్మనందుడు రాజ్యమేలుతున్నాడు. పాటలీపుత్రం దాని రాజధాని. సైన్యం లక్షల సంఖ్యలో వుండగా, రథ, గజ, తురగాదులు విశేషంగా ఉన్నాయి. అలెగ్జాండర్ సైనికులు అప్పటికే పురుషోత్తముడి సైనిక పాటవాన్ని చవి చూసి వున్నారు. వారు మొదటిసారిగా ఏనుగులను చూసి అబ్బురపడి వున్నారు. ముందుకెడితే, అలెగ్జాండర్ గెలవగలడా? సందేహం. అదీగాక, ఈ దండయాత్ర సందర్భంగానే, నందరాజ్యాన్ని ఓడింప ప్రయత్నిస్తున్న చంద్రగుప్తమౌర్యుడు అలెగ్జాండర్‌ను కలిసాడు. సామ్రాజ్య నిర్మాణానికి కావాల్సిన ఉత్తేజాన్ని, ప్రభావాన్ని పొందాడు కూడా. అలెగ్జాండర్ దీనిని ప్రోత్సహించాడు. అంతేకాదు. అనేక చిన్న, చిన్న రాజ్యాలను బలవత్తరమైన అటవీ రాజ్యాలను ఆక్రమించడం ద్వారా ఆ తర్వాత సువిశాల సామ్రాజ్య నిర్మాణానికి అలెగ్జాండర్ దండయాత్ర దోహదం చేసింది.

ఇక్కడే చరిత్ర మలుపు తిరిగి, భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యం-మౌర్య సామ్రాజ్యం-చంద్రగుప్తుడి అధీనంలో, చాణిక్యుడని పేర్గాంచిన కౌటిల్యుడి మంత్రాంగంలో ఏర్పడింది. అదే ఆనాటి జగజ్జేత అలెగ్జాండర్ వెనుదిరగకపోతే...!



# ఆవిరిశక్తి..
# మహత్తర పారిశ్రామిక విప్లవానికి నాంది

**నే**టి మానవులు, భౌతికంగా ఎన్నో సౌకర్యాలను అనుభవిస్తూ, 'సుఖవంతమైన' జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రవాణా, సమాచార, శాస్త్ర, వైజ్ఞానిక, వైద్య, విద్యా రంగాల్లో అసమాన ప్రతిభను చూపుతున్నారు. అంతరిక్ష, గ్రహాంతరయానాలు చేస్తున్నారు. చంద్ర మండలానికి 'హనీమూన్'కు ఏర్పాటు చేసుకుంటున్నారు. విస్తారంగా పెరిగిన కంప్యూటర్ సమాచార వసతుల వల్ల, ఇవ్వాళ ప్రపంచం ఒక చిన్న కుగ్రామంగా తయారైంది. ఇవన్నీ నమ్మలేని నిజాలుగా మనముందు నిలిచాయి. గతంలో జీవించినవారు ఎవరైనా, సోక్రటీస్ లేదా అశోకుడు, తిరిగి బతికొచ్చి, ఇదంతా చూస్తే, తీవ్ర సంభ్రమాశ్చర్యాలకు గురయ్యే పరిస్థితి.

అయితే... ఇదంతా ఎలా జరిగింది? దీనికంతటికీ దోహదం చేసిన ఘటన ఏమిటి? ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవం అనాలి. 18వ శతాబ్దం విప్లవాలయుగం. ఆర్థిక రంగంలో పెను మార్పులకు పారిశ్రామిక విప్లవం దోహదం చేయగా, రాజకీయంగా అమెరికన్ విప్లవం, రాజకీయ-సామాజిక ప్రాధాన్యతలను సంతరించుకొని ఫ్రెంచి విప్లవం వచ్చింది. పారిశ్రామిక విప్లవం భారీ యంత్రాలను మానవాళి ముందుకు తెచ్చింది. యంత్రయుగానికి నాంది పలికింది. యంత్రం అంటే ఏమిటి ? మనిషికి తన పనిలో సాయపడే భారీ పనిముట్టు. మనిషిని పనిముట్లు తయారుచేసే జంతువుగా పేర్కొన్నారు. మానవాళి ఆవిర్భావం నుండి మనకు కావాల్సిన జీవిత నాణ్యతను మెరుగుపర్చుకొని అవసరమైన పనిముట్లను తయారు చేసుకొంటూ వచ్చారు మానవులు. అవధిలేని ఈ అన్వేషణ, మానవ సమాజాన్ని ఒక్కో మెట్టు పైకి తీసుకెళ్ళి, ఇవ్వాల్టి స్థాయికి తీసుకొచ్చింది. ఈ సాయం వల్లే, తనకంటే ఎన్నో రెట్లు బలమైన, క్రూర జంతువులను కూడా లోబరుచుకొంటూ, ప్రకృతిని జయిస్తూ, ముందుకెళుతున్నారు మానవులు.

పనిముట్టు వాస్తవానికి మానవులకు మూడోచెయ్యి లాంటిది. సహజంగా, పుట్టుకతో వచ్చిన రెండు చేతులే మనిషికి మొదటి పనిముట్టు. వీటి ద్వారా ఉత్పత్తి పెరిగి, చాలినంత తీరిక లభించి, కళలు సారస్వతం, సమస్త సంస్కృతీ పెంపుదలకు దోహదం చేసింది. పారిశ్రామిక విప్లవానికి అంకురార్పణ చేసి, చరిత్రనే పెను మలుపు తిప్పిన మొదటి ఆవిష్కరణ, 1738లోనే కే(Kay) కనుగొన్న మరమగ్గం. బట్టల నేతలో ఇది చేమగ్గానికి ప్రత్యామ్నాయంగా రూపొంది, వస్త్రోత్పత్తిని అధికంచేసింది. ఆ తర్వాత, 1764లో హార్‌గ్రీవ్స్, స్పిన్నింగ్ జెన్నీని, నూలు వేగవంతంగా వడికే యంత్రాన్ని కనుగొని బట్టల ఉత్పత్తిని మరింత అధికం చేశారు. కానీ పారిశ్రామిక విప్లవానికి ఆయువుపట్టులాంటి పరిశోధన, 1765లో జేమ్స్ వాట్ కనుగొన్నారు. అదే ఆవిరిశ్రమతో నడిచే యంత్రం. మనకు చిన్నప్పుడు చెప్పిన కథలో, ఒక రోజు జేమ్స్‌వాట్, కాఫీ తయారు చేయడానికి, నీళ్ళు కాచుకొంటూవుంటే, గిన్నెపై పెట్టిన మూత ఆవిరి ఒత్తిడికి పైకి, కిందికి లేస్తూ, కదుల్తూండటం గమనించాడు. దాంతో ఆవిరిశక్తిని గూర్చిన ఆలోచన మొదటిసారి, ఆయన మదిలో తొలిచింది. అంతే... ఇక వెనుదిరిగి చూడలేదు. ఆవిరియంత్రాన్ని కనుగొన్నాడు. ఆ ఆవిరి శక్తిని యంత్రాలకు జోడించి, ముందుగా జౌళి పరిశ్రమను భారీగా అభివృద్ధి చేశారు. యంత్రాల పెంపుదలతో మానవజీవితం గొప్ప మార్పుకు లోనయింది. ఆవిరి యంత్రాలకు బొగ్గు అవసరమైంది. దాంతో బొగ్గు గనులు కనుగొన్నారు. బొగ్గుపరిశ్రమ పెరగడంతో, ఇనుము, ఉక్కు పరిశ్రమలు పెంపొందాయి. ఆ తర్వాత స్టీవెన్‌సన్ ఆవిరితో నడిచే రైలింజను కనుగొనడంతో, రవాణా రంగంలో వేగవంతమైన మార్పులొచ్చాయి. బొగ్గు గనులు, ఆవిరియంత్రం, జవుళి పరిశ్రమ, ఇనుము, ఉక్కుపరిశ్రమలు ఒకదానితో మరొకటి పరస్పరం పోషించుకొంటూ, ఇంగ్లండ్‌లో ఆరంభమైన పారిశ్రామికవిప్లవం, ప్రపంచ ముఖచిత్రాన్నే సమూలంగా మార్చివేసింది.

ఆఖర్లో ఒక మాట. ఈ పారిశ్రామిక విప్లవంలో కేవలం అనుకూలాంశాలేకాదు వ్యతిరేకాంశాలు కూడా వున్నాయి. వస్తూత్పత్తి అధికమై, సంపద పెరిగినమాట నిజమే! కానీ ఇది సమాజంలో ధనికవర్గాన్ని పెట్టుబడిదారీ వర్గాన్ని, ఫ్యాక్టరీలలో పనిచేసే, యంత్రభూతముల కోరలు తోమే కార్మికవర్గాన్ని సృష్టించింది. దారిద్ర్యం, మురికి, అవిద్య, కర్మాగారాల్లో నెలకొన్న అత్యంత దయనీయ శ్రామికుల స్థితిగతులు నెలకొన్నాయి. అధికోత్పత్తిని విదేశాలకు ఎగుమతి చేసి, అక్కడ మార్కెట్లను ఆక్రమించింది. అక్కడున్న స్వదేశీ పరిశ్రమలను ధ్వంసం చేసి, వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి దారితీసింది. అందుకే పారిశ్రామిక విప్లవం తర్వాత నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ తమ 'కమ్యూనిస్టు మానిఫెస్టో', కాపిటల్ గ్రంథాల్లో విశ్లేషణాత్మకంగా వీటి ఫలితాలను వివరించారు. మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావంతో, ప్రపంచ కార్మికులు సంఘటితమై ఏకమై, తమకున్న సంకెళ్ళను బద్దలుకొట్టి, అనేక దేశాల్లో విప్లవాలు నిర్వహించి, సామ్యవాద ప్రభుత్వాలనేర్పర్చుకోవడం జరిగింది. ఈ పరిణామాలన్నీ, పారిశ్రామిక విప్లవ ఫలితాలే! ఆవిరియంత్రం కనుగొన్న అద్భుతఫలితం ఇంతదాకా వచ్చిందన్నమాట!



1952 అక్టోబర్ 19 నాడు ప్రశాంత వాతావరణంలో నిరాహార దీక్షకు పూనుకున్నాడు. పచ్చి మంచినీళ్ళు మినహా ఏమి తీసుకోలేదు. రోజులు గడిచాయి. శ్రీరాములు ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. పరిష్కారం కనపడకపోగా, మద్రాసులేని రాష్ట్రం వద్దని టంగుటూరు ప్రకాశం ప్రభృతులు, రాయలసీమ జిల్లాలు మద్రాసులోనే వుండాలని నీలం సంజీవరెడ్డి ప్రభృతులు సమస్యను మరింత జటిలం చేశారు. ఈలోపు పుణ్యకాలం దాటిపోయింది. డిసెంబర్ 15, 1952న శ్రీరాములు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వాంతులవ్వడం, నాడి వేగం పెరగడంతో ఆయన అపస్మారక స్థితికి చేరారు.

# ఓ మహనీయుడి ఆత్మార్పణం

ఇది ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవ సంవత్సరం. కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల మూడింటి సమైక్య రూపంలో, తెలుగు జాతి చిరకాల వాంఛ ఫలించి అర్థ శతాబ్దం పూర్తయింది. 1953లో మొదటిసారిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత 1956లో దేశంలోని ఇతర ప్రాంతాలతో పాటు, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన ప్రక్రియలో భాగంగా, హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

ఆంగ్లేయపాలనలో, స్వదేశీ సంస్థానాలు మినహా దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి మద్రాసు ప్రెసిడెన్సీగా ఏర్పడ్డాయి. మద్రాసు నగరం దీనికి రాజధాని. మద్రాసు ప్రెసిడెన్సీలో తమిళులు, కన్నడిగులు, మలయాళీలు, తెలుగు మాట్లాడే ప్రాంతాలు కలిసి వుండేవి. విభిన్న భాషలు మాట్లాడే ప్రజలను కలగాపులగం చేసి పాలించడం, వలన పాలకుల అవసరాలను తీర్చింది. కానీ, విభిన్న భాషాసంస్కృతులు దీనివల్ల అభివృద్ధికి నోచుకోలేదు.

పైగా ఒక ప్రాంతం మరొక ప్రాంతంపై అజమాయిషీ చెలాయించింది. దానిమూలంగా ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతిని, ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. దీంతో ప్రాంతీయ విభేదాలు పెచ్చరిల్లాయి. అందుకే ఒక భాష మాట్లాడే ప్రాంతానికి ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలన్న డిమాండ్ ఆరంభమైంది.

రాష్ట్రంలో ఇందులో భాగంగా తెలుగు మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలన్నింటినీ కలిపి ఒకే రాష్ట్రాన్ని ఏర్పర్చాలన్న కోర్కెను, తొలిసారిగా 1913లో బాపట్లలో జరిగిన మహాసభలో తీర్మానించారు. "విజ్ఞాన చంద్రికామండలి" ఆధ్వర్యంలో, కొమర్రాజు లక్ష్మణరావు సంపాదకత్వంలో, ఆంధ్రుల చరిత్ర వెలువడింది. గుంటూరు పట్టణంలో యువజన సాహిత్య సంఘం నిర్వహించిన కార్యక్రమాలు ఈ ఉద్యమానికి వూపిరిపోశాయి. కొండ వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, టంగుటూరి ప్రకాశం, పానగల్ రాజా, భూపతి రాజు వెంకటపతిరాజు మొదలగు ఎందరో నాయకులు ఉద్యమానికి అండగా నిలిచారు. 1937లో జనరల్ ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయినప్పటికీ మద్రాసు ప్రెసిడెన్సీ ప్రధానిగా వుండిన చక్రవర్తుల రాజగోపాలాచారి(రాజాజీ) వ్యతిరేకత కారణంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడలేదు.

1946లో దేశ స్వాతంత్ర్యం సిద్ధిస్తుందన్న తరుణంలో, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ, జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్‌పటేల్, పట్టాభి సీతారామయ్యలతో ఒక కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ (జెవిపి రిపోర్టు) మద్రాసు నగరం మినహా వివాదరహిత ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. మద్రాసు నగరం లేని రాష్ట్రాన్ని ఆమోదించం అని టంగుటూరు ప్రకాశం తెగేసి చెప్పడంతో, ఆంధ్రరాష్ట్ర నిర్మాణ వాంఛ కొండెక్కింది. ఆంధ్రులు తీవ్ర ఆశాభంగానికి గురయ్యారు.

నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాష్ట్రంలో (నేటి తెలంగాణా) తెలుగు మాట్లాడే ప్రజలు భాషా చైతన్యంతో పాటు సాంస్కృతిక రంగంలో ముందంజ వేస్తూ వచ్చారు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు, గోల్కొండ పత్రిక కల్గించిన చైతన్యంతో, 1948 నాటికి వీర తెలంగాణా ఉద్యమ సారధ్యంతో పాటు, భారత యూనియన్ సైన్యాలు కలిసి హైదరాబాద్‌ను విమోచనం చేశాయి. ఆ విధంగా హైదరాబాద్ రాష్ట్ర ఏర్పాటుకు తోడ్పడ్డాయి. నిజాంపాలన అంతమైంది. ఆనాటి నుండి తెలుగు ప్రజలందరితో కలిపి, విశాలాంధ్ర ఏర్పడాలన్న నినాదం బలంగా ముందుకొచ్చింది. కమ్యూనిస్టు ఉద్యమం ఈ నినాదాన్ని ప్రముఖంగా ప్రజల్లోకి తీసుకెళ్ళింది. 1940వ దశకంలోనే కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' మకుటంతో ఒక గ్రంథాన్ని కూడా ప్రచురించారు.

ఇదిలా ఉండగా... 1952 నాటికి ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. స్వామి సీతారాం, తెనాలికి సమీపంలోని కావూరు వినూనాశ్రయంలో ఆమరణ నిరాహార దీక్ష 35 రోజుల పాటు చేసి తర్వాత విరమించాడు. దీంతో మరోసారి ఆంధ్రులు భంగపడ్డారు.

సరిగ్గా ఈ తరుణంలోనే ఆంధ్రోద్యమం ఒక గొప్ప మార్పుకు లోనయింది. పొట్టి శ్రీరాములు ఒక సామాన్య కాంగ్రెస్ కార్యకర్త, గాంధేయవాది. మహాత్ముడి సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా పాటించిన నియమశీలి. ఖద్దరు ఉద్యమం, హరిజన సేవా కార్యక్రమాల్లో, తృణమూల స్థాయిలో పాల్గొన్నారు. నిరాడంబరత్వానికి మారుపేరు. ఆంధ్రదేశంలో గాంధీ స్మారకనిధికి సంచాలకుడుగా పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రసిద్ధి కోసం తీర్మానించుకొని, మద్రాసు నగరానికి ప్రయాణం కట్టాడు. 1952 అక్టోబర్ 19 నాడు ప్రశాంత వాతావరణంలో నిరాహార దీక్షకు పూనుకున్నాడు. పచ్చి మంచినీళ్ళు మినహా ఏమి తీసుకోలేదు. రోజులు గడిచాయి. శ్రీరాములు ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. పరిష్కారం కనపడకపోగా, మద్రాసులేని రాష్ట్రం వద్దని టంగుటూరు ప్రకాశం ప్రభృతులు, రాయలసీమ జిల్లాలు మద్రాసులోనే వుండాలని నీలం సంజీవరెడ్డి ప్రభృతులు సమస్యను మరింత జటిలం చేశారు. ఈలోపు పుణ్యకాలం దాటిపోయింది. డిసెంబర్ 15, 1952న శ్రీరాములు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వాంతులవ్వడం, నాడి వేగం పెరగడంతో ఆయన అపస్మారక స్థితికి చేరారు. ఆ రాత్రి 11.23 గంటలకు పొట్టి శ్రీరాములు అమరుడయ్యాడు. ఆయన మరణవార్త దావానలంలా వ్యాపించింది. పౌర జీవితం స్తంభించిపోయింది. ఎక్కడి రైళ్ళు బస్సులు అక్కడ ఆగిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు పనిచేయడం మానేశాయి. విజయవాడ, గుంటూరు లాంటి పట్టణాల్లో ప్రభుత్వం పని చేయడం మానేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని (మద్రాసు మినహా) ప్రకటించింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం రాష్ట్రాన్ని సాధించింది. ఆంధ్రుల చరిత్రలో శ్రీరాములు అమరజీవిగా నిలిచిపోయారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రాన్ని కలుపుకొని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. కానీ, ప్రజారాజ్యం ఇంకా ఆంధ్రులు సాధించుకోవాల్సి ఉంది.



రెండోసారి దుర్గాబాయమ్మ, కాకినాడలో గాంధీని
చూసింది. ప్రత్యేకంగా స్త్రీల సమావేశంలో గాంధీజీ
పాల్గొని, మాట్లాడాలని ఆమె కోరారు. ఆ సమావేశానికి
దేవదాసీలను, పరదా స్త్రీలను, సాంఘికంగా ఆర్థికంగా
చితికిపోయిన మామూలు స్త్రీలను ఆమె ఆహ్వానించారు.
కానీ సమావేశానికి, నాయకులు ఒప్పుకోలేదు.
దుర్గాబాయమ్మ పట్టుబట్టింది. ఐదు వేల రూపాయలు
నిధి సేకరించి ఇస్తే, ఏర్పాటు చేస్తామన్నారు. డబ్బు
వసూలు చేసి, ఆమె సమావేశానికి గాంధీగారిని కలిసే
వీలుకల్పించుకున్నారు.

## గాంధీ కాకినాడకు రావటమే..

ఆధునిక భారతదేశంలో స్త్రీ, జనాభ్యుదయానికి ఎందరో మహిళా మణులు కృషి చేశారు. సావిత్రిపూలే, కందుకూరి రాజ్యలక్ష్మమ్మ, కమలాదేవి ఛటోపాధ్యాయ, సరోజినీ నాయుడు, ముత్తు లక్ష్మీరెడ్డి, యామినీ పూర్ణ తిలకం ఇలా యెందరో- వీరిలో భావజాలాన్ని పెంపొందించిన వారితోపాటు, కార్యరంగంలో దూకి స్త్రీల జీవన పరిస్థితులను మెరుగుపర్చిన వారు వున్నారు.

ఆంధ్రదేశంలో, స్త్రీ జనోద్ధరణకు, సమాజంలో వారి జీవనస్థాయిని పెంచడానికి. దిక్కూ, మొక్కూలేని అనాథలతోపాటు, సాంఘిక, ఆర్థిక వెనుకబాటు తనానికి గురైనవారిని ఉద్దేశించిన వారిలో, గుమ్మడి దుర్గా బాయమ్మ ప్రముఖులు (చింతామణి దేశముఖ్‌ను పెండ్లాడాక, ఈమే దుర్గాబాయ్ దేశముఖ్‌గా పేరొందారు)

పుట్టింది 1909 (జులై 15) సంవత్సరం, సాంప్రదాయ కుటుంబంలో. 10-11 ఏళ్ల వయసులో బాల్య వివాహం, వైవాహిక జీవితం సజావుగా సాగలేదు. పెద్ద చదువులు చదివే అవకాశాలూ అప్పుడు లేవు. రాజమండ్రిలో పుట్టిన దుర్గాబాయమ్మ, కాకినాడకు

మకాం మార్చి తల్లి కృష్ణవేణమ్మతో కలిసి, చిన్న స్కూలు పెట్టి, ముఖ్యంగా ఆడపిల్లలకు చదువు నేర్పేవారు. చిన్నతనం నుండి, సాంఘిక, రాజకీయ కార్యకలాపాలపై మక్కువ ఎక్కువ. దృఢమైన అభిప్రాయాలు, నమ్మకాలు చిన్నతనం నుండే వుండేవి. తన స్వంత జీవిత అనుభవాన్నుండో, లేక సామాజిక వాస్తవికత వల్లనో, స్త్రీల కొరకు తన జీవితాన్ని అర్పించుకోవాలన్న కోర్కె ఆమెలో బలంగా వుండేది. కానీ కాకినాడలో వుంటూ, సాదా సీదా జీవితం గడుపుతున్న దుర్గాబాయమ్మకు ఇదెలా సాధ్యం ?

జీవితం చిత్రమైంది. అనుకోని మలుపులు తిరుగుతుంది. సాధ్యంకాదనుకున్న దాన్ని సాధించి తీరుతుంది. ఎత్తు పల్లాల్లో, ఎగుడు దిగుడుగా ముందుకు సాగుతూ ఉంటుంది. అదే క్రమంలో మనల్ని అబ్బురపరిచే ఘటనలతో, జీవిత గమనాన్నే మారుస్తుంది. 1920 దశకంలో, ఇలాంటి రెండు సంఘటనలు దుర్గాబాయ్ జీవితాన్ని సమూలంగా మార్చి వేశాయి.

గాంధీజీ 1919, 20లలో ఆంధ్రప్రదేశ్ పర్యటనకొచ్చారు. ఎక్కడకు వెళ్ళినా, జాతీయోద్యమానికి కావల్సిన నిధులు గాంధీ సేకరించేవారు. రాజమండ్రిలో ఆమె గాంధీని దర్శించారు. అందరూ పోగుచేసిన విధంగా తానూ, కొంత డబ్బు సేకరించి ఆయనకు సమర్పించింది. ఆ డబ్బు అందుకొంటూ ఆ చిన్నారి (అప్పుడామె వయసు 10-11 సంవత్సరాలే)చేతి బంగారు గాజులను చూసి, "ఇవి కూడా దేశం కోసం ఇవ్వవా" అన్నారు. అంతే, సంతోషంగా తీసి ఆయన చేతిలో పెట్టింది. ఆయనలో వున్న సమ్మోహన శక్తి అలాంటిది. మట్టి నుండి మాణిక్యాలను సృష్టించిన మహత్తర ఆకర్షణ ఆయనలో వుండేది.

రెండోసారి దుర్గాబాయమ్మ, కాకినాడలో గాంధీని చూసింది. ప్రత్యేకంగా స్త్రీల సమావేశంలో గాంధీజీ పాల్గొని, మాట్లాడాలని ఆమె కోరారు. ఆ సమావేశానికి దేవదాసీలను, పరదా స్త్రీలను, సాంఘికంగా ఆర్థికంగా చితికిపోయిన మామూలు స్త్రీలను ఆమె ఆహ్వానించారు. కానీ సమావేశానికి, నాయకులు ఒప్పుకోలేదు. దుర్గాబాయమ్మ పట్టుబట్టింది. ఐదు వేల రూపాయలు నిధి సేకరించి ఇస్తే, ఏర్పాటు చేస్తామన్నారు. డబ్బు వసూలు చేసి, ఆమె సమావేశానికి గాంధీగారిని కలిసే వీలుకల్పించుకున్నారు. సభకు గాంధీ వచ్చారు. స్త్రీల స్థితిగతులను, వారి వ్యధాభరిత జీవితాల్ని గూర్చి, వారిని పైకి తీసుకురావాల్సిన అవసరాన్ని గూర్చి, దుర్గాబాయమ్మ హిందీలో సరళంగా, విశదంగా మాట్లాడారు. గాంధీ ముగ్ధులయ్యారు. రెండు నిముషాలని చెప్పి వచ్చిన గాంధీ రెండు గంటలు గడిపారు. ఆయన ఉపన్యాసాలను హిందీలో నుండి తెలుగులోకి, అప్పటి వరకు కొండా వెంకటప్పయ్య అనువదించేవారు. ఇక ఇప్పటి నుండి ఆ కార్యక్రమాన్ని దుర్గాబాయమ్మకు అప్పచెప్పారు గాంధీజీ. గాంధీ కాకినాడకు రావడం, ఆమె జీవితాన్ని గొప్పమలుపు తిప్పింది.


ఒక వందరూపాయల బ్యాంకు ఖాతాతో ఆరంభించిన ఆమె సాంఘిక సేవా కార్యక్రమాలు ఇంతింతై, వటుడింతై అన్నట్లు, మద్రాసులో, ఆ పిమ్మట హైదరాబాద్‌లో శాఖోపశాఖలుగా విస్తరించి వందల కోట్ల రూపాయలకు చేసే వనరులకు అభివృద్ధి



91738

చెందాయి. 'పిట్టకొంచెం కూత ఘనం' అన్న సామెతగా దుర్గాబాయ్ జీవితంలో జరిగిన మరో సంఘటన గూడా గుర్తుంచుకోదగిందే. కాకినాడలో కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు దుర్గాబాయమ్మ వయసు 13-14 ఏండ్లు మాత్రమే అయినా వాలంటీరుగా నమోదయింది. ఎగ్జిబిషన్ వద్ద ఆమెను వాలంటీరుగా వుంచారు. కొండా వెంకటప్పయ్య వచ్చి,, "టిక్కెట్టు లేకుండా ఎవరినీ, దేవుడైనా సరే, లోపలికి పంపడానికి వీల్లేదు. తెలిసిందా, " అని హెచ్చరించారు. అలానే జాగ్రత్తగా తన విధులు నిర్వహిస్తున్న సమయంలో, నెహ్రూ టిక్కెట్టు దగ్గరుంచుకోకుండా వచ్చారు. దుర్గాబాయమ్మ లోపలికి వెళ్ళడాన్కి వీల్లేదని నిక్కచ్చిగా చెప్పారు. అందరూ ఆశ్చర్యపోయారు. "ఎవరనుకొంటున్నావు. ఆయన నెహ్రూ" అన్నాడు. "ఎవరైనా సరే వెళ్ళనివ్వను. నా డ్యూటీ చేస్తున్నాను" అన్నారు. నెహ్రూ ఆమె ధర్మనిర్వహణకు మెచ్చుకొని అభినందించారు.

పైన మనం చెప్పుకొన్న ఘటనలు ఆమె వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడ్డాయి. ధృఢ చిత్తంతో పని చేయడానికి దోహదం చేశాయి. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని కఠిన కారాగార శిక్ష అనుభవించారు. రాజ్యాంగ నిర్ణాయక సభలో సభ్యురాలిగా పని చేశారు. స్వాతంత్ర సముపార్జన తర్వాత, జాతీయ ప్లానింగ్ కమిషన్‌లో స్త్రీ సంక్షేమ విభాగాన్ని పర్యవేక్షించడానికి ఆమెను నెహ్రూ నియమించారు. మొక్కవోని దీక్షతో, నిర్భీతితో, స్త్రీల సంక్షేమానికి పని చేసిన దుర్గాబాయమ్మ స్త్రీల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది.



*అంతర్యుద్ధం 1865లో అంతం కాగా ఆ తర్వాత లింకన్ రెండోసారి అధ్యక్షుడిగా గెలిచారు. ఆ తర్వాత కొద్ది వారాల్లోనే, ఒక థియేటర్ నాటకం చూస్తుండగా, జాన్ విల్క్స్ బూత్ అనే దుండగుడు లింకన్‌ను కాల్చి చంపాడు.*

# అబ్రహాం లింకన్ అధ్యక్షుడు కావడమే...

**మా**నవులందరూ పుట్టుకతో సమానులు. పెద్దా, చిన్నా, తెలుపూ, నలుపూ, బీదా, ధనిక తేడాలుండవు. అందరూ స్వేచ్ఛగా, స్వతంత్రంగానే పుడతారు. హెచ్చు తగ్గులు ఆ తర్వాత వచ్చేవే ! అందుకే ప్రఖ్యాత తత్వవేత్త రూసో పుట్టాకే మనుషుల చుట్టూ సంకెళ్ళ పెనవేసుకొని, వారిని అస్వతంత్రులుగా చేస్తాయని అంటాడు.

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు (యుఎస్ఎ) చరిత్ర 500 సంవత్సరాలు. అంతకు ముందు అక్కడున్న ఆ దేశ వాసులు -రెడ్ ఇండియన్లు, ఇవ్వాళ చూద్దామంటే మచ్చుకైనా కనపడరు. వారి నాగరికతా, సంస్కృతులు మ్యూజియాల్లో దొరుకుతాయి. ఐరోపాఖండం నుండి, ముఖ్యంగా ఇంగ్లండ్‌లో నెలకొన్న మతవైషమ్యాలను, మతపరమైన పీడనను తప్పించుకొని స్వేచ్ఛగా బతకడానికి అమెరికా సంయుక్త రాష్ట్రాలకు వెళ్ళిన వారు, కొన్ని సంవత్సరాలకు మాతృభూమిపై తిరగబడి స్వాతంత్రం సంపాదించుకొన్నారు. ఆ స్వాతంత్ర్య ప్రకటనలో చారిత్రాత్మక సత్యాన్ని చాటి చెప్పారు. అదేమంటే పుట్టుకతో మానవులంతా


సమానులు అని. అలా ప్రకటించిన అమెరికా తన వరకు వచ్చే సరికి లక్షలాది మందికి ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి, వారిని బానిసలుగా చేసింది. ఈ బానిసత్వ నిర్మూలన ఒకానొక చారిత్రక ఘటనతో సాధ్యమైంది.

నూతనంగా కనుగొన్న అమెరికా దేశం సువిశాలమైంది. నీరు, భూమి, గాలి చక్కటి వాతావరణం పుష్కలంగా ఉన్న ఒక ఖండం. సంపద ఉత్పత్తికి అన్నీ, అనువుగా వున్నా, ఉత్పత్తి చేయగల దైహిక శ్రమశక్తి లేదు. తెల్లజాతివారు సరిపడ సంఖ్యలో లేకపోవడమటుంచి, విస్తరిస్తున్న సువిశాల వ్యవసాయక్షేత్రాల్లో రాత్రీ పగలు కష్టించి పనిచేసే దేహదారుఢ్యం వారికి లేదు. ఆ పరిస్థితుల్లో, ఆఫ్రికా ఖండ తీరాన్నుండి (దాన్ని బానిస తీరం అన్నారు) వేల నుండి లక్షలదాకా, నల్లజాతి వారిని (నీగ్రోలు) పట్టుకొని, గొలుసుల్లో బంధించి అరలు అమర్చిన ఓడలో, ఐదున్నర అడుగుల పొడవు, 16 అంగుళాల వెడల్పు బెర్తులో ఉంచి నెలల పాటు అట్లాంటిక్ సముద్రం మీదుగా, అమెరికా తూర్పు తీరానికి కొనిపోయేవారు. బహిరంగంగా వేలం వేసి అమ్మేవాళ్ళు. వీళ్ళకు ప్రాథమిక హక్కులు కాదు కదా, సరైన తిండి లేదు. పశువులను కట్టి పడేసినట్లు చేసి, కాయకష్టం చేయించుకొని వారి, చెమటతో తడిసి పండిన ధనధాన్యాలను కొల్లగొట్టేవాళ్ళు. ముఖ్యంగా అమెరికాలోని దక్షిణాది రాష్ట్రాల్లో బానిసత్వం ఎక్కువ. అక్కడ సువిశాల వ్యవసాయ క్షేత్రాలు, వేల ఎకరాల్లో ఉండేవి. ఉత్తరాది రాష్ట్రాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెంది, బానిస శ్రమశక్తితో అంతగా అవసరముండేదికాదు. అందువల్ల, ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య ఆర్థికపరమైన, రాజకీయ పరమైన విభేదాలు తలెత్తాయి. ఒక విధంగా ఉత్తరాది రాష్ట్రాలు బానిసత్వానికి వ్యతిరేకమనే అభిప్రాయం ఏర్పడింది.

సరిగ్గా ఈ తరుణంలో, అబ్రహాం లింకన్ అమెరికాకు 16వ అధ్యక్షుడుగా 1860లో ఎన్నికయ్యాడు. లింకన్ ఎన్నిక దక్షిణాది రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించింది. నిజానికి లింకన్ బానిసత్వ నిర్మూలనాకారుడు కాదు. కానీ, బానిసత్వానికి వ్యతిరేకి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కావాలనే మనీషి. ఎక్కడైతే బానిసత్వం అమల్లో ఉందో, అయా రాష్ట్రాల్లో జోక్యం చేసుకోనన్నాడు. బానిసత్వం లేని రాష్ట్రాలకు, కొత్తగా వ్యాపింపచేయడానికి, దాన్ని చట్టబద్ధం చేయడానికి వ్యతిరేకినని స్పష్టంగా ప్రకటించాడు. దక్షిణాది రాష్ట్రాలు దీంతో సంతృప్తి చెందక, అమెరికన్ యూనియన్ నుండి, విడిపోయి వేరే దేశంగా ఏర్పడాలన్న ఉద్దేశ్యంతో విడిపోనారంభించాయి. దేశ ఉనికి దీంతో దెబ్బతిననారంభించింది. ఐక్యత దెబ్బతినడానికి లింకన్ ససేమిరా ఒప్పుకోనన్నాడు. దేశ ఐక్యతను ఎలాగైనా కాపాడ్డానికి శపథం చేశాడు. అంతర్యుద్ధం మొదలైంది. 1861 నుండి నాలుగు సంవత్సరాల పాటు, దక్షిణ కీకారణ్యాల మధ్య భీకర యుద్ధం జరిగింది. అంతర్యుద్ధం నాటికి అమెరికాలో 40 లక్షల మంది నల్లజాతి బానిసలున్నారు (1770లో వారి సంఖ్య 7 లక్షలు మాత్రమే) దక్షిణాది రాష్ట్రాలకు, ధనం, సైన్యం అన్ని వనరులు ఎక్కువగా వున్నా లింకన్ సర్వాన్ని ఒడ్డి దీక్షతో పోరాడి అంతర్యుద్ధంలో గెలుపు సాధించాడు. బానిస విముక్తి చట్టాన్ని లింకన్ అమల్లోకి తెచ్చాడు. బానిసత్వం నిర్మూలింపబడింది. అంతర్యుద్ధం 1865లో అంతం

కావడం, ఆ తర్వాత లింకన్ రెండోసారి అధ్యక్షుడిగా గెలిచారు. ఆ తర్వాత కొద్ది వారాల్లోనే, ఒక థియేటర్ నాటకం చూస్తుండగా, జాన్ విల్క్స్ బూత్ అనే దుండగుడు లింకన్‌ను కాల్చి చంపాడు.

అబ్రహం లింకన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల అధ్యక్షులలో అగ్రగణ్యుడు. అతి పేద కుటుంబంలో, కొయ్య దుంగలతో, నిర్మించిన ఒకే ఒక గది ఉన్న ఇంట్లో జన్మించి, స్వయం కృషితో పెరిగి, పెద్దవాడయ్యాడు. మంచి వక్త, అంతర్యుద్ధ కాలంలో యూనియన్ సైన్యాలను తన వాగ్ధాటితో ఉత్తేజితులను చేసేవాడు. ప్రజాస్వామ్యానికి లింకన్ చెప్పిన నిర్వచనం, సార్థకంగా నిలిచిపోయింది.




*అయస్కాంత సూచితో నిర్మించిన దిక్సూచి. దీన్ని ప్రాథమికంగా, 13 శతాబ్దంలోనే కనుగొన్నా, 15వ శతాబ్దానికి ఇది పూర్తిగా అభివృద్ధి చెంది, వ్యాప్తిలోకి వచ్చింది. ఇది కనుగొనకముందు నావికులకు తామే దిశగా ప్రయాణిస్తున్నామో తెలిసేది కాదు. సముద్రంలోకి దూరంగా వెళ్ళినప్పుడు, దిక్కుతోచని స్థితిలో, అయోమయంలో పడేవారు నావికులు. కొంతవరకు నక్షత్రాల, సూర్య, చంద్రుల ఉనికి మీద ఆధారపడి తమ నౌకాయానాన్ని కొనసాగించేవారు. చీకటి అలుముకొన్న రాత్రిళ్ళలో, ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకొచ్చినప్పుడు నావికుల పరిస్థితి ప్రమాదకరంగా పరిగణించేది. ఈ పరిస్థితిని దిక్సూచి మార్చివేసింది.*

# ప్రపంచాన్ని కుదించిన దిక్సూచి

**ప్రా**చీన యుగంలో, ప్రపంచంలోని దేశాల మధ్య రాకపోకలు అంతగా లేనందువల్ల, అవగాహన తక్కువ. ప్రాచీన ఈజిప్టు, గ్రీస్, రోమ్‌లలోని ప్రజలకు దూరప్రాచ్యంలోని చైనా, జపాన్‌ల గురించి చాలా కొద్దిగానే తెలుసు ప్రాచీన చైనీయులకు ఐరోపా ఖండం గూర్చి కేవలం ఊహాజనిత అభిప్రాయాలుండేవి. దక్షిణ అమెరికాలోని ప్రసిద్ధిగాంచిన మాయా, అజెటిన్, ఇన్కా నాగరికతల గూర్చి అసలు తెలీని పరిస్థితి చైనా, భారతదేశాల మధ్య అతి ప్రాచీన కాలం నుండి సత్సంబంధాలుండేవి

ఈ పరిస్థితిలో 15,16 శతాబ్దాల నుండి పెనుమార్పు వచ్చింది దీనిక్కారణం సాంస్కృతిక పునరుజ్జీవనం కల్గించిన చైతన్యం. ఇతర దేశాల, అక్కడి మానవ సమాజాల పట్ల, ఆయా దేశాల్లో లభ్యమయ్యే వైవిధ్య భరితమైన వస్తు సామాగ్రి పట్ల ఉత్సుకత పెరిగింది

ప్రజల్లో ఒక విధమైన చొరవ, సాహసం కానవచ్చింది. అయితే, మధ్య యుగాల్లో ఐరోపా, ఆసియా ఖండాల మధ్య లాభసాటి వ్యాపారం, తూర్పు రోమన్ సామ్రాజ్య రాజధాని కాన్స్టాంటి నోపుల్ మీదుగా భూ మార్గం ద్వారా జరిగేది ఇది 1453లో ఆగిపోయింది. కారణం కాన్స్టాంటి నోపుల్ పట్టణాన్ని ఒటోమాన్ టర్కీలు ఆక్రమించుకున్నారు. వీరు ఇస్లాం మతస్థులు, ఐరోపావాసులు క్రైస్తవులు అందువల్ల ఐరోపా వ్యాపారులను తమ రాజధాని గుండా ప్రయాణం చేయడాన్ని, వ్యాపార కార్యకలాపాలు సాగించడాన్ని ఒప్పుకోలేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ ఆరంభమైంది ఇది సముద్ర మార్గాలపైనే సాధ్యమవుతుంది. చైనాలో పట్టు వస్త్రాలు, భారతదేశంలోని నేత వస్త్రాలు, వజ్రాలు, తూర్పుదేశాల్లో పుష్కలంగా లభ్యమయ్యే సుగంధద్రవ్యాలు పాశ్చాత్యులను ఆకర్షించాయి

దీనికి తోడు, 15వ శతాబ్దం నాటికి ఐరోపాఖండంలో భౌగోళిక శాస్త్ర పరిజ్ఞానం పెరిగింది ఇది నూతన సముద్రమార్గాల అన్వేషణకు దారితీసింది. ఇటలీలోని ఫ్లోరెన్స్ నగరానికి చెందిన భౌగోళిక శాస్త్ర వేత్త "సీక్రెట్ ఆఫ్ ది ఫైత్‌ఫుల్ క్రూసేడర్స్" అనే గ్రంధాన్ని, వెనిస్ నగర వాసి "ఏ మర్చంట్స్ హ్యాండ్ బుక్" రాశారు అదే క్రమంలో అనే గ్రంథాలు తోడ్పడ్డాయి

ఇదంతా ఒక ఎత్తుకాగా, భౌగోళిక పరిశోధన జరిగింది. ఇక్కడే చరిత్ర తీవ్ర మార్పుకు గురైంది అదే, అయస్కాంత సూచితో నిర్మించిన దిక్సూచి దీన్ని ప్రాధమికంగా, 13 శతాబ్దంలోనే కనుగొన్నా, 15వ శతాబ్దానికి ఇది పూర్తిగా అభివృద్ధి చెంది, వ్యాప్తిలోకి వచ్చింది ఇది కనుగొనకముందు నావికులకు తామే దిశగా ప్రయాణిస్తున్నామో తెలిసేది కాదు సముద్రంలోకి దూరంగా వెళ్ళినప్పుడు, దిక్కుతోచని స్థితిలో, అయోమయంలో పడేవారు నావికులు కొంతవరకు నక్షత్రాల, సూర్య, చంద్రుల ఉనికి మీద ఆధారపడి తమ నౌకాయానాన్ని కొనసాగించేవారు చీకటి అలుముకొన్న రాత్రిళ్ళలో, ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకొచ్చినప్పుడు నావికుల పరిస్థితి ప్రమాదకరంగా పరిగణించేది. ఈ పరిస్థితిని దిక్సూచి మార్చివేసింది ఇప్పుడు నావికులు నిర్భయంగా సముద్రంలో ఎంత దూరమైనా పోవచ్చు దిక్సూచి సహాయంతో, ఏ దిక్కులో పయనిస్తున్నారో, యెటువెడితే, ఏ దేశంలో చేరవచ్చునో తెలుసుకోగలిగారు

దిక్సూచి కనుగొన్నాక భౌగోళిక అన్వేషణలు ఊపందుకున్నాయి. పోర్చుగల్, స్పెయిన్ దేశాల పాలకులు వీటిని ప్రోత్సాహించారు. కొలంబస్ అమెరికా ఖండాన్ని కనుగొనడం, వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గం కనిపెట్టడం, ఫెర్డినాండ్ మాజిలాన్ మొత్తం భూగోళాన్ని చుట్టిరావడం సాధ్యమైంది మొత్తం ప్రపంచం మానవుల పరిచయంలోకి వచ్చి, విభిన్న ప్రాంతాలు పరస్పర సంబంధాలను ఏర్పర్చుకొన్నాయి దిక్సూచి యావత్ ప్రపంచాన్ని కుదించి, మనిషి జ్ఞాన పరిధిలోకి తెచ్చింది.

★★★



91738

చరిత్ర బోధకులుగా, రచయితగా, ప్రగతిశీల మేధావిగా సుపరిచితులైన ఆచార్య వకుళాభరణం రామకృష్ణ టర్నింగ్ పాయింట్ పేరుతో ప్రజాశక్తిలో 2005-06 మధ్య ధారావాహికంగా ఈ రచనలు అందించారు. సామాజిక రాజకీయ రంగాలలో పోరాటాలు ఉద్యమాలలో శాస్త్రసాంకేతిక కళా సాహిత్య రంగాలలో గొప్ప మలుపులకు కారణమైన ఎన్నో ఉజ్వల ఘట్టాలను, ఎందరో మహనీయుల ఉన్నత వ్యక్తిత్వాలనూ ఈ శీర్షికలో కళ్ళకు కట్టారు. తెలుగు ప్రజల పోరాటాలు మొదలు అంతర్జాతీయ పరిణామాల వరకూ అనేక అంశాలను పరిచయం చేశారు. అప్పట్లో పాఠకులను బాగా ఆకర్షించిన ఈ ఖండికలనే పుస్తక రూపంలో అందిస్తున్నాం. రకరకాలైన ఈ ఘట్టాలన్నిటినీ ఒక్కచోట అందించే పుస్తకం తెలుగులో రాలేదు. ఈ విధంగా ఇది చదువరులను ఉత్తేజపరచగలదు.

ప్రజాశక్తి బుక్‌హౌస్